గుణశర్మ కథ 1



కథా సరిత్సాగరం

మదనసుందరి కథ 1

సుందరసేనుని కథ 1

కథా సరిత్సాగరం

అనగనగా ఉజ్జయిని నగరం. ఆ నగరానికి రాజు మహాసేనుడు. అతను అందగాడు. మంచి చెడ్డలు బాగా తెలిసిన వాడు. మంచిని పెంచే వ్యక్తులంటే ఇష్టం అతనికి. కళలంటే విపరీతమయిన మక్కువ. అతని భార్య పేరు అశోకవతి. ఆమె మహా అందగత్తె. అంతటి అందగత్తె ముల్లోకాల్లోనూ లేదు. భార్యంటే రాజుకి ప్రాణం.

రాజుని ఆశ్రయించి అతని నీడలా ఉంటున్నాడు గుణశర్మ. గొప్ప శూరుడతను. అందగాడు కూడా. వేద వేదాంగాలు చదువుకున్నాడు. అరవై నాలుగు కళల్నీ అవుపోసన పట్టాడు. అస్త్ర శస్త్ర ప్రయోగాల్లో గుణశర్మను మించిన వారు లేరు. రాజు అతన్ని 'హితుడా' అని పిలుస్తాడు. రాజునతను 'దాతా' అంటాడు.



గుణశర్మ కథ 1

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు 'అనీలజ' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

ఆనాడది వెన్నెల రాత్రి. అంతఃపురంలో రాజు-రాణి, వారితో పాటు గుణశర్మ ఉన్నాడక్కడ. వారంతా రాజ్యంలో నాట్యగత్తెలు, రకరకాల నాట్యాల గురించి సంభాషించుకోసాగారు. ఉన్నట్టుండి రాజుగారిలా అన్నారు.

"గుణశర్మా! నీకు నాట్యం బాగా వచ్చని చాలా మంది చెప్పారు. చూడ కళ్ళు చాలవన్నారు. నేనెప్పుడూ చూడలేదు. ఇవాళ ఈ వెన్నెల్లో నీ నాట్యం చూడాలనిపిస్తోంది. చెయ్"

"అవును గుణశర్మా! చెలికత్తెలు చెప్పగా నేనూ విన్నాను. మీ నాట్యం అద్భుతం అంటారంతా. ఏదీ చేసి చూపించండి" అడిగింది అశోకవతి. హఠాత్తుగా రాజు-రాణి ఇద్దరూ తనని అలా అడిగేసరికి సమాధానం ఏం చెప్పాలో తెలియని అయోమయ స్థితిలో పడ్డాడు గుణశర్మ. తర్వాత తేరుకున్నాడు.

"మీరు నన్ను ఆట పట్టించేందుకు అంటున్నారు కాని, నా నాట్యం సంగతి మీకు తెలియంది కాదు. దయచేసి నన్ను వదిలేయండి" అన్నాడు గుణశర్మ.

"వదిలేది లేదు! నువ్వు నాట్యం చేసి తీరాల్సిందే" అన్నాడు రాజు.

"నాట్యం నాకంతగా రాదు మహారాజా! చేస్తే మీరు నవ్వుతారు. సరదాగా నేర్చుకున్నదే కాని, దాంట్లో నైపుణ్యం నాకెంత మాత్రమూ లేదు. పైగా సకల శాస్త్రాలు తెలిసిన మీ ముందు నా నాట్యం ప్రదర్శించడం బాగోదు. పైగా రాణిగారి ముందు ప్రదర్శించడం పద్ధతి కాదు, సిగ్గనిపిస్తోంది." అన్నాడు గుణశర్మ.

"రాణి పరాయిదని ఎలా అనుకుంటున్నావు? నేను నీ మిత్రుణ్ణి. రాణి నా భార్య. మిత్రుని భార్య నీకు చెల్లెల్లాంటిది. చెల్లెలి ముందు నాట్యం చేయడానికి సిగ్గెందుకు?" నవ్వాడు రాజు.

"అయినా ఇది పండిత జన మధ్యంలో

చేస్తోన్న నాట్యం కాదు, మనలో మనం...మా ముందు నువ్వు చేస్తోన్న నాట్యం. నువ్వు చేసి తీరాలి. నేను చూసి తీరాలి. అంతవరకు భోంచేసేదే లేదు'' అన్నాడు రాజు మళ్ళీ.

''అయ్యయ్యో! రాజుగారు భోంచేయనంటున్నారు. విన్నావా'' బాధపడింది అశోకవతి.

''దయచేసి మా ముద్దు తీర్చవయ్యా'' అంది మళ్ళీ. దాంతో తనకి నాట్యం చేయడం తప్పదనుకున్నాడు గుణశర్మ. ఉత్తరీయాన్ని తీసి నడుముకి బిగించాడు. పంచె ఎగ్గట్టాడు. చేతులు జోడించి ముందు రాజుకి నమస్కరించి తర్వాత నాట్యం ప్రారంభించాడు.

రకరకాల భంగిమల్లో గుణశర్మ ఒదిగిపోతోంటే మట్టి ముద్దలా అతను మలచుకునిపోతుంటే హావభావాలొలికిస్తూ అదిగో అక్కడ...ఇదిగో ఇక్కడగా కనిపిస్తూ నాట్యం చేస్తోంటే నిజంగానే చూడ కళ్ళు చాలలేదు రాజుకి-రాణికి. ఆనందాన్ని పట్టలేకపోయారు వాళ్ళు. కర తాళ ధ్వనులు చేసి గుణశర్మను అభినందించారు.

''అద్భుతం! మహాద్భుతం! నాట్యం రాదంటావేమి'' మెచ్చుకున్నాడు రాజు. గుణశర్మను గుచ్చి కౌగిలించుకున్నాడు. ఇంతలో పరుగున వెళ్ళి వీణను తీసుకుని వచ్చింది అశోకవతి. దానిని గుణశర్మకు అందించింది.

''మీ నాట్యం చూసి ముగ్ధులమయ్యాం. మీ సంగీతాన్ని కూడా రుచి చూపించండి. తరిస్తాం'' అడిగింది.

''ఆనందంగా'' అన్నాడు గుణశర్మ. వీణను శృతి చేయసాగాడు. అపశృతులు పలుకుతున్నాయి. తీగలను జాగ్రత్తగా గమనించాడతను. అందులో గుర్రం వెంట్రుక కనిపించింది. దానిని తీసి తొలగించాడు.

''ఈ వీణ పనికి రాదు మహారాజా! గుర్రం వెంట్రుకతో అపశ్రుతులు పలుకుతోంది. మరో వీణను కటాక్షించండి'' అడిగాడు గుణశర్మ. తీసిన వెంట్రుకను రాజుకి చూపించాడు. మరో వీణను అందించింది అశోకవతి. గుణశర్మ దానిని శృతి బద్ధంగా 'ఆహా' అనేట్టుగా వాయించాడు. రాగ జలధిలో రాజుని-రాణిని మునకలు వేయించాడు. తర్వాత రాజు కోరిక మేరకు తన శస్త్రాస్త్ర విద్యలను కూడా ప్రదర్శించాడు.

''మల్లయుద్ధం, బాహుయుద్ధాల్లో కూడా నీకు ప్రవేశం ఉంది కదా''

''అవును మహారాజా''

''అయితే చేతిలో ఎలాంటి అస్త్రం లేకుండా యుద్ధం చేసి నన్ను బంధించగలవా'' అడిగాడు రాజు.

''ప్రయత్నిస్తాను మహారాజా'' అన్నాడు గుణశర్మ.

''నేను మాత్రం ఆయుధాలతోనే నీ మీద దాడి చేస్తాను''

''చేయండి మహారాజా''

రాజు కత్తితో గుణశర్మ మీద దాడి చేశాడు. ఒడుపుగా తప్పుకున్నాడతను. మళ్ళీ దాడి చేశాడు రాజు. మళ్ళీ తప్పుకున్నాడతను. తప్పుకుని రాజును తాడుతో బంధించే అవకాశం కోసం వేచి చూడసాగాడు. దొరికింది అవకాశం. వినియోగించుకున్నాడు గుణశర్మ. రాజును బందీ చేశాడు. ఈసారి రాజు గదాయుధంతో గుణశర్మను ఢీ కొన్నాడు. తప్పుకున్నాడు గుణశర్మ. ఎలాగయినా గుణశర్మను గాయపరచాలని రాజు ప్రయత్నం. ఫలించట్లేదది. గురి చూసి గదను విసిరాడు రాజు. దాన్ని ఓ చేత్తో పట్టుకుని మరో చేత్తో తాడుతో రాజుని మళ్ళీ బందీని చేశాడు. మళ్ళీ మరో ఆయుధంతో...ఆ తర్వాత ఇంకో ఆయుధంతో...ఇలా రకరకాల ఆయుధాలతో గుణశర్మ మీద దాడి చేసి ప్రతిసారి ఓడిపోయాడు రాజు. అయితే తన ఓటమికి ఆనందించి గుణశర్మను అభినందించాడు రాజు. అతనికి మంత్రి పదవి ఇచ్చి రాజ్యపాలనలో పాలు పంచాడు.



అంతఃపురానికి తరుచూ వచ్చి పోతున్న అందగాడు గుణశర్మ అంటే అశోకవతికి మోజు కలిగింది. అతని కౌగిలిలో కరిగిపోవాలని, అతన్ని ముద్దులతో ముంచెత్తాలని ఆశ పడింది. గుణశర్మను దారిలో పెట్టుకునేందుకు ఎవరికీ అనుమానం రాని ఆలోచన చేసింది. రాజును అడిగిందిలా.

''నాకు వీణ నేర్చుకోవాలని ఉంది''

''నేర్చుకోండి రాణి''

''గుణశర్మ దగ్గర నేర్చుకోవాలని ఉంది''

''అతనే నేర్పుతాడు. ఆజ్ఞాపిస్తాం'' అన్నాడు రాజు. గుణశర్మను పిలిపించాడు.

''అశోకవతికి వీణ నేర్చుకోవాలని ఉందట! నువ్వే నేర్పాలి'' అన్నాడు రాజు.

''అవునా మహారాజా'' అని అశోకవతిని క్రీగంట చూశాడు గుణశర్మ. ఆమె కింది పెదవి పంటి కింద నొక్కి పెట్టి తమకంగా తననే చూడడాన్ని గ్రహించాడతను. అర్థం చేసుకున్నాడు.

''మంచి రోజు చూసి మొదలుపెడదాం మహారాజా'' అన్నాడు.

''సంగీతారాధనకి, ఆనందానికి మంచి రోజు అవసరమా'' బుంగమూతి పెట్టింది రాణి.

''అవసరమే మహారాణి! మంచి రోజు చూసుకునే దేన్నయినా మొదలు పెట్టాలి. చూసుకోకపోతే అభాసుపాలవుతాం'' అని నవ్వాడు గుణశర్మ. అతని మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించి ఆనందించింది రాణి.

''సరే! మీ ఇష్టం'' అంది. బతికాననుకుంటూ బయటపడ్డాడు గుణశర్మ. తర్వాత ఎప్పుడడిగినా రోజులు బాగోలేవంటూ మంచి రోజులు కావంటూ సాకులు చెప్పి తప్పించుకోసాగాడు. కొద్దిరోజులు గడిచాయి.

ఒకనాడు పాలనా పరమయిన విషయమై రాజుని కలిసేందుకు వచ్చాడు గుణశర్మ. ఆ సమయానికి రాజుగారు భోంచేస్తున్నారు.

''సమయానికి వచ్చావు! రా! భోంచేద్దాగాని'' కూర్చోమన్నట్టుగా ఉచితాసనాన్ని చూపించాడు రాజు.

''నేను భోంచేసే వచ్చాను మహారాజా'' అన్నాడు.

''మీ ఆతిథ్యాన్ని కాదంటున్నందుకు క్షమించండి'' అన్నాడు మళ్ళీ. అంతలో వంటవాడు కూరను తెచ్చి రాజుగారికి వడ్డించనుండగా అతనిని వారించాడు గుణశర్మ.

''ఏమయింది మిత్రమా'' అడిగాడు రాజు.

''ఈ కూరలో విషం ఉన్నది మహారాజా'' అన్నాడు గుణశర్మ. ఆ మాటకి చేష్టలుడిగిపోయాడు రాజు.

''కూరలో విషం ఉందా? ఎలా...ఎలా చెప్పగలిగావు నువ్వు'' అడిగాడు రాజు.

''వంటవాడి ప్రవర్తనతో మహారాజా! వాడు మీకు కూర వడ్డించబోతూ వణికిపోతున్నాడు. పైగా నన్ను చూసి బెదిరిపోతున్నాడు. కావాలంటే పరీక్షించండి'' అన్నాడు గుణశర్మ.

రాజు సాలోచనగా చూశాడు ముందు. తర్వాత గజగజా వణికిపోతున్న వంటవాణ్ణి చూశాడు.

''నువ్వు చేసిన కూర...నువ్వే తిను'' ఆజ్ఞాపించాడు రాజు. తినను! తినలేనట్టుగా తల వూపాడు వంటవాడు.

''తిను'' కసిరాడు రాజు. ఆ కసురుకి కూరను గబగబా నోట కుక్కుకున్నాడు వంటవాడు. తిన్నాడు. మరుక్షణంలో స్పృహ కోల్పోయాడు. దబ్బున కింద పడ్డాడు. అది చూసి రాజు దిగ్గున లేచి నిల్చున్నాడు.

''ఏంటిది గుణశర్మా! నన్నెందుకు చంపాలని చూశాడు వీడు'' అడిగాడు రాజు.

''శత్రువులు రాజుకే ఉంటారు దాతా'' అన్నాడు గుణశర్మ.

''అసలు నన్నెందుకు చంపాలనుకున్నాడు?'' భయపడ్డాడు రాజు.

''ఆ విషయమూ తెలుసుకుందాం'' అని వంటవాడు తెచ్చిన కూరను గుప్పెడు తీసుకుని దాన్ని తేరపారజూస్తూ మంత్రోచ్చారణ చేశాడు గుణశర్మ. ఆ మంత్రానికి కూరలోని విషం పైకి తేలి, గాలిలో కలసిపోయింది. వంటవాడి గుండెల్లో గూడుకట్టుకున్న విషం కూడా పెద్ద నిట్టూర్పుగా బయటికి వచ్చింది. వంటవాడు స్పృహలోనికి వచ్చాడు. కళ్ళు తెరిచాడు. గుణశర్మని, రాజుని చూసి లేచి నిల్చుని చేతులు జోడించాడు.

''క్షమించండయ్యా'' అన్నాడు.

''క్షమించడం తర్వాత సంగతి. ముందు రాజుగారిని ఎందుకు చంపదలచుకున్నావో ఆ

సంగతి చెప్పు" అడిగాడు గుణశర్మ.

"అదీ...అదీ" అని వంటవాడు నీళ్ళు నములుతోంటే "చెప్పు" అంటూ గట్టిగా గద్దించేసరికి వాడిలా చెప్పాడు.

"మాది గౌడదేశం. మా దేశం రాజు మిమ్మల్ని చంపమని నన్ను పంపాడు. వంటవాడిగా మీ అంతఃపురంలో కుదురుకుని, ఎప్పటి నుంచో మిమ్మల్ని చంపేందుకు ప్రయత్నిస్తున్నాను. ఇవాళ అటో ఇటో తేలిపోవాలని మా రాజు వర్తమానం పంపాడు. తేల్చేసేందుకు కూరలో విషం కలిపాను. దురదృష్టం! దొరికిపోయాను"

కన్నింతగా చేసి కోపాగ్నిలో రగిలిపోయాడు రాజు. "ఎవరక్కడ" అంటూ చప్పట్లు చరిచాడు.

"చిత్తం మహారాజా" వచ్చారు ద్వారపాలకులు.

"ఈ వంటవాడికి మరణశిక్ష విధిస్తున్నాను. తీసుకుని వెళ్ళి ఉరి తీయండి" అన్నాడు రాజు.

"మహారాజులు కనికరించాలి" అంటూ ప్రాధేయపడుతోన్న వంటవాణ్ణి రెక్కలు విరిచి కట్టి పట్టుకుపోయారు ద్వారపాలకులు. కాస్సేపు గడిచింది. తెప్పరిల్లాడు రాజు. గుణశర్మను అభినందనగా కౌగలించుకున్నాడు.

"నా ప్రాణాన్ని కాపాడినందుగ్గాను నీకేమిచ్చినా ఋణం తీరదు. వంద గ్రామాలు బహూకరిస్తున్నాను. అందుకో" అన్నాడు రాజు.

"మహాప్రసాదం" అని స్వీకరించాడు గుణశర్మ.

అశోకవతి పదే పదే అడగడంతోను, రాజుగారు ఆదేశించడంతోను ఇక తప్పదనుకుని రాణిగారికి వీణ నేర్పేందుకు సిద్ధమయ్యాడు గుణశర్మ. వీణ ఒళ్ళో పెట్టుకుని కూర్చున్న రాణికి, వీణను ఒడిలో ఎలా పెట్టుకోవాలో, పెట్టుకోవడంలోని మెళుకువలు నేర్పుతోంటే... అతని పెదవులను అందుకోజూసింది రాణి. తల తిప్పి తప్పించుకున్నాడు గుణశర్మ. మళ్ళీ దొరకవా అన్నట్టుగా మాటు వేసి కాచుక్కూర్చుంది రాణి. ఈసారి తంత్రులు ఎలా మీటాలో చెబుతోంటే అందుకోబోయింది. ఒక్కసారిగా తలను వెనక్కి లాక్కున్నాడు గుణశర్మ. లేచి నిల్చున్నాడు.

"వస్తాను మహారాణి" అని వెళ్ళబోయాడు. అడ్డుకుంది అతన్ని.

"ఇంతటి అందాన్ని కాదనుకుని ఎక్కడికి వెళ్తావు" అడిగింది.

"నువ్వంటే నాకిష్టం గుణశర్మా! నీ మీద నేను మనసు పడ్డాను." అంది మళ్ళీ.

"వీణ నేర్చుకోవడం చిన్న సాకు! మహారాజుగారికి అనుమానం రాకుండా" అని నవ్వింది. రా రమ్మంటూ చేతులు జాచింది. వేగిపోతున్నట్టుగా కళ్ళు మూసుకుంది.

"తప్పు చేస్తున్నారు మహారాణి! నేను ప్రభుద్రోహానికి ఒడిగట్టను" అన్నాడు గుణశర్మ. కళ్ళిప్పింది రాణి. నవ్వుతూ అంది.

"వలచి వచ్చానని చులకనా"

"కాదు, చెల్లెలితో సమాగమం మహానేరం"

"నేను నీకు చెల్లెల్నెలా అవుతాను. మాట వరసకన్న మహారాజు మాటను పట్టుకుని వేళ్ళాడకు! కంటి ముందరి సౌఖ్యాన్ని కాలదన్నుకోకు" అంది రాణి. అయినా గుణశర్మలో చలనం లేదు. ఇలా కాదనుకుంది రాణి. దుస్తులు తొలగించి అర్ధనగ్నంగా నిల్చుంది. గుణశర్మ కళ్ళు మూసుకున్నాడు.

"అంది వచ్చిన అదృష్టాన్ని వద్దనుకున్న వ్యక్తిని నిన్నే చూస్తున్నాను" అంటూ కళ్ళు మూసుకుని నిల్చున్న గుణశర్మను కౌగిలించుకోబోయింది. అంతలోనే కళ్ళిప్పి వెనక్కి జరిగాడతను. దాంతో బోర్లా కింద పడింది రాణి. చూస్తూ వూరుకున్నాడు గుణశర్మ. లేవనెత్తమని చేయి సాచినా అందుకోలేదతను. దాంతో లేచి నిల్చుని కోపంతో ఊగిపోయింది రాణి.

"నువ్వు నా కోరిక తీర్చకపోతే నేను ఛస్తాను" అంది.

"నేను చావడానికి ముందు నిన్ను చంపించి మరీ ఛస్తాను" అని బెదిరించింది.

"చావడం, చంపడం అంత తేలిక కాదు గాని, తప్పుకోండి నేను వెళ్ళాలి" అన్నాడు గుణశర్మ.

"నన్ను తక్కువ అంచనా వేస్తున్నావు కదూ" హెచ్చరించింది రాణి.

"లేదు! ఎక్కువగానే అంచనా వేస్తున్నాను. అధర్మం కోసం వెయ్యేళ్ళు బతికే కంటే ధర్మం కోసం క్షణం బతికినా చాలు! పైగా చావంటే నాకు భయం లేదు" అన్నాడు గుణశర్మ. రాణి సరికొత్త ఎత్తు వేసింది. గుణశర్మ కాళ్ళ మీద పడింది.

"మహారాణినయినా నీకోసం అలమటిస్తున్నాను. నన్ను కనికరించు" అన్నది.

"నన్ను నీ దాన్ని చేసుకో! అష్ట అయిశ్వర్యాలూ నీ ముందుంటాయి" ఆశ పెట్టింది.

"ఇంకా కాదన్నావంటే...నా మాట రాజు జవదాటడు. నేను చెప్పిందే వేదం అతనికి. నీ అంతు చూస్తాడు" బెదిరించింది. ఎవరో తామిద్దర్నీ గమనిస్తున్నట్టుగా అనిపించడంతో అలికిడికి అటుగా చూశాడు గుణశర్మ. రాణి దాన్ని పట్టించుకోనే లేదు. రాణి తనని వదిలేటట్టు లేదని, ఎలాగయినా తప్పించుకోవడమే తక్షణ పరిష్కారమని ఆలోచించి ఇలా అన్నాడు గుణశర్మ.

"బెదిరింపులకు కాదుగాని దేవీ! ఒకరోజు నీ కోరిక తప్పకుండా నెరవేరుస్తాను. ఇప్పటికొదిలేయ్"

"నిజం" అంటూ ఒట్టు వేయన్నట్టుగా చేతిని చాచింది రాణి.

"ఒట్టు" అని ఆమె చేతిలో చేయి వేశాడు గుణశర్మ. అంది వచ్చిన చేతిని అలాగే పెదాలకు ఆనించుకుంటుండగా తొలగించుకుని అక్కణ్ణుంచి చరచరా ముందుకు నడిచాడు.

(సశేషం)

యువరాజ్ సింగ్‌తో ప్రేమలో పడిన సమీరా....

సమీరారెడ్డికి సినిమాల కన్నా ప్రేమ వ్యవహారాలంటేనే మక్కువ ఎక్కువ అన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ లలో హీరోలందరూ అయిపోయినట్టున్నారు... ఇప్పుడు తాజాగా సమీరా కన్ను క్రికెటర్ యువరాజ్‌సింగ్ మీద పడింది. యువరాజ్‌సింగ్‌తో సమీరా క్లోజ్‌గా మూవ్ అవుతోందన్న వార్తలు ఫిలింనగర్‌లో జోరుగా షికారు చేస్తున్నాయి. యువరాజ్ కూడా సమీరా అంటే ఇష్టపడుతున్నాడని కూడా అంటున్నారు. వీరిద్దరి ప్రేమ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఈ ప్రేమ పక్షులకు కొందరైతే ఏకంగా బెస్టాఫ్ లక్ కూడా చెబుతున్నారు.

అశోకవతి కోరిక తీరుస్తానని చెప్పి తప్పించుకున్న గుణశర్మ, మళ్ళీ ఎప్పుడూ ఆమెను ఏకాంతంలో కలుసుకోలేదు. వీణ నేర్పేందుకు వెళ్ళడాన్ని కూడా మానుకున్నాడతను.

కొన్నాళ్ళు గడిచింది.

మహాసేనరాజు, సోమకేశ్వరుణ్ణి ముట్టడించాడు. కోటలోనే సోమకేశ్వరుణ్ణి బంధించాడు. సోమకేశ్వరుణ్ణి జయించిన ఆనందంలో రాజు ఉత్సవాలు జరుపుకుంటుంటే అతన్ని గౌడరాజు విక్రమశక్తి ముట్టడించాడు. మహాసేనుణ్ణి ముందుకు కదలనీయలేదతను. విక్రమశక్తి నుండి తాను బయటపడాలి. ఏం చెయ్యాలి? అని తలపట్టుకున్న మహాసేనుని సమీపించాడు గుణశర్మ.

‘‘డీలా పడకండి మహాదాతా! విక్రమశక్తి సంగతి నాకొదిలేయండి! నేను చూసుకుంటాను’’ అన్నాడు.

గుణశర్మ కథ 2



భారతీయ కథా సాహిత్యంలో ‘బృహత్కథ’ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని ‘గుణాఢ్యుడు’ పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు ‘కథా సరిత్సాగరం’ పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు ‘అనీలజ’ నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

‘‘ఏం చూసుకుంటావో ఏమో! ఈ కష్టం నుంచి మనం గట్టెక్కాలి’’ అన్నాడు రాజు.

‘‘తప్పకుండా మహారాజా’’ అన్నాడు గుణశర్మ. అక్కణ్ణుంచి బయల్దేరాడు. అంతర్ధాన అంజనం తయారుచేశాడు. దాన్ని శరీరానికి పూసుకుంటే ఎవరికీ కనిపించరు. ఆయుర్వేదాన్ని మథించి నేర్చుకున్న విద్య అది! రాత్రి వరకు వేచి చూశాడు. అర్థరాత్రి దాటింది. తయారుచేసిన అంతర్ధాన అంజనాన్ని శరీరానికి పూసుకున్నాడు గుణశర్మ. విక్రమశక్తి విడిదికి నడిచాడు.

మంచి నిద్రలో ఉన్నాడు విక్రమశక్తి. అతన్ని తట్టి లేపాడు గుణశర్మ. మెలకువ తెచ్చుకున్న విక్రమశక్తి ‘ఎవరు’ అంటూ కళ్ళు నులుముకుని చూశాడు. ఎవరూ కనిపించలేదతనికి. అయితే మాట వినవచ్చింది.

‘‘రాజా! నేను దేవదూతను! నీ క్షేమం కోరి వచ్చానిక్కడికి’’ అన్నాడు గుణశర్మ. అతి సమీపం నుంచి అశరీరవాణి వినిపించడంతో లేచి నిల్చుని చేతులు జోడించాడు విక్రమశక్తి.

‘‘మహాసేనుని ముట్టడించి నువ్వు మహాపరాధం చేశావు. అయినా మించిపోయింది లేదు. ఆ మహారాజుతో సంధి చేసుకో! సంధి చేసుకుని తక్షణం కోట నుండి తరలి పో! లేదంటే సర్వనాశనం అయిపోతావు’’ అన్నాడు గుణశర్మ. వినవచ్చిన మాటలకు విస్తుపోయాడు విక్రమశక్తి.

‘‘ఇది ఇంద్రాది దేవతల ఆజ్ఞ’’ అన్నాడు గుణశర్మ. అక్కణ్ణుంచి వచ్చేశాడు.

తెల్లారింది. మంత్రి సామంతుల్ని పిలిచి రాత్రి తను విన్నదంతా తెలియజేశాడు విక్రమ

శక్తి.

"ఇది దేవతల ఆజ్ఞ! మనం మీర కూడదు. అందుకని మహాసేనునితో సంధికే నేను సంకల్పించాను" అన్నాడు.

"మీ అభిప్రాయం చెప్పండి" అనడిగాడు.

"మీ నిర్ణయమే మా నిర్ణయం" అన్నారు వారు. దాంతో విక్రమశక్తి, మహాసేనునితో సంధి చేసుకున్నాడు. ఆ సాయంత్రానికి సైనిక బలగాలతో కోటను విడిచి తరలిపోయాడు.

"ఏం చేశావు గుణశర్మా! ఏంటిదంతా" పొంగిపోయాడు మహాసేనుడు. గుణశర్మను గుచ్చి కౌగిలించుకున్నాడు. సోమకేశ్వరుని సామంతుని చేసుకుని ఉజ్జయినికి తిరిగొచ్చారిద్దరూ.

ఒకనాడు మహారాజుతో కలిసి గుణశర్మ నదిలో స్నానం చేస్తున్నాడు. ఇద్దరూ ఈత కొట్టి ఆనందిస్తున్నారు. అంతలో మొసలొకటి మహారాజుని పట్టుకుంది. ఎంతగా విడిపించుకోజూసినా మహారాజు వల్ల కాలేదు. శక్తి ఉడిగిపోతుంటే "శర్మా" అని పెనుకేక పెట్టాడతను. ఆ కేకకి అల్లంత దూరంలో ఉన్న గుణశర్మ ఇటు చూసి మహారాజు ఏదో ఆపదలో ఉన్నాడని గ్రహించి గబగబా వచ్చాడక్కడికి. రాజు నిల్చున్న చోటంతా రక్తమయంగా ఉంది. మొసలి మహారాజు కాలు పట్టుకుంది. లోనికి లాగుతోంది. మొలలోని చురకత్తి అందుకున్నాడు గుణశర్మ. మొసలి మీద అమాంతం పడి దాన్ని కత్తితో గుచ్చి గుచ్చి చంపాడు. మరోనాడు ఇద్దరూ ఉద్యానవనంలో విహరిస్తుండగా పామొకటి మహారాజును కాటు వేయబోయింది. చూసి చేత్తో దాన్నందుకున్నాడు గుణశర్మ. గిరగిరా తిప్పి అక్కడి రాయికి కొట్టి చంపాడు.

సంధి చేసుకుని తమ గురించి పట్టించుకోకున్నా మహాసేనునికి విక్రమశక్తి మీద కోపం పోలేదు. అతన్ని ఎలాగయినా ఓడించాలని, సామంతుని చేసుకోవాలని మహారాజు కోరిక. ఆ సంగతి గుణశర్మకు చెప్పి, విక్రమశక్తి మీద యుద్ధాన్ని ప్రకటించాడు. ఊహించని పరిణామమిది! విక్రమశక్తి ఆగ్రహావేశాలతో మహాసేనుని ఎదుర్కొన్నాడు. ఇద్దరూ ద్వంద్వ యుద్ధం ప్రారంభించారు.



జెండాలు విరిగిపోయాయి. సారథులు చనిపోయారు. గుర్రాలు నేల కూలాయి. దాంతో కత్తియుద్ధానికి సిద్ధమయ్యారిద్దరూ. 'నువ్వా-నేనా' అన్నట్టుగా యుద్ధం చేయసాగారు. కిరీటాలు ఎగిరిపోయాయి. కవచాలు చెదిరిపోయాయి. దుస్తులు చిరిగిపోయాయి. గాయాల పాలయ్యారిద్దరూ. ఒకానొక సమయంలో మహాసేనుడు జారిపడి నేలను ఆనుకున్నాడో లేదో అదే అవకాశంగా విక్రమశక్తి రెచ్చిపోయాడు. కత్తి మహాసేనుని గుండెల మీద ఉంచాడు. అయిపోయింది. తన ప్రాణాలు పోవడం ఖాయం అనుకుంటున్న సమయంలో మహాసేనుని ఆదుకున్నాడు గుణశర్మ. చక్రాయుధంతో విక్రమశక్తిని ఎదుర్కొన్నాడు. కత్తి పట్టుకున్న అతని భుజాన్ని ఖండించాడు. తర్వాత గుండెల మీద గురి చూసి కొట్టి విక్రమశక్తిని నేల కూల్చాడు. కొన ఊపిరితో ఉన్న విక్రమశక్తిని కోలుకోకుండా బలంగా గొంతు నులిమి చంపేశాడు గుణశర్మ. నిర్జీవంగా పడి ఉన్న విక్రమశక్తి నోటి నుంచి రక్తం ధారగా కారుతోంది. ఆ నోటిని కాలితో తన్ని, నేల మీద పడి తన విక్రమాటోపాన్ని పరీక్షిస్తోన్న మహాసేనునికి చేయి అందించాడు గుణశర్మ. పైకి లేపాడు.

"మీ మీద కత్తి పెట్టే మొనగాడా ఈ విక్రమశక్తి" అన్నాడు గుణశర్మ.

"చేసిన పాపానికి సరైన శిక్ష వేశాను" అన్నాడు మళ్ళీ. ఇంకా ఆవేశంతో ఊగిపోతుంటే వారిస్తున్నట్టుగా అతని భుజమ్మీద చేయి వేశాడు మహాసేనుడు.

"హితుడా" అన్నాడు.

"చెప్పండి దాతా" ఇటు తిరిగాడు గుణశర్మ. చెప్పేందుకు మాటలు లేక గుణశర్మను అభినందనగా గట్టిగా కౌగిలించుకున్నాడు మహాసేనుడు.

"ఇప్పుడిది అయిదో సారి నువ్వు నా ప్రాణాలు కాపాడ్డం" అన్నాడు.

"అది నా బాధ్యత" అన్నాడు గుణశర్మ.

"నా రాజును నేను కాపాడుకోకపోతే నేనెందుకు" అన్నాడు మళ్ళీ. గుణశర్మ స్వామి భక్తికి ఎంతగానో పొంగిపోయాడు మహాసేనుడు.

విక్రమశక్తి రాజ్యాన్ని కొల్లగొట్టి ఉజ్జయినికి చేరుకున్నారంతా. తనని కాపాడిన విధానాన్ని, గుణశర్మ స్వామి భక్తినీ పదిరకాలుగా భర్త పొగుడుతోంటే అశోకవతికి గుణశర్మ మీద మమకారం మరింత ఎక్కువయింది. పదేపదే అతను కావాలనిపించింది. రమ్మని కబురంపిందామె. రాలేదతను. ఓ చీకటి వేళ తానే మారు వేషంలో గుణశర్మను కలిసింది అశోకవతి. నిజ స్వరూపాన్ని చూపించి కరుణించి కౌగిలించుకోమంది. కూడదన్నాడు గుణశర్మ. కేకలు వేసి పదిమందినీ పిలవక ముందే వెళ్ళిపొమ్మన్నాడు. బెదిరించాడు. అశోకవతి వెనుకడుగు వేయక తప్పలేదు. అంతఃపురానికి తిరిగొచ్చింది. పగ పెంచుకుంది. గుణశర్మ అంతు చూడాలనుకుంది. రాత్రి శయన మందిరానికి చేరిన మహాసేనునికి ఏడుస్తూ కనిపించింది.

"ఎందుకు దేవి? ఏమిటీ దుఃఖం" తల్లడిల్లాడు రాజు. ఏడుపును రెట్టింపు చేసి ఏడవసాగింది అశోకవతి.

"చెప్పు! నీకొచ్చిన కష్టమేమిటి? నిన్నింతగా దుఃఖానికి గురి చేసింది ఎవరు" అడిగాడు రాజు. రాణి ఏడుపే సమాధానమయిందతనికి.

"నిన్నింతగా ఏడిపిస్తున్నది ఎవరు దేవి! చెప్పు! ఆ వ్యక్తి ధన మాన ప్రాణాలను కొల్లగొడతాను" అన్నాడు రాజు. కావాల్సిందదే! రాజు ఆ మాటనగానే చేయి జాచి ఇలా అంది అశోకవతి.

"మీరా మాట మీద నిలబడతానని నాకు మాటివ్వండి మహారాజా"

"మాటిస్తున్నాను" అన్నాడు మహాసేనుడు. రాణి చేతిలో చేయి వేశాడు.

"చెప్పు దేవి! ఎందుకేడుస్తున్నావు"

"గుణశర్మ గుణం తెలిసి బాధగా ఉంది" అంది అశోకవతి.

"గుణశర్మ ఏం చేశాడు" ఆశ్చర్యపోయాడు రాజు.

"ఏం చేశాడంటే...మీ ప్రాణాలనే అపహరించాలనుకున్నాడు. డబ్బు కోసం బాగా దిగజారిపోయాడు" అంది అశోకవతి.

"వివరంగా చెప్పు దేవి" అడిగాడు రాజు.

"మిమ్మల్ని హత మార్చి, గౌడరాజుకు తాను సామంతుడు అయ్యేందుకు సిద్ధపడి రహస్యదూతను అక్కడికి పంపాడు గుణశర్మ. ఒప్పుదల అయితే మిమ్మల్ని మట్టుబెట్టేందుకు ఆలోచనలు చేస్తానన్నాడు. అదంతా విన్న

గౌడరాజు, గుణశర్మను సామంతునిగా స్వీకరించేందుకు ఇష్టపడక మన రాజ్యాన్నే కొల్లగొట్టేందుకు పథకం పన్నాడు. గుణశర్మ పంపిన దూతను బంధించి, తన వంటవాణ్ణి పంపాడిక్కడికి . విషాహారంతో మిమ్మల్ని చంపాలని వచ్చాడా వంటవాడు. అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంతలో గౌడ రాజు నుంచి తప్పించుకుని వచ్చి గుణశర్మను కలిశాడు

ఖరీదైన ఓపెనింగ్‌లు...

హీరోయిన్ రేసులో కాస్త వెనుకబడిన తరువాత శ్రియ ప్రారంభోత్సవాలపై దృష్టి సారించింది. ప్రారంభోత్సవాలంటే షూటింగ్‌లు కాదు. బట్టలు, నగల దుకాణాల ప్రారంభోత్సవాలలో శ్రియ తెగ బిజీగా ఉందట! ప్రారంభోత్సవానికి ఇంత రేటు అని కాకుండా గంటకి ఇంత అని పుచ్చుకుంటోందట! ప్రారంభోత్సవాలకి గంట పాటు హాజరయితే శ్రియ తీసుకునే పారితోషికం వింటే కళ్ళు తిరగక మానవు. గంటకి ఐదు లక్షలు చొప్పున వసూలు చేస్తోందట! గంట అయిన తరువాత ఒక ఐదునిమిషాలు ఉన్నా అదనంగా గంటకి ఛార్జి చేస్తోందట! ఈ లెక్కన ఇటీవల శ్రియ ఒకే రోజు ఆరు ప్రారంభోత్సవాలను అంగీకరించిదట! అంటే ఆరు గంటలకు 30 లక్షలన్నమాట. సినిమాలు లేక తాము ఇలాంటి వాటికి హాజరవుతూంటే, కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్‌లలో ఇంకా చరిష్మా తగ్గని శ్రియ పోటీకి రావడంపై టాలీవుడ్ 'బి' గ్రేడ్ హీరోయిన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే సినిమాల కన్నా తనకు ఇవే బాగా కలిసి వస్తున్నాయంటూ శ్రియ ఎక్కువగా వీటిపైనే దృష్టిపెడుతోంది.

దూత. గౌడరాజు పన్నాగాన్ని, వంటవాణ్ణి బయటపెట్టాడతను'' చెప్పింది అశోకవతి.

''బయటపెట్టాడు సరే! తర్వాత'' అడిగాడు రాజు. సాలోచనగా చూడసాగాడు.

''గౌడరాజు తనని కాదనడం, రాచకార్యాన్ని వంటవాడితో చక్కబెట్టే ప్రయత్నం చేయడం గుణశర్మ తట్టుకోలేకపోయాడు. దాని ఫలితమే! వంటవాణ్ణి పట్టించి మీ చేత వాడికి మరణశిక్ష విధించడం'' అంది అశోకవతి.

''చనిపోయిన వంటవాణ్ణి వెతుక్కుంటూ వాడి భార్య, తల్లి, తమ్ముడు మన రాజ్యానికి వచ్చారు. భార్యను, తల్లినీ చంపించాడీ గుణశర్మ. తమ్ముణ్ణి కూడ చంపబోతుంటే వాడు తప్పించుకుని మన అంతఃపురంలో దాగున్నాడు'' అంది.

''మన అంతఃపురంలోనా'' ఆశ్చర్యపోయాడు రాజు.

''అవును మహారాజా! దాగున్న వ్యక్తి నా కళ్ళబడ్డాడు. 'ఎవరు నువ్వు? ఎందుకిక్కడ దాగున్నావ'ని నేను అడిగితే సంగంతా చెప్పుకొచ్చాడతను. అప్పుడే నాకీ విషయాలన్నీ తెలిశాయి. ఇంతలో గుణశర్మ రానే వచ్చాడు. వంటవాడి తమ్ముణ్ణి చంపబోతుంటే నేనే తప్పించి పారిపొమ్మన్నానతన్ని. పారిపోయాడు. పారిపోతున్న అతన్ని వెంబడించి గుణశర్మ కూడా పరుగుదీస్తాడనుకున్నాను. అయితే గుణశర్మ అడుగు కూడా కదపక, నన్నే రెప్ప వెయ్యకుండా చూడసాగాడు. 'ఏంటి శర్మా? ఏంటా చూపు' అనడిగాను. 'మీరీ రోజు చాలా అందంగా ఉన్నారు మహరాణి' అన్నాడు. నన్ను కౌగిలించుకోబోయాడు. తప్పించుకుని 'తప్పు శర్మా! నేను నీకు చెల్లెలు లాంటిదాన్నన్నా'ను. 'లాంటిదానివే కాని చెల్లెలు కావుగా' అన్నాడు శర్మ. మీది మీదికి రాసాగాడు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు పరిచారకుల్ని పేరు పేరునా పిలిచి అరిచాను. పరిగెత్తుకుని వారు రాసాగారు. వాళ్ళొస్తొంటే చూసి తనకిక క్షేమం కాదనుకుని పరుగదీశాడు'' అంది అశోకవతి. రాజు భుజాన్న తలాన్చి భోరు భోరుమంది.

చెప్పింది కట్టుకథే! కాని దాన్ని తానెంత వరకు రాజు నమ్మేట్టుగా చెప్పిందన్నది అనుమానంగా ఉంది అశోకవతికి. ఆ అనుమానంతో రాజుని కొనగంట గమనించసాగింది. మహాసేనుని కళ్ళు ఎరుపెక్కాయి. దవడకండరాలు బిగుసుకున్నాయి. కోపంతో రగిలిపోతున్నాడతను. ఆనందించింది అశోకవతి.

''గుణశర్మా'' కసిగా గట్టిగా అరిచాడు మహాసేనుడు. రాణికి దూరంగా జరిగాడు.

''దుర్మార్గుడు వాడు! వాడికీ నేల మీద నూకలు చెల్లిపోయాయి'' అన్నాడు.

''తప్పదు! వాడికి మరణశిక్ష తప్పదు'' అన్నాడు మళ్ళీ. దగ్గరున్న మధుపాత్రను చేతిలోకి తీసుకుని, రెండు గుటకలు వేసి, చేతులు వెనక్కి కట్టుకుని ఆలోచిస్తూ పచార్లు చేయసాగాడు.

''ఏంటాలోచిస్తున్నారు మహారాజా'' అడిగింది అశోకవతి.

''ముల్లును ముల్లుతోనే తీయాలి. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి. అంటే కపటి గుణాల గుణశర్మను కపటంతోనే చంపాలి. లేకపోతే ప్రజలకు లేనిపోని అనుమానాలొస్తాయి. మనకి, మన రాజ్యానికీ కూడా అది అప్రతిష్ఠ'' అన్నాడు మహాసేనుడు.

''అవున్నిజమే'' అంది అశోకవతి. కళ్ళొత్తుకుంది.

''నాకు అయిదుసార్లు ప్రాణదానం చేశాడు. అది అందరికీ తెలుసు! రేపు ఆ బ్రాహ్మణున్ని నేను శిక్షించి కృతఘ్నుడు అనిపించుకోకూడదు. బాగా ఆలోచించి మరీ శిక్షించాలి''అన్నాడు రాజు.

''వాడు నిన్ను కోరింది కూడా బయటకు పొక్క కూడదు. మన పరువు పోతుంది'' అన్నాడు మళ్ళీ. మధుపాత్రను అందుకుని మరో రెండు గుక్కలు తాగాడు.

రకరకాలుగా ఆలోచించి ఆఖరికి గుణశర్మను రాజు శిక్షించడేమో అనుకుని అశోకవతి ఆందోళన చెందింది. అతన్ని శిక్షించేందుకు దారులు వెతికింది. వెతికి వెతికి ఇలా అన్నది రాజుతో.

''నా సంగతి వద్దు! గౌడరాజుతో గుణశర్మ చేసిన కుట్రను బయట పెట్టండి! సభలో గట్టిగా చెప్పండి''

''భేష్! ఇది సరయిన మాట! రేపు సభలో ఈ సంగతి చెప్పే గుణశర్మను శిక్షిస్తాను'' అన్నాడు మహాసేనుడు. మరి రెండు గుక్కలు మద్యాన్ని స్వీకరించాడు. మత్తుగా అతని కళ్ళు మూతలు పడ్డాయి. తల్పం మీద వాలిపోయాడు. గాఢనిద్రలోకి జారిపోయాడు.

''శర్మా! నన్ను, నా కోరికను కాదన్నావు కదూ! అనుభవించు'' అని ఆగ్రహంతో దంతాలు నూరి మధుపాత్రను అందుకుంది అశోకవతి.

(సశేషం)

కథా సరిత్సాగరం

తనని కాదని, తన కోరిక తీర్చనందుకు గుణశర్మ అంతు చూడాలనుకున్నది అశోకవతి. రాజు మహాసేనుని ముందు కల్లబొల్లి ఏడ్పులేడ్చి తాను అల్లిన కథలన్నీ అతనికి వినిపించింది. ఆ కథల్లో నిజానిజాలు గ్రహించని రాజు, గుణశర్మను నిండుసభలో శిక్షించేందుకు నిర్ణయించుకున్నాడు.



గుణశర్మ కథ 3

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

రాజసభ నిండు కుండలా ఉంది. మంత్రులు, సామంతులు, పుర ప్రముఖులు, విద్వాంసులతో కళకళలాడుతోంది. గుణశర్మ సభాప్రవేశం చేశాడు. అతనేదో కీడు శంకిస్తున్నాడు. సభకు బయల్దేరి వస్తుండగా గుణశర్మకు పిల్లి ఎదురయింది. తర్వాత వీధిలో నడిచి వస్తుండగా పట్టపగలు గబ్బిలం ఒకటి అతని తలను రాసుకుంటూ ఎగిరిపోయింది. తర్వాత అలాంటిదే మరొకటి జరిగింది. ఇలా అపశకునాలు రాజసభకు వచ్చేంత వరకు అతన్ని వెన్నంటాయి. కీడు తనకి జరిగినా ఫర్వాలేదు. మహాదాత మహాసేనునికి జరగరాదు అనుకున్నాడతను. సభలోకి వస్తూనే రాజుకి నమస్కరించి ఉచితాసనంపై కూర్చున్నాడు గుణశర్మ. ఎప్పటిలా రాజు కూర్చోమని చెప్పలేదు. తానొస్తోంటే రాజు ఆనందంగా నవ్వుతూ తల ఎగరెయ్యలేదు. అయినా తప్పదు. కూర్చోవాలనుకుని కూర్చున్నాడు గుణశర్మ. అతన్ని కళ్ళెర్రజేసుకుని చూడసాగాడు రాజు. పెదవులు బిగించి కోపాన్ని ఉగ్గబట్టుకుంటున్నట్టుగా కనిపించాడు. గుణశర్మకి రాజు ప్రవర్తన అంతుచిక్కకుండా ఉంది. రాజు ఈ రోజు ఎందుకిలా ఉన్నాడు? తననెందుకిలా చూస్తున్నాడు? ఏమయి ఉంటుంది? ఆలోచిస్తూండగానే సింహాసనం మీద నుంచి తటాలున లేచి ఒక్కంగలో గుణశర్మను రాజు చేరుకున్నాడు. గౌరవ సూచకంగా గుణశర్మ లేవబోయేంతలో అతన్ని అమాంతం లేవనెత్తి కిందకు కూలదోశాడు రాజు. ఏం జరుగుతోందో తెలుసుకునేంతలోనే కింద పడ్డ గుణశర్మ గుండెల మీద కూర్చున్నాడు రాజు.

"దుర్మార్గుడా" అని గుణశర్మ పీక పిసుకుతోంటే సభలోని వారంతా రాజుని వారించారు.

''మీరు చేస్తున్న పని పద్ధతిగా లేదు మహా రాజా! దయచేసి మీరు సింహాసనం మీద కూర్చోండి! అక్కడ కూర్చుని మీరు ఏం చేసినా చేయండి! అది పద్ధతి. లేవండి'' అన్నారు.

''వీడేం చేశాడో మీకు తెలియదు'' అన్నాడు రాజు. ఆవేశంతో ఊగిపోసాగాడు.

''సింహాసనాన్ని అధిష్టించి ఏం చేశాడన్నది చెప్పండి! అప్పుడు శిక్షించండి'' అన్నారు. రాజుని పట్టి తీసుకు వచ్చి సింహాసనం మీద కూర్చోబెట్టారు.

గుణశర్మకంతా అయోమయంగా ఉంది. రాజెందుకిలా ప్రవర్తిస్తున్నాడో అర్థం కాకుండా ఉంది. అయినా సభా మర్యాద పాటించాలను కుని లేచి నిల్చుని చేతులు కట్టుకున్నాడు. తలొంచుకున్నాడు.

''చెప్పండి మహారాజా! ఏం చేశాడీ గుణ శర్మ'' అడిగారు సభలోని వారు.

''చేయరాని నేరం చేశాడు'' అంటూ తనకి అశోకవతి చెప్పిన గౌడరాజు ప్రహసనం అంతా వివరించాడు. తర్వాత మరీ ముఖ్యులకి చెప్పలేక చెప్పలేక రాణిని గుణశర్మ కోరుకున్న విషయం కూడా చెప్పి దుఃఖించాడు.

''ఈ పాపాలకి వాడిని ఎలా శిక్షించినా తప్పులేదు'' అన్నాడు రాజు.

''చెప్పు! నువ్వీ పాపాలకు ఒడిగట్టావా? లేదా'' గుణశర్మను నిలదీశాడు రాజు.

''లేదు మహారాజా! నాకే పాపం తెలీదు'' అన్నాడు గుణశర్మ.

''తెలియకపోతే కూరలో విషం ఉన్న సంగతి నీకెలా తెలిసింది''

''ఆనాటి వంటవాడి ప్రవర్తన వల్ల తెలుసు కోగలిగాను. అదో విద్య'' అన్నాడు గుణశర్మ. ఆ మాటకు అతనంటే ఇచ్చగించని మంత్రులు, సామంతులు కొందరు ''అది అసాధ్యం'' అన్నారు. మహారాజుకు వెన్నుదన్నయినారు.

''నిజానిజాలు తెలుసుకోకుండా ఆరోపిం చడం, శిక్షించడం మహారాజులకు తగదు'' అన్నాడు గుణశర్మ.

''ఇది పరిపాలించే తీరు కాదు'' అన్నాడు మళ్ళీ.

''పాలన గురించి నువ్వు నాకు చెబుతావా'' కోపించాడు రాజు. మొలలో ఉన్న చురకత్తి తీసుకుని గుణశర్మను పొడిచేందుకు వచ్చాడ తను. తప్పించుకున్నాడు గుణశర్మ.

''పట్టి బంధించండి'' ఆజ్ఞాపించాడు రాజు. సభలో ఉన్న సైనికులు కత్తులతో గుణశర్మ మీద దాడి చేశారు. అయితే గుణశర్మ వారంద రికీ తగిన బుద్ధి చెప్పాడు. వారి జుత్తులు ముడి వేసి, కత్తులు నేలపాలు చేశాడు. కొందరిని సభామందిరం గోడలకి ఈడ్చికొట్టి చంపే శాడు. అప్పటికే సైన్యానికి కబురు వెళ్ళింది. వందలాదిగా తరలి వస్తున్నారు వారు. అది గమనించి తెచ్చుకున్న అంతర్ధాన అంజనాన్ని శరీరానికి పూసుకుని అదృశ్యమయ్యాడు గుణ శర్మ. దక్షిణాపథం వైపు ప్రయాణించసాగాడు.

సభా భవనంలో జరిగింది అంతా తల చుకుంటూ ఎందుకిలా జరిగిందన్నది

ఆలోచించాడు గుణశర్మ. ఆలోచించగా ఆలోచించగా దీని వెనుక అశోకవతి కుట్ర ఉన్నదని అర్థమయిందతనికి. పెళ్ళాం చెప్పింది విని మహారాజు పిచ్చెత్తిపోయాడు. న్యాయాన్యాయాలు, ఉచితానుచితాలు ఆలోచించలేదనుకున్నాడు. ఓ గ్రామానికి చేరుకున్నాడు.

అక్కడ ఓ మర్రిచెట్టు నీడన పిల్లలకు వేదాలు బోధిస్తూ గురువొకడు కనిపించాడు. అతనికి నమస్కరించాడు గుణశర్మ.

"నా పేరు గుణశర్మ. బ్రాహ్మణుణ్ణి. ఈ పూటకు మీరింత అన్నం పెడితే పుణ్యం అని విన్నవించుకుంటున్నాను" అన్నాడు.

"అదెంత భాగ్యం. రండి" ఆహ్వానించాడు గురువు. భోజనాలయ్యాయి. కూర్చున్నారిద్దరూ.

"తమరేం చదివారో" అడిగాడు గురువు.

"నాలుగు వేదాలూ చదువుకున్నాను. వేద భాష్యాలు కూడా చదువుకున్నాను" అన్నాడు గుణశర్మ.

"చాలా గొప్పవారయితే" ఆనందించాడు గురువు.

"మీ పేరు చెప్పారుగాని, మీదే వూరో, మీ వంశం...ఆ వివరాలు చెప్పలేదు" అన్నాడు గురువు.

"చెబుతాను వినండి" చెప్పసాగాడు గుణశర్మ.

గుణశర్మ జన్మవృత్తాంతం

ఆదిత్యశర్మ చిన్నతనంలోనే అతని తల్లిదండ్రులు చనిపోయారు. మేనమామ చేరదీశాడతన్ని. మామయ్య సంరక్షణలో ఉంటూనే చదువుకోసాగాడు ఆదిత్యశర్మ. జ్యోతిష్యం, గణితం బాగా చదువుకున్నాడతను. వాటిని చదువుకుంటున్నప్పుడే ఓ సన్యాసితో పరిచయం అయిందతనికి. యక్షిణీ సిద్ధి కోసం సన్యాసి శ్మశానంలో హోమం చేస్తుండేవాడు. అతన్ని అనుసరించి ఆదిత్యశర్మ ఆ హోమాన్ని గమనించేవాడు. నూరు రోజుల పాటు నిరాటంకంగా హోమం జరిగింది. నూటొకటవ రోజున హోమం నుండి బంగారు విమానం ఎగిరొచ్చింది. అందులో పరిచారికల మధ్య వారి సేవలందుకుంటూ మహారాణిలాంటి ఓ అద్భుత సౌందర్య రాశి ఉంది. ఆదిత్యశర్మ, సన్యాసి ఆ సౌందర్యాన్ని ఆరాధనగా చూడసాగారు.

"సన్యాసి" అన్నదా సౌందర్యం.

"నా పేరు విద్యున్మాల. నేను యక్షిణి. వీరంతా నా చెలులు. వీరిలో నీకిష్టమయిన దాన్ని స్వీకరించు! నువ్వు చేసిన హోమానికి, మంత్ర సాధనకు నీకు సిద్ధించింది ఇంతే" అన్నది.

"నేను నిన్ను కోరుకున్నాను" అన్నాడు సన్యాసి.

"అవును! కాని, నీకు నా మంత్ర సాధన పూర్తిగా రాలేదు. నా కోసం నువ్వు చేసిన హోమం సరిపోలేదు. మళ్ళీ చేస్తానంటావేమో! ఆ అవకాశం నీకు లేదు! ఇక్కడితోనే తృప్తి చెందు" అన్నది విద్యున్మాల.

తనకు నచ్చిన యక్షిణిని స్వీకరించాడు సన్యాసి. మిగిలిన పరిచారికలతో విద్యున్మాల అదృశ్యమయింది. తలచిన వెంటనే యక్షిణి ప్రత్యక్షమవుతూ సన్యాసి కోరికలు తీర్చసాగింది. కొద్దిరోజులు గడిచాయి. ఒకనాడు ఆమెను ఆదిత్యశర్మ ఇలా అడిగాడు.

"విద్యున్మాల కన్నా ఉన్నతమయిన యక్షిని ఉన్నదా"

"ఉన్నది! విద్యున్మాల, చంద్రలేఖ, సులోచనలు యక్షిణిల్లో ప్రముఖులు. వారిలో సులోచన ఉత్తమురాలు" అన్నది.

"నాకు సులోచన సాధన మంత్రం కావాలి" అడిగాడు ఆదిత్యశర్మ. నవ్వింది యక్షిణి.

"ఎందుకు నవ్వుతున్నావు" అడిగాడు.

"ఎందుకంటే...ఆ మంత్రం నాకు తెలీదు కాబట్టి" అన్నదామె.

"మరెవరికి తెలుసు"

"ఎవరికి తెలుసంటే...దక్షిణాన తుంబవనం అని ఓ వనం ఉంది. ఆ వనంలో వేణా నదీ తీరాన్ని ఆనుకుని విష్ణుగుప్తుడు ఉంటున్నాడు. ఆతనికి ఆ మంత్రం బాగా తెలుసు" అన్నది యక్షిణి.

"కృతజ్ఞుణ్ణి" అని నమస్కరించాడు ఆదిత్య శర్మ. విష్ణుగుప్తుణ్ణి కలిసేందుకు ఆ వెంటనే ప్రయాణించాడు. కలుసుకున్నాడతన్ని. మూడు సంవత్సరాల పాటు భక్తిగా గుప్తుని కొలిచాడు. సకల పరిచర్యలు చేశాడతనికి. అందుకు సంతోషించాడు గుప్తుడు. సులోచన యక్షిణి సాధన మంత్రాన్ని ఉపదేశించాడు. ఆదిత్యశర్మ మంత్రోచ్చారణ చేస్తూ హోమం చేయసాగాడు. కొన్నాళ్ళకు సులోచన సిద్ధించింది. అద్భుత సౌందర్యరాశి ఆమె. ఆ అందాన్ని చూసేందుకు రెండు కళ్ళు చాలవు.

"నిన్ను వరించినాను మానవా! అయితే ఆరు నెలలపాటు నన్ను తాకకుండా నా అందాన్ని చూస్తూ నిన్ను నువ్వు నిగ్రహించుకోగలిగితే ఆ తర్వాత మనకి మహాబుద్ధిమంతుడు, మహావీరుడు, సకల శాస్త్రాలను అవుపోసన పట్టగలిగే కొడుకు పుడతాడు. అందుకు నువ్వు అంగీకరించాలి" అంది సులోచన.

"అలాంటి కొడుకు కోసం ఆరు మాసాలు కాదు, ఆరు సంవత్సరాలు నిన్ను తాకకుండా ఉండమన్నా ఉంటాను" అన్నాడు ఆదిత్యశర్మ. అతని నిగ్రహానికి ఆనందించిందామె. అలకాపురికి తీసుకునిపోయిందతన్ని. అక్కడ కుబేరునికి పరిచయం చేసింది. కుబేరుని ఆస్థానంలో ఆరు మాసాలపాటు ఆదిత్యశర్మ తన విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఎదుట సులోచన ఏ భంగిమలో ఉన్నా, ఏ తీరునున్నా పట్టించుకోక ఎల్లవేళలా ఆస్థాన ప్రముఖుల అభినందనల కోసమే కష్టపడ్డాడు. కుబేరుడు అందుకు ఎంతగానో సంతోషించాడు. ఆరు మాసాల అనంతరం తానే పురోహితుడై సులోచన-శర్మలకు పెళ్ళి చేశాడు. వారికి పుట్టిన కొడుకే ఈ గుణశర్మ. గుణాలన్నిటా నేను అధికుణ్ణి కాబట్టి నాకు ఆ పేరు మా నాన్న ఆదిత్యశర్మ పెట్టాడు. యక్షాధిపతి మణిభ ద్రుడు నాకు వేదాలను, విద్యలను బోధించాడు.

-అని చెప్పి ఊపిరి తీసుకునేందుకన్నట్టుగా ఆగాడు గుణశర్మ.

"మరి అలకాపురి వాసివి ఇక్కడికెలా వచ్చావు? ఈ భూమ్మీద ఎందుకు తిరుగుతున్నావు" అడిగాడు గురువు.

"దానికో కారణం ఉంది" అంటూ చెప్పసాగాడు గుణశర్మ.

ఒకనాడు కుబేరుని కలిసేందుకు ఇంద్రుడు అలకాపురికి వచ్చాడు. తిన్నగా ఆస్థానానికే వచ్చాడు. అతనొచ్చినప్పుడు మా తండ్రి ఆదిత్యశర్మ ఏదో ఆలోచనలో ఉండి, గమనించలేదతన్ని. దానికి ఇంద్రుడుకి కోపం వచ్చింది. భూలోకానికి వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించాడు. అమ్మ సులోచన, నాన్న క్షమించమని పదే పదే వేడుకుంటే...భూలోకానికి పోలేమని అంటే...కనికరించి ఇలా అన్నాడు ఇంద్రుడు.

'అయితే మీ కొడుకు గుణశర్మను పంపించండక్కడికి. తండ్రి ఆత్మ కొడుకే కాబట్టి శిక్ష అతను అనుభవించినా చాలు! సంతోషిస్తాను'

కుబేరుడు కూడా ఆ మాటకి వత్తాసు పలకడంతో మా తండ్రి ఉజ్జయినీ నగరంలోని వారి మేనమామ ఇంట నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయాడు.

-చెప్పడం ఆపి కళ్ళు చెమర్చుకున్నాడు గుణశర్మ. తర్వాత కళ్ళొత్తుకుని అశోకవతి కుట్ర, మహాసేనుని దౌర్జన్యం కూడ చెప్పాడు.

"అందుకే అన్నారు రాజాశ్రయం విరిగిపడుతోన్న కొండ నీడలాంటిదని. ప్రాణానికి హాయిగా ఉంటుందని కొండ నీడన ఉందామనుకుంటే ప్రాణమే పోతుంది. ఇలా ఊళ్ళు పట్టిపోతానని ఎప్పుడూ అనుకోలేదు. కాని ఏం చేస్తాం? విధి లిఖితం" అన్నాడు గుణశర్మ. బాధపడ్డాడు.

"బాధపడకండి! మంచి రోజులు మళ్ళీ వస్తాయి" అన్నాడు గురువు.

"నా పేరు అగ్నిదత్తుడు. ఈ అగ్రహారం నాదే! మీకిక్కడ దేనికీ ఎలాంటి కొదవా ఉండదు. స్వేచ్ఛగా సుఖంగా ఉండండి" అన్నాడు మళ్ళీ. గుణశర్మను గుండెల్లో దాచుకున్నాడు. అతనికొక అందమయిన విడిది ఏర్పాటు చేసి సపర్యలు చేసేందుకు దాస దాసీ జనాన్ని కూడా నియమించాడు. కొద్దిరోజులు గడిచాయి. ఒకానొక రోజు అగ్నిదత్తుడు తన కుమార్తెను వెంటబెట్టుకుని గుణశర్మను కలిశాడు. అందాలతో అలరారుతోందామె. దేవతలు కూడా అంత అందంగా ఉండరనిపిస్తుంది ఆమెను చూసిన వారికి.

" మా అమ్మాయి సుందరి" పరిచయం చేశాడు. గుణశర్మకు నమస్కరించిందామె.

"ఈమె భూత భవిష్యత్ వర్తమానాలు నాకు కావాలి" అడిగాడు అగ్నిదత్తుడు.

"మూడు కాలాల్లోను ఈమెకు సాటి రాగల వారు లేరు" అన్నాడు గుణశర్మ. అగ్నిదత్తుడు అడిగిన మేరకు అంతా వివరించి చెప్పాడు. అన్నీ నిజాలే! అగ్నిదత్తుడు అంతకు ముందే సుందరి జాతకాన్ని ఓ ప్రముఖునితో చెప్పించుకుని ఉన్నాడు. వాటితో ఇప్పుడు గుణశర్మ చెప్పినవి సరిపోయాయి. అనుమానం లేదు. గుణశర్మ గొప్ప జ్యోతిశ్శాస్త్రవేత్త అని కూడా నిర్ధారణ అయిందతనికి.

"రామ్మా" కూతురుని వెంటపెట్టుకుని వెళ్ళేందుకు ముందుకు నడిచాడు అగ్నిదత్తుడు. రెండడుగులు వేసి, వెనక్కి తిరిగి చూశాడు. కూతురు నిల్చున్న చోటనే ఉన్నది. తన పిలుపు కూడా వినిపించుకున్నట్టుగా లేదు. గుణశర్మను కన్నార్పకుండా చూస్తోందామె. ఇంతటి అందగాడు, విద్యావేత్త తనకు భర్తయితే బాగుణ్ణనుకుంటోంది సుందరి. ఆమె మనసులో భావాన్ని తండ్రి అగ్నిదత్తుడు గ్రహించకపోలేదు.

"రామ్మా" అని సుందరిని తన వైపునకు తిప్పుకుని ముందుకు నడిచాడు. తండ్రితో పాటుగా వెళ్తూ వెనక్కి వెనక్కి పదే పదే గుణశర్మను తిరిగి చూడసాగింది సుందరి. ఆనందం, సంతోషం, ఊపిరి, వెన్నెల, అమృతం...వాటన్నిటికీ దూరమవుతున్నట్టుగా గుణశర్మను వదలి వెళ్ళడం కష్టమనిపిస్తోందామెకు. 'ప్రేమంటే ఇదేనా' అనుకుంది సుందరి. బాధగా గుండెల్ని నిమురుకుంది.

(సశేషం)

సెక్సీ హీరోయిన్ వ్యాపారం...

తన భారీ అందచందాలే పెట్టుబడిగా తమిళనాట ఓ వెలుగు వెలిగిన నమితకి ఇప్పుడు ఆ అందాలే అడ్డయ్యాయి. అనుష్క, కాజల్, తమన్నాల ధాటికి తట్టుకోవడం నమితకి కష్టమైపోయిందట! అవకాశాల్లేక ఖాళీగా కూర్చుంటోందట! ఏవో రెండు మూడు సినిమాలు చేస్తున్నా అవి సంఖ్యాపరంగా తప్ప మరెందుకూ పనికి రావన్న నిర్ణయానికి వచ్చిన నమిత వ్యాపారం వైపు దృష్టి సారించిందట! అందరి ఆడవాళ్ళలాగానే నమితకి కూడా నగల మీద మోజు ఉందట! ఆ మోజునే క్యాష్ చేసుకునే పనిలో పడింది. బొంబాయిలో ఓ జ్యూయలరీ షాపును త్వరలో ప్రారంభించబోతోంది. దీనికి సంబంధించిన పనులతో ఎక్కువ కాలం నమిత ముంబాయిలోనే ఉండిపోతోంది. ఇక మీదట నమితను వెండితెర మీద కాకుండా నేరుగా షాపులోనే దర్శించుకోవచ్చన్నమాట!

కూతురు సుందరి, గుణశర్మను కావాలనుకుంటున్నట్టుగా ప్రేమిస్తున్నట్టుగా తెలుసుకున్న అగ్నిదత్తుడు ఆమెను గుణశర్మకు ఇచ్చి వివాహం చేసేందుకు నిశ్చయించుకున్నాడు. ఆ సంగతి గుణశర్మకు చెప్పేందుకు అతన్ని కలవాలనుకున్నాడు. అయితే అప్పటికే బాగా రాత్రయింది. ఆ రాత్రివేళ అతన్ని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక మర్నాడు చెబుదామనుకున్నాడు అగ్నిదత్తుడు.

రాత్రయినా నిద్రపోక మెలకువగానే ఉన్నాడు గుణశర్మ. కళ్ళు మూసుకుని ఉన్నా అంతా గమనిస్తూనే ఉన్నాడు. కిటికీ దగ్గరి తెరలు కదలాడాయి. ఒక్కసారిగా కళ్ళు విప్పి చూశాడతను. అక్కడేదో నీడ కదలాడుతోంది. దిగ్గున లేచి పరుగు దీసి చూశాడు. అక్కడెవరూ లేరు. అయితే మేడ మీది నుంచి కిందికి ఎవరో దూకిన శబ్దం వినవచ్చింది. కిందికి చూశాడు. ఎవరో చీకట్లోకి పరుగుదీస్తూ కనిపించారు. దూకి వెంబడిద్దామనుకున్నాడు గుణశర్మ. కాని మానుకుని, ఆలోచనలో పడ్డాడు.

గుణశర్మ కథ 4



భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు *'అనీలజ'* నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

ఇక్కడుంటే ఎప్పటికయినా ప్రమాదమే! మహాసేనుడు తనని మట్టుబెట్టక తప్పదనుకున్నాడు గుణశర్మ. త్వరలో ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవడమే మంచిదనుకున్నాడు.

తెల్లారింది. అగ్నిదత్తుడు ఆనందంగా వచ్చాడు. దీర్ఘాలోచనలో ఉన్న గుణశర్మను పలకరించాడు.

''మీకో శుభవార్త'' అన్నాడు.

''ఏంటది'' అడిగాడు గుణశర్మ.

''నా కూతురు సుందరిని మీకిచ్చి వివాహం చేద్దామనుకుంటున్నాను'' అన్నాడు అగ్నిదత్తుడు. గుణశర్మ అభిప్రాయం కోసం ఎదురు చూశాడు. మాట లేదు గుణశర్మ దగ్గర్నుంచి. మవునం వహించాడతను.

''ఈ పెళ్ళి మీకిష్టం లేదా? సుందరి మీకు నచ్చలేదా'' దిగులు పడ్డాడు అగ్నిదత్తుడు.

''తను మిమ్మల్ని ప్రేమిస్తోంది'' చెప్పాడు.

''తెలుసు'' అన్నాడు గుణశర్మ.

''సుందరిని వివాహం చేసుకోవడం నాకిష్టమే! కాని...''ఆగాడు.

''మరి అభ్యంతరం ఏమిటి'' అడిగాడు అగ్నిదత్తుడు.

''అభ్యంతరం కాదు, అవమానం. రాజావమానాన్ని తట్టుకోలేకపోతున్నాను. ఏదీ రుచించడం లేదు. పైగా వివాహం చేసుకుని నేనిక్కడ ఉండడం నాకే కాదు, మీకు, సుందరికి కూడా ప్రమాదమే''

''ప్రమాద మేమిటి'' ఆశ్చర్యపోయాడు అగ్నిదత్తుడు.

రాత్రి కిటికీ దగ్గర కదలిన నీడ, తర్వాత మేడ దూకి ఎవరో పారిపోయిన సంగతంతా వివరించాడు గుణశర్మ.

''రాత్రి జరిగింది ఆలోచిస్తోంటే మహాసేనుడు నన్ను వెన్నాడుతున్నాడనిపిస్తోంది. నా



అంతు చూసే దాకా అతను నిద్ర పోడ నిపిస్తోంది.

ఉజ్జయిని ఇక్కడకు దగ్గరే కదా! వేగులను పంపించి నా ఆచూకీ తెలుసుకుని రమ్మని ఆజ్ఞాపించి ఉంటాడు. రాత్రి వచ్చింది వేగేనని నా అనుమానం'' అన్నాడు గుణశర్మ.

''ఆశ్రయం ఇచ్చి ఆదుకున్న మిమ్మల్ని కష్టాల పాలుజేయడం నాకిష్టం లేదు. అందుకే సుందరితో పెళ్ళి వద్దనుకుంటున్నాను. ఇక ఎంతో కాలం నేనిక్కడ ఉండడం కూడా నాకిష్టం లేదు. వెళ్ళిపోతాను. ఏ కాశీకో పోయి దైవదర్శం చేసుకుని గంగలో మునిగి ప్రాణత్యాగం చేస్తాను'' అన్నాడు గుణశర్మ. అప్పుడతని గొంతు బాధతో బొంగురుపోయింది.

చాటుగా ఉండి ఆ మాటలు విన్నదేమో! ఏడుస్తూ అక్కణ్ణుంచి సుందరి పరుగుదీయడాన్ని చూశారిద్దరూ.

''సుందరి అంతా విన్నట్టుగా ఉంది'' ఆందోళన చెందాడు గుణశర్మ.

''విన్నది కాబట్టే మిమ్మల్ని ప్రేమిస్తున్నది కాబట్టే పాపం ఏడుస్తూ పరుగెత్తింది'' అన్నాడు అగ్నిదత్తుడు. తల పట్టుకున్నాడు గుణశర్మ. అతని కళ్ళు చెమర్చాయి.

''ప్రతాపవంతులు దుఃఖించకూడదు. దుఃఖించడం ప్రతాపవంతుల లక్షణం కాదు'' అన్నాడు అగ్నిదత్తుడు.

''అంతటి ఆదిత్యశర్మ కుమారుడివై ఉండి,

ఇలా బేలలా ఏడవడం బాగాలేదు. పైగా ప్రాణత్యాగం చేస్తామనడం వినడానికే అసహ్యంగా ఉంది'' అన్నాడు. ఓదార్పుగా గుణశర్మ భుజమ్మీద చేయి వేశాడు.

''పారిపోవడం పిరికితనం. మీరెక్కడికీ పారిపోవద్దు! ఇక్కడే ఉండండి! మీ కోసం అద్భుతమయిన పాతాళ గృహం నిర్మిస్తాను. సుందరిని వివాహం చేసుకుని, సంతోషంగా మీరా గృహంలో ఉండండి'' అన్నాడు అగ్నిదత్తుడు. అతని మాటలకి కోలుకున్నాడు గుణశర్మ. నిరాశా నిస్పృహలను వదులుకున్నాడు. ఇలా అన్నాడు.

''పాతాళ గృహంలో ఉంటాను. పగ తీర్చుకుంటాను. మహాసేనుని అంతు చూసే వరకు

సుందరిని పెళ్ళి చేసుకోను. తీర్చుకున్న మరుక్షణం మా ఇద్దరి వివాహం జరిగి తీరుతుంది'' అన్నాడు గుణశర్మ. దీర్ఘంగా నిశ్వసించాడు.

''ఇప్పుడు ఆదిత్యశర్మ కుమారుడనిపించావు'' అభినందించాడు అగ్నిదత్తుడు. కొద్దికాలంలోనే అత్యద్భుత పాతాళ గృహాన్ని నిర్మించి గుణశర్మకు చూపించాడతను.

''ఎలా ఉంది'' అడిగాడు.

''చాలా బాగుంది'' అన్నాడు గుణశర్మ.

''ఇక్కడ మీరున్న సంగతి ఎవరికీ తెలియదు. నిర్భయంగా ఉండవచ్చు'' చెప్పాడు అగ్నిదత్తుడు.

''ఇప్పుడున్న కష్టాలు గట్టెక్కడానికి ఏ దేవుణ్ణి ధ్యానించమంటారు?'' అడిగాడు గుణశర్మ.

''కుమారస్వామిని ధ్యానించడం మంచిది. శత్రువు మీద విజయం సాధించాలంటే ఆ స్వామినే ప్రార్థించాలి. నాకు ఆ స్వామి మంత్రం వచ్చు. ఉపదేశిస్తాను. నేర్చుకోండి'' అన్నాడు అగ్నిదత్తుడు. నేర్చుకున్నాడు గుణశర్మ. పాతాళగృహంలో గుణశర్మ కుమారస్వామిని ప్రార్థించగా, సుందరి తన ఆంతరంగిక మందిరంలో తల్లి పార్వతిని ప్రార్థించసాగింది. గుణశర్మకు స్వామి సాక్షాత్కరించాలని ఆమె కోరిక. ఇద్దరూ ఉపవాసదీక్ష స్వీకరించారు. పద్దెనిమిది రోజులు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు. ఏకధాటిగా ప్రార్థించారు. పద్దెనిమిదో రోజు అర్ధరాత్రి కుమారస్వామి ప్రత్యక్షమయ్యాడు. ఆనందించాడు గుణశర్మ.

''ఏం కావాలో కోరుకో'' అడిగాడు స్వామి.

''ఎన్నటికీ తరిగిపోని కోశాగారం కావాలి. మణులు, మాణిక్యాలు, వజ్రాలు, వైడూర్యాలు, బంగారంతో ఆ కోశాగారం నిండిపోవాలి. తర్వాత అబద్ధాన్ని నమ్మి నన్ను, నా స్వామి భక్తిని అనుమానించి నన్ను అవమానించిన మహాసేనునిపై నేను విజయం సాధించాలి'' కోరుకున్నాడు గుణశర్మ. ప్రసాదించాడు స్వామి.

''నేను మరో వరం కూడా నీకిస్తున్నాను. మహాసేనుని మీద విజయం సాధించిన నువ్వు తర్వాత అనేక మంది క్షత్రియులను కూడా జయించి ఈ భూమండలాన్నే పరిపాలిస్తావు'' అన్నాడు స్వామి. అదృశ్యమయ్యాడు.

ఎంత ఖర్చు చేసినా తరగని కోశాగారంతో ఊహించనలవికాని జీత భత్యాలిచ్చి గొప్ప సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాడు గుణశర్మ. తర్వాత చిన్న చిన్న రాజులను చేరదీసి వారిని సామంతులను చేసుకున్నాడు. కొన్నాళ్ళకు చతురంగ బలాలతో మహాసేనుని మీదికి దండెత్తాడు. కోటను ముట్టడించాడు. ద్వంద్వ యుద్ధంలో మహాసేనుని ఓడించాడు. అశోకవతిని బంధించాడు.

నిండు సభలో మంత్రి సామంతుల సమక్షంలో అశోకవతి దురాలోచన, ఆమె అసభ్య ప్రవర్తన వివరించాడు.

''ఇప్పుడు చెప్పండి! భార్య చెప్పిన వెంటనే నిజానిజాలు గ్రహించక నన్ను శిక్షించిన ఈ రాజును ఏం చెయ్యాలి? అలాగే నన్ను కోరుకున్న ఈ అశోకవతిని ఏ విధంగా శిక్షించాలి'' అడిగాడు గుణశర్మ.

''ఇద్దరినీ రాజ్యం నుంచి బహిష్కరించాలి'' గోలగా అరిచారంతా.

''రాళ్ళతో కొట్టి తరమాలి'' అన్నారు.

ఎవరో రాయి విసిరారు. అది మహాసేనుని నుదుటికి తగిలింది. అంతలోనే మరో రాయి వచ్చి పడింది. అశోకవతికి తగిలిందది. ఆ వెనువెంటనే గాలిలోకి ఉవ్వెత్తున లేచాయి రాళ్ళు. వర్షంలా వచ్చి పడసాగాయి. దెబ్బలకు తట్టుకోలేని అశోకవతి-మహాసేనులు అక్కణ్ణుంచి పరుగుదీశారు. ఉజ్జయిని నగరం సరిహద్దులు దాటారు. అంత వరకు వారిని తరిమి కొట్టారు ప్రజలు.

గుణశర్మ రాజయ్యాడు. సుందరిని వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్ళకు చక్రవర్తి అయ్యాడు. కుమారస్వామి ఆశీస్సులతో భూమండలాన్ని పరిపాలించాడు.

(సమాప్తం)

వచ్చేవారం:
మదనసుందరీ కనకవర్షుల కథ

అనగనగా కనకపురం. దానికి రాజు కనకవర్షుడు. కనకవర్షునికి కీర్తి కాంక్షేగాని, డబ్బు మీద వ్యామోహం లేదు. పాప భయమేగాని శత్రు భయం లేదు. పెద్దగా కోపాన్ని కూడా ఎరుగడతను. పైగా ధర్మదాత.

ఒకనాడు నిండుపున్నమి వేళ ప్రకృతిని చూసి పరవశిస్తూ పరవశిస్తూ అంతఃపురంలో ఓ మూలగా ఉన్న భవనానికి చేరుకున్నాడు కనకవర్షుడు. ఆ భవనంలో తరతరాల పెద్దల చిత్రపటాలేగాక, ప్రకృతి అందాలను ప్రతిబింబించే చిత్రపటాలు చాలా ఉన్నాయి. వాటిని ఇప్పుడు చూడాలనిపించిందతనికి. భవనంలోకి ప్రవేశించాడు. ఒకొక్క పటాన్నీ చూసుకుంటూ వెళ్తున్నాడు కనకవర్షుడు. బాగున్నాయవి. ఎన్ని రోజులు కష్టించి చిత్రించారో మరి! ఇంతలో ద్వారపాలకుడు అతన్ని సమీపించాడు.



మదనసుందరి కథ

1

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు 'అనీలజ' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

''మహారాజా''

''చెప్పు''

''విదర్భ దేశం నుండి ఓ చిత్రకారుడు వచ్చాడు. చిత్రకళలో తనకి సాటి లేరంటున్నాడు. పేరేమో రోలదేవుడట! ఇదంతా ఓ గుడ్డ మీద రాసి రాచవీధిలో విర్రవీగుతున్నాడు''

''కళాకారుడు మరి'' నవ్వాడు కనకవర్షుడు.

''అతన్ని ప్రవేశ పెట్టమంటారా'' అడిగాడు ద్వారపాలకుడు.

''నా కోసం వచ్చాడా'' ప్రశ్నించాడు కనకవర్షుడు.

''అవును మహారాజా''

''అయితే వెంటనే ప్రవేశపెట్టు'' ఆజ్ఞాపించాడు. ద్వారపాలకుడు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయిన అతని వంక సాలోచనగా చూసి దగ్గరలోని సింహాసనం మీద కూర్చున్నాడు కనకవర్షుడు. తమలపాకులు, ఏలకులు, వక్కలున్న తాంబూలం పెట్టె కనిపించింది. అందుకున్నాడతను. తెరచి చూడసాగాడు. అంతలో రానే వచ్చాడు రోలదేవుడు.

''నమస్కారం మహారాజా''

''నమస్కారం! చెప్పండి''

''మీ దర్శన భాగ్యం కోసమే రాచవీధిలో అలా విర్రవీగాను'' అన్నాడు రోలదేవుడు.

''తప్పు చేస్తే క్షమించండి'' అన్నాడు. పర్వాలేదన్నట్టుగా నవ్వాడు కనకవర్షుడు.

''మీరు అనుమతి ఇస్తే మంచి బొమ్మ గీసి పెడతాను'' అన్నాడు రోలదేవుడు.

''గీసి పెట్టండి చూస్తాం'' అన్నాడు వర్షుడు.

''ఏది గీయమంటారు''

''మీ ఇష్టం''

''మహారాజుగారినే చిత్రించండి'' కల్పించుకున్నాడు ద్వారపాలకుడు.

''అంతకంటేనా'' అన్నాడు రోలదేవుడు. కనకవర్షుని అలానే కూర్చోమని చెప్పి అతని చిత్తరువును గీయనారంభించాడు. కాస్సేపటికి బొమ్మ పూర్తయింది. రాజుకి అందించి చూడమన్నాడు రోలదేవుడు. చూడసాగాడు కనకవర్షుడు.

బొమ్మ చాలా బాగుంది. తన బొమ్మే! చాలా అందంగా ఉంది. చక్కగా ఎత్తుగా పొడుగ్గా ముక్కు. పెద్ద పెద్ద కళ్ళు. విశాలమయిన నుదురు, ఉంగరాల జుత్తు, బింకంగా పొడుచుకొచ్చినట్టున్న వక్షస్థలం. పొడుగాటి చేతులు, సన్నని నడుము, బలమయిన తొడలు, లేత రావి ఆకుల్లాంటి పాదాలు...అద్భుతంగా ఉంది చిత్రపటం. రోలదేవుణ్ణి అభినందించకుండా ఉండలేకపో

యాడు కనకవర్షుడు. ఆ బొమ్మను చూసి ద్వారపాలకుడు రెట్టించిన ఉత్సాహంతో ఇలా అన్నాడు.

"రాజుగారి బొమ్మ చాలా బాగుంది. వారి ప్రక్కన రాణిగారు కూడా ఉంటే ఇంకా బాగుంటుంది. రాజుగారికి పదిహేడు మంది రాణులున్నారు. వారిలో ఎవరు రాజుగారి ప్రక్కన ఉంటే బాగుంటుందో చిత్రించి చూడండి"

"తప్పకుండా" అన్నాడు రోలదేవుడు. రాణులను చూడాలన్నాడు. కనకవర్షుని ఆజ్ఞ మేరకు రాణులంతా రోలదేవుని ముందు నిలిచారు. వారిలో ఏ ఒక్కరూ నచ్చలేదు దేవునికి. పెదవి విరిచాడు. రాణులంతా అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు.

"మీ మగసిరికి తగిన రాణి లేదు మహారాజా! ఇలా అంటున్నానని మరో రకంగా భావించకండి" అన్నాడు రోలదేవుడు.

"మీకు తగిన రాణి మదనసుందరి మాత్రమే" అన్నాడు మళ్ళీ.

"మదన సుందరా? ఆమె ఎవరు" అడిగాడు కనకవర్షుడు.

"ఆమె కుండిన నగర మహారాజు దేవశక్తి కూతురు" చెప్పాడు రోలదేవుడు.

"వినయానికి వినయం. అందానికి అందం. ఆమె ఒక్కతే మీకు తగిన రాణి" అన్నాడు మళ్ళీ.

"చిత్తరువు గీసేందుకు ఒకనాడు నన్ను ఆ సుందరి తన అంతఃపురానికి రమ్మంది. వెళ్ళాను. ఆ సమయంలో ఆమె ఒంటి నిండా మంచి గంధం పూసుకుని ఉంది. తామరాకుల మీద పడుకుని ఉంది. తామరపువ్వులతో విసురుకుంటూ ఉంది. శీతలోపచారాలు చేసుకుంటోంది. మదన తాపంతో రగిలిపోతూ ఉంది. ఒళ్ళు విరుచుకుంటూ మత్తుగా కళ్ళను మూసుకుంటూ తెరుస్తూ నన్ను చూసి 'ఈ బొమ్మ గియ్యి' అంది. తన చేతిలోని చిత్తరువును భారంగా కింద పెట్టింది. ఏనాటిదో పాత బొమ్మ అది. పెద్దది చేసి గీశాను దాన్ని. ఆ బొమ్మను గుండెల మీద పెట్టుకుని నిట్టూరుస్తూ పడుకుంది. అక్కడ ఉండడం క్షేమం కాదనుకుని వెంటనే పరుగుదీసి వచ్చేశాను" చెప్పాడు రోలదేవుడు.

"ఆ బొమ్మ ఎవరిదో తెలుసా మహారాజా? మీదే! మిమ్మల్నే ఆమె ఆరాధిస్తోంది. మిమ్మల్నే కోరుకుంటోంది. ఈ విషయం చెప్పడానికే నేనిక్కడికి వచ్చాను" అన్నాడు. అసలు విషయం బయటపెట్టాడు దేవుడు. అందుకు ఆనందించాడు కనకవర్షుడు. అడిగాడు.

"ఆమె చిత్తరువు నీ దగ్గర ఉందా"

"ఉంది మహారాజా" అందించాడు దేవుడు. చూశాడు కనకవర్షుడు. తొలిచూపులోనే ఆమె ప్రేమలో పడిపోయాడు.

"నాకీ బొమ్మ కావాలి" అడిగాడు రాజు.

"తీసుకోండి మహారాజా" అని బొమ్మను అతనికి కానుకగా అందజేసి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు రోలదేవుడు.

మదనసుందరి చిత్తరువును తీసుకుని ఏకాంతమందిరానికి చేరుకున్నాడు కనకవర్షుడు. ఆ బొమ్మను తన ఎదురుగా ఉంచుకుని ఆమెనే కలలో మెలకువలో తలపోయసాగాడు. మంత్రులది గ్రహించారు.

"మదనసుందరితో మీ వివాహం జరిగి తీరుతుంది మహారాజా! తన కూతుర్ని మీకిమ్మని దేవశక్తిని అడుగుదాం" అన్నారు.

"బ్రాహ్మణోత్తముడు సంగమస్వామిని ఈ విషయమై మాట్లాడి రమ్మందాం! కుండిన నగరానికి వారిని పంపుదాం" అన్నారు.

"పంపించండయితే" చెప్పాడు కనకవర్షుడు.

సంగమస్వామి వారం రోజుల పాటు ప్రయాణించి కుండిన నగరానికి చేరుకున్నాడు. దేవశక్తిని కలుసుకున్నాడు. విషయాన్ని వివరించాడు.

"మా రాజుగారికి మీ కన్యకామణినిచ్చి వివాహం చేయాలి. ఇది మీ ఇరువురికీ బాగుంటుంది. అన్ని విధాలా కలసి వస్తుంది" అన్నాడు. అప్పటికే పరిచారికల ద్వారా కూతురు కనకవర్షుని ప్రేమిస్తున్నదని తెలుసుకున్న దేవశక్తి అందుకు ఆనందంగా అంగీకరించాడు.

"మా మదనసుందరి అందంలోనే కాదు, ఆనందాన్ని కలిగించే అద్భుత నాట్యంలోనూ దిట్ట" అన్నాడు దేవశక్తి. సంగమస్వామికి ఆమె నాట్యాన్ని చూపించాడు. పెళ్ళి పెద్దగా సుందరి నాట్యాన్ని చూసి 'ఆహా' అనుకున్నాడు సంగమస్వామి. తర్వాత కనకవర్షునికి శుభవర్తమానం పంపి, పెళ్ళికి తరలి రావాల్సిందిగా తెలియజేశాడు.

వర్తమానం అందడమే ఆలస్యం. మంత్రి సామంతులతో కుండిన నగరానికి చేరుకున్నాడు కనకవర్షుడు. ముందుగా ఎదురొచ్చిన సంగమస్వామిని గుచ్చి కౌగిలించుకున్నాడు.

"మీ మేలు ఈ జన్మకు మరిచిపోలేను" అన్నాడు.

"దశాగ్రహారాలు మీకు బహుమతిగా అందజేస్తున్నాను. స్వీకరించండి" అన్నాడు.



"మహాప్రసాదం" అన్నాడు సంగమస్వామి.

దేవశక్తి మహారాజు ఎదురొచ్చాడు. అతనికి నమస్కరించాడు కనకవర్షుడు. వర్షుణ్ణి దగ్గరగా తీసుకున్నాడు దేవశక్తి. గజ తురంగ పదాతి దళాలు ఊరేగింపుగా రాగా వారి మధ్య చుక్కల్లో చంద్రుడిలా వెలుగుతూ నగర ప్రజలకు కనువిందు చేశాడు కనకవర్షుడు. మర్నాడు పెళ్ళి. ఈ రోజే కానుకగా తానుంటున్న నగరం తప్ప మిగిలిన నగరాల్ని, రాజ్యాల్ని అల్లునికి కానుకగా అందజేశాడు దేవశక్తి. అంగరంగ వైభవంగా పెళ్ళి జరిపించాడు. కొత్త అల్లునిగా ఏడు రోజుల పాటు అక్కడే ఉండి, తర్వాత భార్యా సమేతంగా కనకపురానికి బయల్దేరాడు వర్షుడు. రాజ్యానికి చేరుకున్న నాటి నుంచి అంతఃపురంలో మదన సుందరితో ప్రణయమే లోకం అయిపోయిందతనికి. ఎల్లప్పుడూ ఆమె బిగి కౌగిట అతను ఉండాల్సిందే! అలాగే అతని పెదవులు ఆమెకు నిత్యం అమృత ధారలు కురిపించాల్సిందే! సుందరిని వీడి మహారాజు రాకపోవడాన్ని ఇతర రాణులు భరించలేకపోయారు. దుఃఖించసాగారు వారంతా. ఇంతలో వసంతం వచ్చింది.

ఉద్యానవనంలో చెట్టూ పుట్ట కళకళలాడసాగాయి. కోయిలలు కూయసాగాయి. ప్రకృతి అంతా ప్రేమను ప్రేరేపిస్తోంది. సుందరితో సరస్సులో జల క్రీడలాడేందుకు అక్కడికి వచ్చాడు

కనకవర్షుడు. సుందరితో రాజును చూసి చిన్నబుచ్చుకున్నారు మిగిలిన రాణులు. అయినా అతనితో ఆటలాడేందుకు సిద్ధమయ్యారు. సుందరితో పాటుగా తాము కూడా సరస్సులోకి దిగారు. రాజును వదలడం లేదు మదనసుందరి. అతనిని తన వెంటే తిప్పుకుంటోంది. అది భరించలేని ఒక రాణి నీటి అడుగునకు చేరి రాజుని సమీపించింది. గిలిగింతలు పెట్టింది. తనని అలా గిలిగింతలకు గురి చేసే రాణి ఎవరో కనకవర్షునికి తెలుసు! నవ్వుతూ అతనూ నీటి అడుగునకు చేరాడు. రాణిని అందుకుని ఆమెతో ఆటలాడసాగాడు. నీటి పైకి ఎంతకీ రాని రాజు మీద మదనసుందరికి కోపం వచ్చింది. పిలిచి పిలిచి అలసిపోయింది. ఏడుపొచ్చిందామెకు. దాంతో సరస్సులో ఉండలేనితనంతో ఒడ్డుకు చేరుకుని పరుగున అంతఃపురానికి వెళ్ళిపోయింది. కాస్సేపటికి కనకవర్షుడు నీటి పైకి చేరుకుని సుందరి కోసం నలువైపులా చూశాడు. కనిపించలేదామె.

''ఏమయిపోయింది'' అడిగాడు.

''మీ మీద కోపం తెచ్చుకుని అంతఃపురానికి వెళ్ళిపోయింది'' చెప్పిందో రాణి.

''అయ్యయ్యో'' అని అక్కణ్ణుంచి బయల్దేరాడు కనకవర్షుడు. సుందరి అంతఃపురానికి చేరుకున్నాడు. ఆమె ఏకాంత మందిరంలోకి ప్రవేశంచబోతుంటే ''వద్దు! వెళ్ళొద్దు'' అన్నది పంజరంలోని రామచిలుక.

''ఎందుకు వెళ్ళొద్దు'' నవ్వుతూ ప్రశ్నించాడు.

''మదనసుందరి మండిపోతోంది! నువ్వంటే కోపంతో ఉంది'' అన్నది రామచిలుక.

''అంతేకదా! ఏం కాదు'' అన్నాడు రాజు. మూసిన తలుపుల్ని తెరుచుకుని లోపలికి ప్రవేశించాడు. సుందరి అక్కడి స్తంభాన్ని ఆనుకుని అటు తిరిగి ఉండి దుఃఖిస్తోంది. ఆమె రోదిస్తున్నదన్నది ఎగిసి పడుతోన్న ఆమె భుజాలను బట్టి తెలుసుకున్నాడతను. దగ్గరగా వెళ్ళాడు. ఓదార్పుగా ఆమె భుజమ్మీద చేయి వేశాడు. విసిరి కొట్టిందామె. మళ్ళీ వేశాడు. మళ్ళీ విసిరి కొట్టిందామె.

''తప్పయిపోయింది. క్షమించు సుందరి'' అన్నాడు కనకవర్షుడు. ఆమెను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. వీలుకాలేదు. బిగుసుకుందామె.

''నీ దాసుణ్ణి! దణ్ణం పెడుతున్నాను. ఇటు చూడు'' అన్నాడు. అయినా ఇటు తిరగలేదామె.

''దాసుని తప్పు దణ్ణంతో సరన్నారు. అయినా నీకు కనికరం కలగలేదంటే...ఏం చెయ్యాలి? నీ కాళ్ళు పట్టుకోనా'' అడిగాడు రాజు. సమాధానం లేదు సుందరి దగ్గర్నుంచి. ఆలస్యం చేయలేదు కనకవర్షుడు. సుందరి కాళ్ళ మీద పడ్డాడు. రాజు తన కాళ్ళ మీద పడడం తట్టుకోలేకపోయింది సుందరి.

''మహారాజా'' అంటూ అతన్ని గుండెలకదుముకుంది. ఆమెను ముద్దులతో ముంచెత్తాడతను. ఎత్తుకుని తల్పం దగ్గరకు తీసుకుని వచ్చాడు. సుర సౌఖ్యాలు చూపించాడు. కాస్సేపటికి అలసి సొలసి నిద్రించారిద్దరూ.

ఆ నిద్రలో కలగన్నాడు కనకవర్షుడు. కలలో నెత్తి మీద కొమ్ముతో, నాలుక బయట పెట్టుకుని అరుస్తూ పరుగున వచ్చిందో స్త్రీ. చూసేందుకే గగుర్పాటుగా ఉందామె. వస్తూనే కనకవర్షుని మెడలోని రత్నాల హారాన్ని లాగి వేసింది. నుదుటి మీది వజ్రాన్ని కూడా తొలగించింది. అదృశ్యమయింది. అంతలో బేతాళుడు వచ్చాడు. కనకవర్షుని రెండు చేతులా కొడుతూ బాధించసాగాడు. తిరగబడ్డాడు కనకవర్షుడు. బేతాళుణ్ణి ఎత్తి కిందపడేశాడు. అయితే కిందపడ్డ బేతాళుడు వెంటనే లేచి కనకవర్షుని ఎత్తుకుని వీపు మీద పెట్టుకుని ఆకాశమార్గాన దూసుకునిపోసాగాడు. తప్పించుకో వీలు లేకపోయింది వర్షునికి. నడి సముద్రం మీద ప్రయాణిస్తూ వర్షుణ్ణి సముద్రంలోకి విసిరేశాడు బేతాళుడు. అరుచుకుంటూ అదృశ్యమయిపోయాడు. నానా కష్టాలూ పడి తీరానికి చేరుకున్నాడు కనకవర్షుడు.

ఆయాసపడుతూ చూసుకుంటే మెడలో రత్నాల హారం వూగుతూ కనిపించింది. తడిమి చూసుకుంటే నుదుటి మీద వజ్రం కూడా ఉంది. ఏవీ పోలేదు. మెలకువ వచ్చింది కనకవర్షునికి. లేచి కూర్చున్నాడు. చుట్టూ చూశాడు. సుందరి మంచి నిద్రలో ఉంది. కౌగిలి నుంచి తప్పుకున్నందుకేమో! తన కోసం చేయి జాచి వెతుక్కొంటోంది. పక్షులు అరుస్తున్నాయి. తెలతెలవారుతున్నట్టుగా ఉంది. ఆలోచనలో పడ్డాడు కనకవర్షుడు. తను కన్న కలకు అర్థం ఏమిటి? ఏ ఫలితాన్ని సూచిస్తోందది? బేతాళుని హింస వెనుక ఏ ప్రమాదం పొంచి ఉంది? కనుక్కోవాలనుకున్నాడు. తెల్లారగానే ఆస్థాన పండితుణ్ణి పిలిచి తను కన్న కలంతా వివరించి ఫలితం చెప్పమన్నాడు.

పండితుడు కళ్ళు మూసుకుని ఆలోచించాడు. శూన్యంలో తర్జనితో ఏవేవో గీతలు గీసి తర్వాత కళ్ళు తెరిచాడు. ఇలా అన్నాడు.

''స్వప్నఫలం చెడునే సూచిస్తోంది. చెప్పమంటారా మహారాజా'' అడిగాడు పండితుడు.

''చెప్పండి. పర్వాలేదు'' అన్నాడు కనకవర్షుడు.

''కొన్నాళ్ళ పాటు మీరు మదనసుందరి రాణిగారికి దూరంగా ఉంటారు. అంటే ఎడబాటు ప్రాప్తిస్తుంది. అలాగే కొడుకు కూడా కొన్నాళ్లు మీకు దూరం అవుతాడు'' చెప్పాడు పండితుడు. సుందరికి దూరం అవుతాడంటే అర్థం ఉంది. కొడుక్కి తానెలా దూరం అవుతాడు, కొడుకే లేనప్పుడు అనుకున్నాడు రాజు. ఆ మాటే పండితుణ్ణి అడిగాడు.

''త్వరలో మీకు పుత్రుడు జన్మిస్తాడు. మదనసుందరి రాణిగారు కొడుకును కంటారు. అప్పుడిదంతా జరుగుతుంది'' చెప్పాడు. తనకు కొడుకు కలగబోతున్నాడు. వంశోద్ధారకుడు జన్మించబోతున్నాడు. ఆనందంగా ఉంది కనకవర్షునికి. అయితే ఆ కొడుక్కి తను దూరమవుతాననడం బాధగా ఉంది అతనికి. మదనసుందరికి, ఆమె కనబోయే కొడుక్కి తాను దూరమవడం భరించలేననుకున్నాడు కనకవర్షుడు.

(సశేషం)

మూడు రోజులకు ముప్పై లక్షలు...

మూడు రోజులకి ముప్పై లక్షలంటే....అంటే రోజుకి పది లక్షలన్నమాట. అంటే నెలకి దాదాపు కోటి రూపాయలు. ఇది తమన్నా ఆదాయం. తమన్నా రెమ్యునరేషన్ కోటికి పైమాటే అన్న సంగతి అందరికీ తెలిసిందే! అయితే ఈ లెక్క ఇప్పటి వరకూ సినిమాల వరకే పరిమితమైంది. ఇప్పుడు ఇది యాడ్స్‌కు కూడా చేరింది. సిలికాన్ మొబైల్స్ కంపెనీకి పని చేయడానికి తమన్నా మూడు రోజులకు ముప్పై లక్షలు తీసుకున్నదట! ఇప్పటి వరకూ ఇలియానా, జెనీలియా తదితర హీరోయిన్లు కమర్షియల్ యాడ్స్ చేసినా, ఇంత పెద్ద మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకోలేదట! ఈ డీల్‌ని సెటిల్ చేసింది స్వయంగా తమన్నా ఫాదర్ సంతోష్ భాటియా. తన కూతురు యాడ్స్‌లో కనిపించాలని సంతోష్ భాటియా ఎప్పటి నుంచో కలలు కంటున్నాడట! తండ్రి కల నెరవేర్చడం కూతురిగా తన బాధ్యత కాబట్టి తమన్నా డేట్స్ అడ్జస్ట్ చేసుకొని సిలికాన్ మొబైల్స్‌కి చేసిందట! సినిమా కన్నా యాడ్స్ ఆదాయం బాగుంది కాబట్టి ఇక మీదట వీటి మీద కూడా దృష్టి పెడుతుందట తమన్నా!

అలిగిన మదనసుందరిని లాలించి మైమరచి నిద్రించిన కనకవర్షుడు, ఆ రాత్రి ఓ కల గన్నాడు. తెల్లారి ఆ కలను పండితునికి వివరిస్తే దాని ఫలితాన్ని అతనిలా తెలియజేశాడు.

''త్వరలోనే మదనసుందరి రాణిగారు కొడుకుని కంటారు. కన్న తర్వాత కొన్నాళ్ళకు ఆ రాణిగారికి, ఆమె కొడుక్కీ మీరు దూరంగా ఉంటారు. అంటే ఎడబాటు ప్రాప్తిస్తుంది''

వంశోద్ధారకుడు జన్మిస్తాడని ఆనందంగా ఉన్నా భార్యాబిడ్డలకు దూరమవడాన్ని భరించలేననుకున్నాడు కనకవర్షుడు. అతని కళ్ళు చెమర్చాయి. అది గమనించి మళ్ళీ ఇలా చెప్పాడు పండితుడు.

''మీకు ఆ ఎడబాటు కొన్నాళ్ళు మాత్రమే మహారాజా! తర్వాత మీరంతా కలుసుకుంటారు''

మదనసుందరి కథ

2

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

అయినా కనకవర్షుడు సంతోషించలేదు. మదనసుందరిని, కొడుకునీ విడిచి ఉండడమంటే...ప్రాణాన్ని విడిచినట్టేనన్నది అతని ఆలోచన అయింది. రాత్రీ పగలు అదే ఆలోచనతో నిద్రకు దూరమయ్యాడతను. అలా నిద్ర లేని ఓ రాత్రి వేళ...కనకవర్షుడు మూసిన గది తలుపుల్ని చూస్తుండగా మూసి ఉన్న ఆ తలువుల్లోంచి ఓ స్త్రీ మూర్తి ప్రత్యక్షమయింది. గదిలో కొలువుదీరింది. చూసి ఆశ్చర్యపోయాడు కనకవర్షుడు.ఆ ఆశ్చర్యంలోనే చేతులు జోడించాడామెకు.

''కనకవర్షా! నేను నాగరాజు వాసుకి కుమార్తెను. నా పేరు రత్నప్రభ. నీ తండ్రికి అక్కను. అంటే నీకు నేను అత్తమ్మను. నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అదృశ్యంగా నీ ముందే ఉంటున్నానెప్పుడూ. అయితే నేనీవేళ నీ ముందు ప్రత్యక్షం కావడానికి కారణం ఉంది. బాధపడుతోన్న నిన్ను నేను చూడలేను. బాధపడకు నాయనా! బాధపడకు'' అంది రత్నప్రభ.

''బాధపడకు అంటే ఎలా అత్తయ్యా! లేక లేక కొడుకు కలగబోతున్నాడంటే ఆనందంగా ఉన్నా వాడితో ఎడబాటు అంటున్నారు. తట్టుకోలేకపోతున్నాను'' అన్నాడు కనకవర్షుడు.

''ఎడబాటు సంగతి తర్వాత. ముందు నీకు కొడుకు కావాలంటే నువ్వో పని చెయ్యాలి''

''చెప్పు అత్తయ్యా! నేనేం చెయ్యాలి''

''కుమారస్వామిని ప్రసన్నం చేసుకోవాలి. ఆ దేవుని కోసం తపస్సు చెయ్యాలి. నీ తపస్సు ఫలిస్తే ఆ స్వామి కరుణా కటాక్ష ధార నీ శిరస్సును ఆశ్రయిస్తుంది. చాలా బలంగా పడుతుందది. దాని వేగాన్ని తట్టుకోగలగాలి. సామాన్యుడిగా నీకది సాధ్యం కాదు కాబట్టి ఆ ధార పడినప్పుడు నేను నీలో ఉంటాను. నా ప్రభావంతో దానిని నువ్వు తట్టుకోగలవు. అలాగే చాలా కష్టాలను ఓర్చుకోగలుగుతావు'' అంది రత్నప్రభ.

''కృతజ్ఞుణ్ణి'' అన్నాడు కనకవర్షుడు. అంతే! రత్నప్రభ అదృశ్యమయింది.

మర్నాడు రాజ్యాన్ని మంత్రి సామంతులకు అప్పగించి అరణ్యానికి ప్రయాణమయ్యాడు కనకవర్షుడు. అక్కడ కుమారస్వామి దేవాలయం ముందు కూర్చుని తీవ్ర తపస్సు చేయసాగాడు. ఎండకు ఎండిపోయాడు. వానకి తడిసిపోయాడు. గాలికి ఆరిపోయాడు. అయినా ఏకాగ్రత వీడలేదు. రత్నప్రభ అతనిలో అదృశ్యంగా తిష్ట వేసుక్కూర్చుండడంతో కష్టాలన్నిటినీ ఎదుర్కోగలిగాడు. కొద్ది రోజులకి స్వామి కటాక్షం లభిం

ప్రత్యక్షమయింది. ఆమెను చూసి భయపడి, పాలు తాగుతోన్న పిల్లాణ్ణి మరింత దగ్గరగా తీసుకుంది మదనసుందరి. ఆ స్త్రీ మూర్తి తనని సమీపిస్తోంటే 'ఎవరక్కడ! ఎవరక్కడ' అంటూ మదనసుందరి సైనికుల్ని ఉద్దేశించి కేకలు పెట్టింది. అయితే ఆ కేకలు అక్కడ ఎవరికీ విన రాలేదు. అంతా మత్తులో జోగుతున్నారు. వారి నలా మత్తులో ముంచిందా స్త్రీ మూర్తి. మదన సుందరి పొత్తిళ్ళలో ఉన్న బాబును ఒక్కదుటన లాక్కుందామె.

''రాక్షసి! రాక్షసి నా బిడ్డను లాక్కుపోతోంది'' గోల చేయసాగింది మదనసుందరి. స్త్రీ మూర్తి చేతిలో వేలాడుతోన్న పిల్లాణ్ణి చూసి ఏడవసా గింది. సాయంగా ఒక్కరు కూడ రాలేదు. అంతా మత్తుగా నిద్రపోతున్నారు. పిల్లాడితో పాటుగా స్త్రీ మూర్తి అంతఃపురం దాటి అడవిలోకి పరుగు దీసింది. ఆమెను వెంబడించింది మదనసుం దరి. చీకటిలో చెట్టూ పుట్ట దాటి, పడుతూ లేస్తూ స్త్రీ మూర్తిని ఓ కంట కనిపెడుతూనే ఉంది. చెరువు దగ్గరగా వచ్చింది స్త్రీ మూర్తి. తనని అనుసరించి వస్తోన్న మదనసుందరిని చూసి నవ్వి, చేతిలో ఉన్న పిల్లాడితో పాటుగా చెరువులోకి దూకింది.

''బాబూ'' అంటూ మదనసుందరి కూడా క్షణం తేడాలో చెరువులోకి దూకేసింది.

తెల్లగా తెల్లారింది.

పురిటింటిలో బాబు, రాణిగారు లేకపోవ డంతో అంతా ఆందోళన చెందారు. దుఃఖించసా గారు. విషయం తెలిసి కనకవర్మడు వచ్చాడక్క డికి. హంసతూలికాతల్పం ఖాళీగా ఉంది. మద నసుందరి, ముద్దులు మూటగట్టినట్టుండే బాబు లేరక్కడ. మూర్ఛపోయాడతను. కాస్సేపటికి తేరుకుని అంతా శాప ఫలితమని రోదించసా గాడు. మంత్రి సామంతులు ఎంతగా ఓదా ర్చినా ఫలితం లేకపోయింది. కనకవర్మడు కంటికి మంటికీ ఏకధారగా ఏడవసాగాడు. ఒక నాటి రాత్రి రాజ్యాన్ని వదలి అతను అడవి దారి పట్టాడు. వింధ్యారణ్యంలోకి ప్రవేశించాడు. ఆ అరణ్యంలో రాత్రీ పగలు నడచి నడచి అలసి పోయి వింధ్యపర్వతాన్ని సమీపించాడు. దాహంగా ఉండటనికి. నీటి కోసం చూశాడు.

సెలయేరు కనిపించింది. పెద్ద పెద్ద అడుగులు వేసి చేరుకున్నాడక్కడికి. దోసిట నీరు పట్టి తాగాడు. మత్తుగా కళ్ళు మూతలు పడుతోంటే అక్కడి చెట్టునానుకుని కూర్చున్నాడు. ఎంతసేపలా కూర్చున్నాడో తెలియలేదు. పర్వతాన్ని వణికిస్తున్నట్టుగా గర్జన వినరావడంతో కళ్ళు తెరిచి చూశాడు. గుహలోంచి గర్జిస్తూ వస్తోంది సింహం. భయంతో అచేతనుడయ్యాడు కనకవర్షుడు. సింహం అతని మీదికి దూకబోతోంది. తప్పించుకోలేని స్థితి కనకవర్షునిది. ప్రాణాలు పోతాయి. సందేహం లేదు అనుకుంటున్న తరుణంలో ఆ దృశ్యాన్ని ఆకాశ మార్గాన ప్రయాణిస్తోన్న విద్యాధరుడు చూశాడు. 'పాపం కనకవర్షుడు' అనుకున్నాడు. వెంటనే కిందికి దిగి, సింహాన్ని ఎదిరించాడు. కత్తితో దాన్ని నరికి కాకులకూ గెద్దలకు వేశాడు.

"మహానుభావులు మీరెవరో కాని, నా ప్రాణాల్ని కాపాడారు! కృతజ్ఞుణ్ణి" అన్నాడు కనకవర్షుడు. విద్యాధరుని ముందు చేతులు జోడించి నిలుచున్నాడు.

"ఇక్కడికెందుకు వచ్చారు మహారాజా! దేశ బహిష్కృతునిలా ఏంటీ వేషం" అడిగాడు.

"నేను మహారాజునని మీరెలా తెలుసుకోగలిగారు" అడిగాడు కనకవర్షుడు.

"భార్యా బిడ్డల్ని పోగొట్టుకుని పిచ్చివాడిలా ఉన్న నన్ను మీరెలా గుర్తు పట్టారు" మళ్ళీ అడిగాడు.

"నేను ఒకప్పుడు మీ ఊరి వాడనే! మీకు బంధువుని కూడా! అప్పుడు నేను మనిషిని. ఇప్పుడు విద్యాధరుణ్ణి. ఈ విద్యాధరత్వాన్ని ఎలా సాధించానో మీకు తెలీదా? మీరే అప్పుడు నాకు సహకరించారు. మీ సహాయ సహకారాలతోనే నేను బేతాళుని సాధించి ఇంతటివాణ్ణయ్యాను. మిమ్మల్ని కాపాడగలిగాను" అన్నాడు విద్యాధరుడు.

"మీ పేరు" అడిగాడు కనకవర్షుడు.

"బంధుప్రభుడు" అన్నాడతను.

"ఈ పేరు వింటే నాకంతా గుర్తుకు వస్తోంది. అవునవును! మీరు నాకు బంధువు. బంధువు కంటే మిత్రువు కూడా" అన్నాడు కనకవర్షుడు.

"మిత్రమా! విద్యాధరుడవయిన నీకు చాలా విషయాలు తెలుస్తాయి. నా విషయం చెప్పు! నేను నా భార్యబిడ్డలను ఎప్పుడు కలుసుకుంటాను" అడిగాడు.

"ఎప్పుడంటే...వింధ్యవాసినీదేవిని మీరెప్పుడు చూస్తారో అప్పుడు" అన్నాడు బంధుప్రభుడు.

"మరి నాకు శలవు" అని ఆకాశానికి ఎగిసి అదృశ్యమయ్యాడు.

వింధ్యవాసినీదేవిని తను కలుసుకోవాలి. ఆమెను కలుసుకుంటే భార్య మదనసుందరి, కొడుకు హిరణ్యవర్షుడు తనని కలుస్తారనుకుని, వింధ్యవాసినిని కలిసేందుకు కనకవర్షుడు బయల్దేరాడు. పెద్ద పెద్ద అంగలుగా నడవసాగాడు. దారిలో ఏనుగు ఒకటి అతని మీద దాడి చేసింది. దాని నుంచి తప్పించుకునేందుకు కనకవర్షుడు గోతులున్న దారిని ఎంచుకుని ఆ దారంట పరుగులు పెట్టాడు. అతన్ని వెంబడిస్తూ వచ్చిన ఏనుగు గోతిలో పడి మరణించింది. గండం గట్టెక్కిందనుకున్నాడు కనకవర్షుడు. మెల్లగా నడచుకుంటూ వచ్చి ఓ సరస్సును చేరుకున్నాడు. ఆ సరస్సులోని నీరు తాగి సేదదీరుతోంటే...దారంట పోతోన్న శబరులు కొందరు అతన్ని బంధించారు. దేవతకు బలి ఇచ్చేందుకు అతన్ని తమ నాయకుని దగ్గరకు తీసుకుని పోయారు. లక్షణంగా ఉన్న కనకవర్షుని చూసి బలికి తగ్గ మనిషి అనుకున్నాడు ఆ నాయకుడు. కనకవర్షుని తాళ్ళతో బంధించి అతనిని బలి ఇచ్చేందుకు వింధ్యవాసిని గుడికి తీసుకుని పోయాడు. గుడిలో వింధ్యవాసినిని చూసి చేతులు జోడించాడు కనకవర్షుడు. అంతే! ఆ దేవి కృపా కటాక్షంతో అతని బంధనాలు తెగిపోయాయి. అది చూసి నాయకునికి నోట మాట కరవయింది. కనకవర్షుని బలి చేసే ఆలోచన మానుకున్నాడతను. మూడు మరణ భయాలూ ముగిసిపోయాయి. అప్పటికి సరిగ్గా భార్యబిడ్డలకు దూరమై సంవత్సరం కావడంతో శాపం తీరిపోయింది. అత్తమ్మ రత్నప్రభ ప్రత్యక్షమయింది. ఆమె వెంట మదనసుందరి, సుందరి చేతుల్లో కొడుకు హిరణ్యవర్షుడు ఉన్నారు. కనకవర్షుడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు.

"అత్తమ్మా" అన్నాడు.

"కుమారస్వామి శాపాన్ని తెలుసుకుని మదనసుందరిని, నీ కొడుకుని నేను నా ఇంటికి తీసుకుపోయాను. ఆ రాత్రి నీ అంతఃపురంలోకి రాక్షసాంగనగా వచ్చింది నేనే! సంవత్సరం పాటుగా వీళ్ళను నా ఇంట కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాను. నా బాధ్యత నేను నిర్వర్తించాను. ఇదిగో నీ భార్య! నీ కొడుకు ఇదుగో! అందుకుని ఆనందంగా ఈ సకల భూమండలాన్ని పాలించు" అంది రత్నప్రభ. అదృశ్యమయింది. మదనసుందరి కనకవర్షుని చేరింది. కౌగిలించుకున్నారిద్దరూ. కొడుకుని అందించిందతనికి. అందుకుని ఆనందించాడతను. కనకవర్షుడు రాజని తెలుసుకున్న శబర నాయకుడు, అతని కాళ్ళ మీద పడి క్షమాపణ కోరాడు. క్షమించాడు కనకవర్షుడు. ఎలా తెలుసుకున్నాడో దైవకృపో తెలియదుగాని మామగారు దేవశక్తి సైన్య సమేతుడై అప్పుడక్కడికి వచ్చాడు. అల్లుణ్ణి, కూతుర్ని, మనవణ్ణి చూసి ఆనందించాడు. అందరూ ఏనుగులెక్కి అక్కణ్ణుంచి బయల్దేరారు. కనకపురానికి చేరుకున్నారు. రాజుని రాణిని భావి రారాజు హిరణ్యవర్షుని చూసి ప్రజలంతా పండుగ చేసుకున్నారు.

*

వచ్చేవారం
సుందరసేనుని కథ

స్పీడందుకుంటున్న త్రిష

పులిని చూసి నక్క వాతపెట్టుకున్న చందంగా ఆసిన్ చూసి బాలీవుడ్‌కి ఎగబాకిన త్రిషకు అక్కడ ఘోరపరాజయం ఎదురైంది అన్న సంగతి తెలిసిందే! బాలీవుడ్‌లో ఒక సినిమా చేస్తున్న సందర్భంలో దక్షిణాది నిర్మాతల వైపు చూడడానికి కూడా మనస్కరించని త్రిష ఇప్పుడు దక్షిణాదిని మించిన పరిశ్రమ లేదని అంటోంది. గతంలో 'మడి' కట్టుకు కూర్చున్న ఈ భామ ఇప్పుడు ఆ 'మడి'ని విప్పడానికి సిద్ధమంటోంది కూడా! ప్రస్తుతం తెలుగులో పవన్ కల్యాణ్‌తో ఓ సినిమా చేస్తుండగా మరో రెండు స్టార్ హీరో చిత్రాలు అంగీకరించనుందట! పనిలో పనిగా హీరో సిద్ధార్థ కూడా త్రిషతో నటించడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడట! ఈ ప్రాజెక్టులన్నీ ఓకే అయితే టాలీవుడ్‌లో త్రిష బండి మళ్ళీ స్పీడందుకోనుంది అన్నది నూటికి నూరుపాళ్ళు నిజం!

కథా సరిత్సాగరం

పూర్వం అలకా నగరాన్ని మహాసేనుడు పాలించేవాడు. పేరుకు తగినట్టుగానే అతను గొప్ప పరాక్రమవంతుడు. శూరుడు. పైగా సద్గుణ సంపన్నుడు. అతని భార్య పేరు శశిప్రభ. వారికి ఓ కుమారుడు. అతని పేరు సుందరసేనుడు. చిన్నతనం నుంచే సుందరసేనుడు వినయ విధేయతలకు విక్రమాలకు పెట్టింది పేరుగా నిలిచాడు. అతన్ని అన్ని విధాల కాపాడేందుకు, అతనికి సహకరించేందుకు వెన్నంటి చండప్రభుడు, భీమభుజుడు, వ్యాఘ్రపరాక్రముడు, విక్రమశక్తి, దృఢబుద్ధి అని అయిదుగురు మంత్రులుండేవారు. ఈ అయిదుగురికీ జంతు పక్షి భాషలు కూడా తెలుసు!



సుందరసేనుని కథ

1

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు '**అనీలజ**' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

సుందరసేనుడుకి యుక్తవయసు వచ్చింది. అయినా పెళ్ళి కాలేదతనకి. అందుకు కారణం సరయిన పిల్ల దొరకకపోవడమే! అందమయిన భార్య కావాలతనికి. ఎంతటి శత్రువునయినా ఇట్టే గెలిచి రావడం, కష్టపడి సంపాదించడం అంటే సుందరసేనునికి చాలా ఇష్టం. ఒకనాడు అతను మంత్రి సామంతులతో వేటకు బయల్దేరాడు. ఏనుగులు, గుర్రాలతో దుమ్ము రేపుకుంటూ నడుస్తోంది వారి పటాలం. ముసలి తాపసి ఎదురయింది వారికి. పట్టించుకోలేదెవరూ.

''ఆగు రాకుమారా! ఆగు'' అని కేకలు వేసింది ఆ తాపసి. అయినా ఎవరూ వినిపించుకోలేదు.

''రాకుమారా నీకే చెబుతోంది! ఆగు! నా ఆశీర్వాదం అందుకో! నీకంతా శుభమే జరుగుతుంది'' అంది మళ్ళీ. గుర్రాలు ఏనుగుల అదలింపుల్లో ఆమె మాటలు వినరాలేదెవరికీ. సుందరసేనుడు గుర్రాన్ని ముందుకు ఉరికించడంలో ఉత్సాహంగా ఉన్నాడు. మిత్రులతో పోటీ పడుతూ పరుగుదీస్తూ పగలబడి నవ్వుతున్నాడు. అతనికి తాపసి మాటలు అసలు వినిపించలేదు.

''రాకుమారా'' గట్టిగా కేకేసింది తాపసి. అరణ్యం అల్లల్లాడిపోయింది ఆ కేకకి. పటాలం ఆగిపోయింది. నిశ్శబ్దం ఆవరించుకుంది. వెను తిరిగి చూశాడు సుందరసేనుడు. దూరంగా తాపసి కనిపించింది. అక్కణ్ణుంచి అరుస్తోందామె.

''ఇప్పుడే ఇలా ఉన్నావంటే రేపు హంసద్వీపం రాజు కూతురు మందారవతిని పెళ్ళి చేసుకుంటే ఇంకెలా ఉంటావో''

'మందారవతి' అని గొణుక్కుంటూ గుర్రాన్ని వెనక్కి తిప్పాడు సుందరసేనుడు. తాపసిని సమీపించాడు. ఇలా అడిగాడు.

''ఎవరమ్మా నువ్వు''

''నా పేరు కాత్యాయని'' చెప్పింది తాపసి.

''నన్ను అంతా గౌరవిస్తారు. నా మాటంతా వింటారు. గౌరవించనిది, మాట విననిది నువ్వే'' అన్నది మళ్ళీ.

''తెలియక తప్పు చేశాను. క్షమించమ్మా'' అన్నాడు సుందరసేనుడు. చేతులు జోడించాడు. తర్వాత మిత్రుడు విక్రమశక్తి ఇంటికి ఆమెను సాగనంపి అక్కడ పంచభక్ష్య పరమాన్నాలతో విందు ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించాడు.

''వెళ్ళొస్తానమ్మా'' అని వేటకు బయల్దేరాడు. సాయంత్రం వరకు వేటాడి వేటాడి తిరిగొచ్చాడు. రాత్రి భోజనం ముగించుకుని విక్రమశక్తి ఇంటికి

వచ్చాడు సుందరసేనుడు.

''కాత్యాయని మాత పడుకుందా'' అడిగాడు.

''లేదు మేలుకునే ఉన్నాను'' అంటూ వచ్చిందామె.

''చెప్పండవ్వా! మందారవతి ఎవరు'' అడిగాడు సుందరసేనుడు.

''మందారవతి ఎవరంటే మందారదేవుని కూతురు. మందారదేవుడు హంసద్వీపానికి రాజు. మందారవతిని నేను చూశాను. చాలా అందగత్తె. ఆ అపురూప సౌందర్యానికి నువ్వే తగిన వాడివి'' అని నవ్వింది కాత్యాయని.

''ఆమె అంతటి అందగత్తెనా'' ఆశ్చర్యపోయాడు సుందరసేనుడు.

''మహా అందగత్తె మందారవతి. చూస్తే దేవతలు కూడా ఆమెను వివాహం చేసుకునేందుకు వరుసలో నిలబడతారు. చంద్రుణ్ణి చూర్ణం చేసి, అమృతంతో ఆ చూర్ణాన్ని మిళితం చేసి ఆ ముద్దతో చేసిన బొమ్మలా ఉంటుంది మందారవతి. చూసేందుకు రెండు కళ్ళు చాలవు'' అంది కాత్యాయని.

''చూస్తావా'' అడిగింది సుందరసేనుని.

''అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటాను''

నవ్వాడు సుందరసేనుడు.

''మందారవతి బొమ్మను నేను చిత్రించాను. గుడ్డ మీద గీశాను. ముందు బొమ్మను చూడు'' అంది కాత్యాయని. కూడా తెచ్చిన మూట విప్పి, అందులోంచి ఓ చిన్నపాటి పెట్టె తీసింది. ఆ పెట్టె తెరిచి పూతరేకులా పలుచగా ఉన్న గుడ్డని తీసి, మడతలు విప్పింది. ఆ మడతల్లో గుడ్డ మీద అద్భుతంగా ఉంది మందారవతి. బొమ్మను అంత బాగా గీసింది కాత్యాయని.

''చూడు'' చూపించింది. చూశాడు సుందరసేనుడు. చూసిన తర్వాత మరి కనురెప్ప వాల్చలేదతను. బొమ్మలా ఉండిపోయాడు. మిత్రులు కూడా మందారవతి బొమ్మను చూశారు. చాలా బాగుందనుకున్నారు. కాత్యాయనిని వారిలా అడిగారు.

''అమ్మా! మా యువరాజు బొమ్మ కూడా గీసి పెట్టండి. అప్పుడు రెండూ బొమ్మలూ పక్కన పెట్టి చూద్దాం''

''తప్పకుండా'' అంది కాత్యాయని. సుందరసేనుని బొమ్మ గీయనారంభించింది. గుడ్డ మీదే చిత్రించింది. సుందరసేనుడు ఎలా ఉన్నాడో అలాగే గీసింది. దాంతో మందారవతిని కల్పించి చిత్రించింది కాదని తెలుసుకున్నారు మిత్రులు. ఆ రెండు బొమ్మల్ని పక్కపక్కన పెట్టి చూశారు. ఈడు-జోడు బాగుందనుకున్నారు. సుందరసేనుడికి తగిన భార్య అనుకున్నారు. ఆ మాటే చెప్పారు యువరాజుకి. నవ్వాడు సుందరసేనుడు.

తన బొమ్మ గీసినందుకు, తనకి మందారవతిని పరిచయం చేసినందుకు కృతజ్ఞతగా కాత్యాయనికి తగిన బహుమతులిచ్చి ఆమెను పంపించేశాడు సేనుడు. తర్వాత ఆమె గీసిన రెండు చిత్రాలను పట్టుకుని అంతఃపురానికి వచ్చి వాటినే పదేపదే చూస్తూండిపోయాడు. తనని కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు ఏదో దాస్తున్నట్టుగా కన్పించసాగాడు యువరాజు. వారు దానిని గ్రహించారు. సేనుని మిత్రులని పిలిచి వివరాలు అడిగారు. వేటకు సేనుడు బయల్దేరడం, తాపసి తారసపడడం, మందారవతి చిత్రాన్ని చూపించడం... అంతా వివరించారు మిత్రబృందం.

''నీ కోరిక తప్పుకాదు బాబు! మా దగ్గర నువ్వు మందారవతిని దాచడమే తప్పు'' అన్నారు తల్లిదండ్రులు సుందరసేనునితో. సిగ్గుపడ్డాడు సేనుడు.

''మందారదేవుడు నాకు మిత్రుడు. నా మాట కాదనడు. మందారవతిని నీకిచ్చి పెళ్ళి చేయమంటాను'' అన్నాడు తండ్రి.

''ఈ విషయమై మన సురతదేవుణ్ణి దూతగా హంసద్వీపం పంపుతాను'' అన్నాడు మళ్ళీ. అన్నట్టుగానే దేవునికి కాత్యాయని చిత్రించిన సుందరసేనుని చిత్రపటాన్నిచ్చి పంపాడతను. ఓడలో ప్రయాణించి హంసద్వీపానికి చేరుకున్నాడు దేవుడు. మహారాజు మందారదేవుణ్ణి కలిశాడు.

''నేను అలకానగరం నుండి వచ్చాను. మా రాజు మహాసేనుడు మిమ్మల్ని క లుసుకోమన్నారు'' చెప్పాడు సురతదేవుడు.

''సుందరసేనుడు మా యువరాజు. వారు మీ అమ్మాయి మందారవతి చిత్రపటాన్ని చూసి మోహించారు. ఆ పటాన్ని తాపసి కాత్యాయని చూపించిందతనికి. తన అందచందాలకు సరయిన కన్య దొరకకపోవడంతో ఇన్నాళ్ళూ యువరాజు పెళ్ళి చేసుకోలేదు. ఇప్పుడు మీ అమ్మాయిని చూసి ప్రేమించారు. పెళ్ళి చేసుకుంటానంటున్నారు. యువరాజుగారు మీ అమ్మాయికి తగిన వారు. అంద చందాల్లో మీ అమ్మాయికి ఏమాత్రం తీసిపోరు'' అన్నాడు మళ్ళీ. 'అలాగా' అన్నట్టుగా తలూపాడు మందారదేవుడు.

''ఇది మా యువరాజు సుందరసేనుని చిత్రపటం. తిలకించండి'' అని చేతిలోని చిత్రపటాన్ని అందించాడు దేవుడు. అందుకున్నాడు మందారదేవుడు. చూసి విస్తుపోయాడు. మందారవతికి తగిన అందగాడు దొరకడనుకున్నారు ఇన్నాళ్ళూ. ఇప్పుడు ఆ ఆలోచన తప్పని తెలిసింది. భార్యకు చూపించాడు పటాన్ని.

''అబ్బాయి చాలా బాగున్నాడండి'' మెచ్చుకుంది రాణి.

"అయితే అమ్మాయి అభిప్రాయం కనుక్కుందాం" అని చిత్రపటాన్ని తీసుకుని మందారవతి అంతఃపురానికి వచ్చారిద్దరూ. విషయాన్ని వివరించి సుందరసేనుని చిత్రపటాన్ని ఆమె చేతిలో ఉంచారు.

"చూడమ్మా! అబ్బాయి నీకు నచ్చితేనే పెళ్ళి" అన్నారు. సిగ్గుపడుతూ సిగ్గుపడుతూ సుందరసేనుని చిత్రపటాన్ని మెల్లమెల్లగా కళ్ళెత్తి చూసింది మందారవతి. చూసిన తర్వాత మరి చూపు తిప్పుకోలేదు. ఎంత అందగాడు. పేరుకి తగినట్టుగానే ఉన్నాడనుకుంది. సుందరసేనుని గుండెల్లో నింపుకుంది. కూతురు సిగ్గుచాటు నవ్వులు, చిత్రపటం మీద నిలిచిన ఆమె చూపుల్లోని భావాలు గ్రహించాడు మందారదేవుడు. అమ్మాయికి అబ్బాయి నచ్చినట్టేనని నిర్ణయానికి వచ్చాడు. దూత సురతదేవుడికి తన అభిప్రాయాన్ని ఇలా తెలియజేశాడు.

"ఈ పెళ్ళి మాకిష్టమే! మా అమ్మాయికి మీ అబ్బాయి నచ్చాడు"

"మహదానందం మహారాజా" చేతులు జోడించాడు దేవుడు.

"రేపు మీతో పాటుగా మా దూత కుమారదత్తుడు వస్తాడు. ఇద్దరూ కలసి అలకాపురాన్ని చేరి మా అంతరంగాన్ని మీ మహారాజుకి విన్నవించండి" చెప్పాడు మందారదేవుడు.

"స్నేహం కోసం మేం ప్రాణాల్నే ఇస్తాం. అలాంటిది మిత్రుడు మహాసేనుడు మా అమ్మాయిని కోడలిగా అడిగితే కాదంటానా? కాదనను. ఈ పెళ్ళి అన్ని విధాలా మాకు సంతోషదాయకమే! అయితే పెళ్ళి ఎక్కడ చేస్తారు? ఇక్కడ మందారద్వీపంలోనా? లేక అక్కడ అలకాపురంలోనా? తేల్చి చెప్పమనండి! ఇక్కడ పెళ్ళయితే సుందరసేనుని తోడుకుని మీరు తరలి రండి! అక్కడ పెళ్ళనుకుంటే అమ్మాయిని తీసుకుని మేము తరలి వస్తాం" అన్నాడు మందారదేవుడు.

"ఈ విషయాలన్నీ మా మాటగా మహాసేనుని చెప్పండి! వెళ్ళి రండి" అన్నాడు.

కుమారదత్తుని వెంటబెట్టుకుని సురతదేవుడు అలకాపురానికి చేరుకున్నాడు. అంతా శుభమే అంటూ జరిగిందంతా మహాసేనునికి వివరించాడు. కూడా వచ్చిన మందారదేవుని దూతను పరిచయం చేశాడు. ఇక ఆలస్యం ఎందుకనుకుని పురోహితులను పిలిచి ముహూర్తాలు పెట్టండన్నారు. మూడు మాసాల అనంతరం కార్తిక శుక్ల పంచమి మంచి ముహూర్తం అని, ఆనాడు మందారద్వీపంలోనే పెళ్ళి అని చెప్పి...అవన్నీ వివరంగా రాసి దాన్ని కుమారదత్తునికి ఇచ్చి మందారదేవునికి అందించాల్సిందిగా చెప్పి పంపించారు. ఓడలో ప్రయాణించి వచ్చి మందారదేవుని కలుసుకుని మహాసేనుడిచ్చిన ఉత్తరాన్ని అతనికి అందించాడు కుమారదత్తుడు.

"పెళ్ళి ఇక్కడే మహారాజా! పెళ్ళి కొడుకు సుందరసేనుని తోడుకుని పెళ్ళి వారు ఇక్కడికే వస్తారు" చెప్పాడు. మందారదేవుడు ఆనందాన్ని పట్టలేకపోయాడు.

రెండు రాజ్యాలు పెళ్ళి సన్నాహాల్లో పడ్డాయి. కార్తిక శుక్ల పంచమి కోసం ఎదురు చూడసాగాయి.

పెళ్ళి మూడు మాసాల అనంతరం అంటే మందారవతి తట్టుకోలేకపోతోంది. సుందరసేనుని చిత్రపటం చూసిన దగ్గర్నుంచి ఆమె విరహాన్ని భరించలేకపోతోంది. పదే పదే చిత్రపటాన్ని చూస్తూ కింది పెదవిని పళ్ళతో కొరుక్కుంటోంది. పటాన్ని గుండెలకు అదుముకుంటోంది. మత్తు మత్తుగా సుందరసేనుణ్ణి చూస్తూ ముద్దులు పెడుతోంది. గమనించి చెలులు కవ్వించసాగారు.

"ఏంటమ్మా ఇది" అని నవ్వారు.

"ప్రేమే! సుందరసేనుని చూడలేక నేనుండలేనే! అతన్ని చూడక క్షణం కూడా ఉండలేని నేను మూడు మాసాల వరకు వేచి ఉండాలంటే నా వల్ల కాదు. ముహూర్తం మరీ అంత దూరంలో పెట్టారెందుకు? పారిపోయి అతని కౌగిట వాలుదామంటే అలకాపురం అంత దూరంలో ఉంది. దగ్గరలో లేదు" బాధపడింది మందారవతి. నిద్రమానుకుంది. అన్నం ముట్టడం లేదు. నీరు కూడా తాగకుండా నిలువునా కాలిపోసాగింది. తామరపువ్వుల మీద ఆమెను పడుకోబెట్టారు. తామరాకులతో ఆమెకు విసరసాగారు. అయినా మార్పులేదామెలో. మందారదేవుడికి ఇదంతా తెలియవచ్చింది. పెళ్ళి దాకా పిల్ల ఆగలేదు. సుందరసేనుని సమక్షంలో ఉంటేనే బతుకుతుంది. లేదంటే అనుమానమే అని రాజ వైద్యులంటే ఆలోచనలో పడ్డాడు రాజు. భార్యతోను, మంత్రులతోను చర్చించాడు. కూతురి విరహ జ్వరం తగ్గాలంటే ఆమెను అలకాపురానికి పంపడం ఒక్కటే పరిష్కార మార్గంగా తోచిందతనికి. ఇందులో సిగ్గుపడాల్సింది కాని, పరువు-ప్రతిష్టలు పోతాయన్న తలంపునకుగాని తావు లేదనుకుని అందుకు సిద్ధపడ్డాడు.

"మహాసేనుడు నాకు మిత్రుడు. అమ్మాయిని అక్కడకు పంపితే అతనేమీ అనుకోడు. భర్త చెంతనుంటేనే అమ్మాయి బ్రతుకుతుందంటే అన్యథా భావించడు. ఆలస్యం అనవసరం. అమ్మాయిని తీసుకుని అలకాపురానికి బయల్దేరండి" అన్నాడు మందారదేవుడు. మందారవతిని పెళ్ళికూతురుగా ముస్తాబు చేసి మంత్రి వినీతమతిని తోడుగా ఇచ్చి పంపించాడామెను.

ఓడ బయల్దేరింది. ఓడలో నిలువలేక వేగిపోతోంది మందారవతి. వాతావరణం సహకరించడంతో కొద్దిరోజులు ఓడ ప్రయాణం సజావుగానే సాగింది. ఒకనాడు ఊహించని విధంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉరుములు-మెరుపులతో పెద్దగా వర్షం కురియసాగింది. సముద్రం అల్లకల్లోలం కాసాగింది. పెద్ద ఎత్తున కెరటాలు విరిగిపడుతుండడంతో ఓడ ఊగిసలాడసాగింది. ఊగి ఊగి సముద్రంలోంచి పొడుచుకుని వచ్చిన పర్వతాన్ని ఢీ కొని రెండు ముక్కలయింది. మంత్రి వినీతమతి నీళ్ళలో మునిగి మరణించాడు. సేవకుల్లో కూడా ఒక్కరూ మిగల్లేదు. చనిపోయారు. వెంట తెచ్చిన ధనరాశులన్నీ నీటి పాలయ్యాయి. మందారవతి మాత్రం చిత్రంగా బతికి బట్టకట్టింది. ఆమెను అలలు తీరానికి విసిరికొట్టాయి. ఇసుకలో గుచ్చుకుని బోర్లా పడి ఉన్నది మందారవతి. ఆమె ఇప్పుడు రాకుమారిలా లేదు. సాధారణ స్త్రీలా ఉంది.

(సశేషం)

అనుష్క అదృష్టవంతురాలు...

అనుష్క అదృష్టవంతురాలు... ఈ మాట అన్నది మామూలు వ్యక్తి అయితే పట్టించుకోనక్కర్లేదు. కానీ టాలీవుడ్, కోలీవుడ్ అందాల భామ త్రిష కృష్ణన్. ఇంత అర్జంట్‌గా త్రిషకు అనుష్కను అదృష్టవంతురాలు అని పొగడాల్సిన అవసరం ఏమిటా? అని ఆశ్చర్యపోకండి. త్రిషకు అనుష్క చేసిన గొప్ప పాత్ర ఒకటి గుర్తుకొచ్చి పై విధంగా కామెంట్ చేసింది.

అనుష్క కెరీర్‌లో 'అరుంధతి' మైలురాయి లాంటిదని అందరికీ తెలిసిందే! అలాంటి క్యారక్టర్ తనకు కనుక వస్తే మరో మాట లేకుండా అంగీకరించేస్తానని త్రిష అంటోంది. ఈ సందర్భంగానే అనుష్కను ఆకాశానికి ఎత్తేసింది. బాలీవుడ్‌లో అవకాశాలు తక్కువ కావడంతో టాలీవుడ్, కోలీవుడ్‌ల వైపు దృష్టి సారించి, ఎట్టకేలకు కొన్ని అవకాశాలను త్రిష దక్కించుకున్న సంగతి తెలిసిందే! ప్రస్తుతం టాలీవుడ్, కోలీవుడ్‌లలో నెంబర్ వన్ పొజిషన్‌లో ఉన్న అనుష్కను మంచి చేసుకుంటే మరిన్ని అవకాశాలు దక్కించుకోవచ్చు అన్న అభిప్రాయంతోనే త్రిష ఆమెను పొగిడిందని అంటున్నారు. అదీ సంగతి!

కథా సరిత్సాగరం

సుందరసేనుని కోసం వేగిపోతున్న మందారవతిని తండ్రి ఓడెక్కించాడు. ఆమెకు తోడుగా మంత్రి వినీతమతిని కూడా పంపించాడు. కొద్ది రోజులు ఓడ ప్రయాణం సజావుగానే సాగింది. తర్వాత ఊహించని విధంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. తుపాను చెలరేగింది. దాంతో ఓడ పర్వతాన్ని ఢీ కొని రెండు ముక్కలయింది. వినీతమతి సముద్రంలో మునిగి మరణించాడు. సేవకులు కూడా ఎవరూ మిగల్లేదు. అంతా గతించారు. ధనరాశులూ నీట పాలయ్యాయి. మందారవతి మాత్రం చిత్రంగా తీరానికి కొట్టుకొచ్చింది. ఇసుకలో గుచ్చుకుని బోర్లా పడి ఉన్నది. చాలా సేపటి వరకు స్పృహ రాలేదామెకి. అలాగే పడి ఉన్నది. తెల్లారింది. సూర్యోదయం అయింది. సూరెండకు నిద్ర నుంచి మేల్కొన్నట్టుగా మేల్కొందామె. కంటి మీది ఇసుకను తొలగించుకుంది. మెల్లగా తలెత్తింది. చుట్టూ చూసింది. అనంత సముద్రం ఒక ప్రక్క. మరో ప్రక్క చిక్కగా అడవి. తోడుగా వచ్చిన మంత్రి లేడు. పరిచారికులు లేరు. ఏమయింది తనకి? తానెందుకు ఇక్కడ ఒంటరిగా పడి ఉంది? అంతు చిక్కలేదు మందారవతికి. ఆలోచించసాగింది. గుర్తొచ్చాయి అన్నీ. దాంతో ఏడుపొచ్చిందామెకు.

సుందరసేనుని కథ

2

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు 'అనీలజ' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

ఎక్కడ హంసద్వీపం...ఎక్కడీ సముద్ర తీరం? హాయిగా అంతఃపురంలో తల్లిదండ్రుల దగ్గర ఉండక సుందరసేనుని కావాలనుకుని పొరపాటు చేశానే! దిక్కులేని దానన యిపోయాను. భగవంతుడా! ఎందుకు నాకీ శిక్ష? నేనే పాపం చేశాను? సుందరసేనా! నిన్నే ప్రేమించి, నిన్నే కావాలనుకున్నానే! అందుకు ప్రతిఫలంగా నేనే స్థితిలో ఉన్నానో చూశావా! రావయ్యా! రా! వచ్చి రక్షించు!

–మందారవతి దుఃఖం కట్టలు తెంచుకుంది.

మతంగ మహాముని సముద్ర స్నానం చేసి ఆశ్రమానికి బయల్దేరాడు. కూతురు యమున కూడా అతన్ని అంటిపెట్టుకుని ఉంది. ఆ ఇద్దరికీ మందారవతి ఏడుపు వినరావడంతో అటుగా వడివడిగా అడుగులు వేశారు. ఏడుస్తోన్న మందారవతిని చూశారు.

''ఎవరమ్మా నువ్వు? ఎందుకేడుస్తున్నావు'' అడిగాడు మతంగ మహాముని.

''ఈ తీరానికి...ఈ అడవిలోకి ఎలా రాగలిగావు తల్లీ'' మళ్ళీ ప్రశ్నించాడు. సమాధానం చెప్పలేక తల వంచుకుంది మందారవతి.

''చెప్పమ్మా! సిగ్గుపడకు'' అనునయించాడు ముని. చెప్పక తప్పలేదు మందారవతికి. జరిగిందంతా చెప్పుకొచ్చిందామె. విన్న మౌని కళ్ళు మూసుకున్నాడు. కాస్సేపు ధ్యానించి ఇలా చెప్పాడు.

''దిగులు పడకు మందారవతి. దిగులు పడకు! ధైర్యంగా ఉండు! త్వరలోనే నువ్వు నీ ప్రియుడు సుందరసేనుని కలుసుకుంటావు''

''నిజమా మునివరా'' ఆశ తొడిగింది మందారవతిలో.

''నిజమమ్మా! అంతవరకు నువ్వు నా ఆశ్రమంలో ఉందువుగాని. రామ్మా! దగ్గరలోనే మా ఆశ్రమం'' అన్నాడు ముని.

''ఈమె నా కూతురు యమున'' మందారవతికి కూతుర్ని పరిచయం చేశాడు.

''యమున లాగే నువ్వు నాకు ఇంకో కూతురివి'' అని నవ్వాడు. మందారవతిని తోడుకుని బయల్దేరాడు.

''ఎవరీమె'' మునితో పాటుగా వచ్చిన మందారవతిని ఉద్దేశించి ఆశ్రమవాసులు అడిగారు.

''అన్నీ తర్వాత చెబుతాను. ముందు అమ్మాయిని విశ్రాంతి తీసుకోనివ్వండి'' చెప్పాడు ముని.

కొద్దిరోజులు గడిచాయి. మందారవతి ఆశ్రమవాసిగా అందరి మన్నలను అందుకోసాగింది. క్షేమంగా ఉంటోంది. గౌరీదేవి వ్రతాన్ని చేపట్టింది.

పెళ్ళిరోజు కోసం ఎదురుచూడసాగాడు సుందరసేనుడు. ఎప్పుడు పెళ్ళవుతుందా? ఎప్పుడెప్పుడు

మందారవతిని బిగి కౌగిట బంధిద్దామా అన్న ఆత్రంలో ఉన్నాడతను. రోజులు లెక్కిస్తున్నాడు. ఒంటరితనాన్ని, ఏకాంతాన్ని కోరుకుంటోన్న సుందర సేనుణ్ణి స్నేహితులు కలవలేకపోతున్నారు. మందార వతి లోకంలో ఉంటూ మిత్రులను పట్టించుకోవడం మానేశాడతను.

పెళ్ళిరోజు దగ్గరపడింది. హంసద్వీపానికి ప్రయా ణమయ్యారంతా. గజ తురంగమ దళాలతో బయల్దే రారు. ముందుగా శశాంకపురానికి చేరుకున్నారు. అక్కణ్ణుంచి సముద్ర ప్రయాణం చేయాల్సి ఉంది. శశాంకపురం సరిహద్దుల్లో సుందరసేనుడు ఉంటుం డగానే ఆ ఊరి రాజు మహేంద్రాదిత్యుడు ఎదు రొచ్చి సేనుని ఆహ్వానించాడు. విలువ కట్ట లేని కానుక లు అందజేసి తోడుకుని పోయాడు. సుందరసేనుడు ఏను గును ఎక్కి వస్తోంటే నగర వీధు ల్లోని స్త్రీలంతా అతని అందాన్ని వేనోళ్ళ పొగిడారు. తనూ పెళ్ళికి తరలి వస్తానంటే ఆ రాత్రి ఆదిత్యుని ఇంట విశ్రాంతి తీసుకోక తప్పలేదు సేనునికి. నిద్ర పట్టడం లేదు. పదే పదే మందారవతే గుర్తొస్తోందతనికి. దేవుడు కరుణిస్తే సముద్రాన్ని త్వర త్వరగా దాటే యాలి. ప్రియురాలిని అందుకోవాలి.

ఆమె అధరామృతం జుర్రుకో

వాలన ుకుంటూ

తె ల్లా ర క్లా

గ డి

పొడు. సూర్యోదయం కాగానే మహేంద్రాదిత్యుని వెంటబెట్టుకుని ఓడెక్కాడు. బయల్దేరింది ఓడ. ఆహార పదార్థాలు, మంత్రులు కూడ వారితోనే



ఉన్నారు. మరొక ఓడలో పరివారం అంతా ఉంది. రెండు ఓడలూ నైరుతి దిక్కుగా ప్రయాణించసాగాయి. రెండు మూడు రోజులు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. తర్వాత ప్రారంభమయింది పెను గాలి. ఆ గాలికి తీరాన ఉన్న అడవులు ఊగిపోసాగాయి. సముద్రమయితే అల్లకల్లోలం అయింది. నావికులు ఎంత ప్రయత్నించినా నావలను స్థిరంగా నిలుపలేకపోయారు. దాంతో వారంతా సముద్రుణ్ణి శాంతించమని వజ్ర వైడూర్యాలను దోసిళ్ళతో పోసి నమస్కరించారు. అయినా ఫలితం లేకపోయింది. తెరచాపలు దించారు. పెద్ద పెద్ద రాళ్ళను గొలుసులకు కట్టి వాటిని నీటిలోకి దించారు. ఓడలు కదలకుండా ఉండేందుకు ప్రయత్నించారు. అయినా ఓడలు నిలువలేదు. నీటి మీద తేలుతోన్న రెండు ఏనుగుల్లా ఓడలు రెండూ ఊగిపోసాగాయి. కూర్చున్న చోటు నుంచి సుందరసేనుడు తూలి పడ్డాడు. ''యువరాజా! యువరాజా'' అంటూ అతన్ని లేవనెత్తేందుకు ముందుకు వచ్చిన మంత్రులను వారించి లేచి నిల్చున్నాడు సుందరసేనుడు.

తర్వాత బాధగా అందరినీ చూసి ఇలా అన్నాడు.

''నా దురదృష్టం మిమ్మల్ని కూడా చుట్టుకున్నట్టుంది. క్షమించండి''

''నేను లేకపోతే మీరయినా ప్రాణాలతో ఉంటారేమో! ఉండడమే నాక్కావాలి. మీరంతా క్షేమంగా ఉండడమే రాజుగా నేను కోరుకునేది'' అంటూ సముద్రంలోకి దూకేశాడు.

''యువరాజా'' అంటూ మహేంద్రాదిత్యుడు, అతనితో పాటు మంత్రులు కూడా సముద్రంలోకి దూకేశారు. సుందరసేనుని పట్టుకునేందుకు వారెంతగానో ప్రయత్నించారు. వీలుకాలేదు. ఎవరికి వారు అలలకు దూర దూరంగా కొట్టుకుపోయారు.

కాస్సేపటికి గాలి నిలిచిపోయింది. సముద్రంలో అల్లకల్లోలం తగ్గింది. సుందరసేనుని ఎట్టకేలకు మంత్రి దృఢబుద్ధి కలుసుకోగలిగాడు. ఇద్దరూ ఈదుతూ ఎటు వెళితే తీరం దగ్గరన్నది ఆలోచించసాగారు. అంతలో అదృష్టం కలిసొచ్చింది. వారు ఊహించని విధంగా పడవ ఒకటి కొట్టుకుంటూ వచ్చి, వారి చెంత చేరింది. పడవను అందుకున్నారు వారు. లోనికి చేరారు. నడుపుకుంటూ గట్టున పడ్డారిద్దరూ. కాస్సేపు సేదదీరారు. తర్వాత కన్నీళ్ళు పెట్టుకున్నాడు సుందరసేనుడు.

''ఇలా బతికినందుకు ఆనందించాలో బాధపడాలో తెలియడం లేదు. పాపం మహేంద్రాదిత్యుడు ఏమయిపోయాడో? మిగిలిన మంత్రి వర్గం ఏమయిపోయిందో? తలుచుకుంటుంటే కన్నీళ్ళు ఆగడం లేదు'' అన్నాడు సుందరసేనుడు.

''ఊరుకోండి ప్రభూ! ఊరుకోండి'' ఓదార్చబోయాడు దృఢబుద్ధి.

''అందర్నీ పోగొట్టుకుని ఇలా బతకడంలో అర్థం లేదనిపిస్తోంది. బాధగా ఉంది మిత్రమా'' అన్నాడు

సుందరసేనుడు. గుండెను చేత్తో నిమురుకోసాగాడు.

"నాకెందుకో మనకి మంచే జరుగుతుందనిపిస్తోంది. మనలాగే మన మిత్రులంతా గట్టుకు చేరుకుంటారనిపిస్తోంది. దేవుడు దయామయుడు" అన్నాడు దృఢబుద్ధి.

"నువ్వన్నట్టుగా జరిగితే ఆ ఆనందమే వేరు" అన్నాడు సుందరసేనుడు. కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

ఆ సమయంలో అక్కడికి ఇద్దరు తాపసులు వచ్చారు. స్నానానికి వచ్చారా తీరానికి. దుఃఖిస్తోన్న సుందరసేనుణ్ణి, ఓదారుస్తున్న దృఢబుద్ధిని గమనించారు.

"ఏమయింది నాయనా" అడిగారు. జరిగిందంతా చెప్పాడు దృఢబుద్ధి.

"గత జన్మలో చేసిన పాపపుణ్యాలే ఈ జన్మలో సుఖ దుఃఖాలు నాయనా! వాటిని తప్పించుకోవడం మహా మహా ఋషులకు కూడా అసాధ్యం. దుఃఖాన్ని పోగొట్టుకోవాలంటే దైవప్రార్థన చెయ్యాలి. లేదంటే మంచి పనులు చెయ్యాలి. దుఃఖం మీద ప్రతీకారం తీర్చుకోవాలంటే ఏదయినా మంచి పని చెయ్యాలి. అంతేకాని దుఃఖిస్తూ కూర్చోకూడదు" అన్నారు.

"బాధపడుతూ కూర్చోడం పెద్ద అనారోగ్యం. దాని వలన లేనిపోని జబ్బులొస్తాయి. శరీరం కృశించి పోతుంది. శరీరం నాశనమయితే ఎందుకూ పనికిరాకుండాపోతాం. మంచి పనులు చేసేందుకు ఆరోగ్యం కావాలి. ఆరోగ్యం కావాలంటే ఇలా బాధపడుతూ కూర్చో కూడదు" అన్నారు మళ్ళీ.

"ప్రేమాభిమానాలు తప్ప నీకేం తెలీదు యువరాజా! నీ అమాయకత్వమే నీకు మంచి చేస్తుంది. త్వరలోనే నీకు శుభం చేకూరుతుంది. అందాకా మీరు మా ఆశ్రమంలో ఉండండి. కాలక్రమంలో అన్నీ ఆలోచించుకోవచ్చు" అన్నారు. మంత్రితో పాటుగా సుందరసేనుని తోడుకుని వెళ్ళారు.

మంత్రులు విక్రమశక్తి, భీమభుజుడు సముద్రాన్ని ఈది ఈది ఎలాగయితేనేం గట్టుకు చేరుకున్నారు. వారు చేరిన గట్టు సుందరసేనుడు చేరిందే! తమలాగే సుందరసేనుడు గట్టుకు చేరి ఉంటాడని ఆశిస్తూ అతని కోసం వారు అక్కడి అడవి దారి పట్టారు.

చండప్రభుడు, వ్యాఘ్రపరాక్రముడు, మహేంద్రాదిత్య మహారాజు కూడా ఓ గట్టుకు చేరుకుని, సుందరసేనుని కోసం వెదికి వెదికి అతను కనిపించకపోవడంతో పెను దుఃఖంతో శశాంకపురానికి చేరుకున్నారు. అక్కణ్ణుంచి తర్వాత అలకాపురానికి చేరుకున్నారు. జరిగింది అంతా మహాసేనునికి వివరించారు. సుందరసేనుడు సముద్రంలో దూకేశాడని తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రాణత్యాగానికి ప్రయత్నించారు. ప్రజలు వారించడంతో ఆ ప్రయత్నాన్ని విరమించారు. అయితే రాజ్యపాలన మీద మనసులేని మహాసేనుడు, ఊరిబయట ఉన్న శివాలయంలో తపస్సు చేస్తూ కూర్చున్నాడు.

ఈ వివరాలన్నీ మందారదేవునికి తెలియవచ్చాయి. హంసద్వీపం ప్రజలు కూడా తెలుసుకున్నారు. అంతా భోరు భోరున విలపించారు. సుందరసేనుడు, మందారవతి ఇద్దరూ కనిపించడం లేదని తెలియడంతో మందారదేవుడు కూడా మహాసేనుడిలాగానే ప్రాణత్యాగానికి పూనుకున్నాడు. మంత్రులు వారిస్తే వూరుకున్నాడు. అయినా రాజ్యపాలన చేయలేనని చెప్పి, పాలనా వ్యవహారాలన్నీ మంత్రివర్గానికి అప్పజెప్పి, భార్యతో పాటుగా అలకాపురానికి చేరుకున్నాడతను. అక్కడ మితాహారాన్ని స్వీకరిస్తూ దర్భల మీద పడుకుంటూ తపస్సు చేయసాగాడు. ఇదిలా ఉండగా...

దృఢబుద్ధితో కలసి సుందరసేనుడు ఒకనాడు మతంగముని ఆశ్రమం దగ్గరగా వచ్చాడు. అక్కడ సరస్సులో స్నానం చేశాడు. ఒడ్డునున్న పళ్ళ చెట్లను వంచి నానారకాల పళ్ళను కోశాడు. తిన్నాడు. బాగున్నాయని మెచ్చుకున్నాడు. మరిన్ని పళ్ళను కోసి తిరుగుప్రయాణం అయ్యాడు. ఆ ప్రయాణంలో అతనికి ఓ శివాలయం కనిపించింది. నిలచి దేవునికి నమస్కరించుకుంటుంటే నవ్వులు వినవచ్చాయి. అప్పుడు అటుగా చూశాడు సుందరసేనుడు.

మునికన్యలు కొందరు ఆలయం ఉద్యానవనంలో పువ్వులు కోసుకుంటూ కనిపించారు. వారిలో మహా సౌందర్యవతి మందారవతిని చూసి ఆమెను మందారవతి కాదనుకున్నాడు సుందరసేనుడు. ఎవరో వనదేవత అయి ఉంటుంది. లేకపోతే అప్సరసాంగన అయి ఉంటుంది. అయితే మందారవతి పోలికలున్నాయి. మందారవతి అయితే బాగుణ్ణనుకున్నాడు. అనుకుని అంతలోనే ఆ ఊహ తప్పనుకున్నాడు. ఎక్కడ హంసద్వీపం? ఎక్కడీ అడవి. ఇక్కడ మందారవతి ఎందుకుంటుంది? అనుకున్నాడు.

ఆ మాటే అన్నాడు మిత్రుడు దృఢబుద్ధితో.

"ప్రభూ! ఆ సౌందర్యవతిని చూస్తోంటే నాకెందుకో మునికన్య అనిపించడం లేదు. ఆ రూపు, ఆ చూపు చూస్తోంటే ఋషికన్య కాదుగాక కాదనిపిస్తోంది" అన్నాడు దృఢబుద్ధి.

"అయితే రాచకన్య అంటావా? మందారవతి కాదుగదా" ఆశగా అడిగాడు సుందరసేనుడు.

"ఎవరన్నదీ కాస్సేపు ఇక్కడే ఉంటే తేలిపోతుంది. తెలుసుకునే వెళ్దాం" అన్నాడు దృఢబుద్ధి. యువరాజును చెట్ల చాటుకు తీసుకుని వెళ్ళాడు.

మునికన్యలు పువ్వులు కోయడం ఆపి స్నానాలు చేసేందుకు దగ్గరలో ఉన్న సరస్సులోనికి దిగారు. మందారవతి కూడా స్నానం చేసేందుకు సరస్సులో దిగింది. అంతా ఆడుతూ పాడుతూ ఈదుతుండగా మందారవతిని మొసలి పట్టుకుంది. బాధతో గోల చేయసాగింది మందారవతి. చెలులు అది చూసి కంగారు పడుతూ ఇలా అరవసాగారు.

"వనదేవతలారా! రండి! కాపాడండి! మా మందారవతిని మొసలి పట్టుకుంది"

ఆ మాటలు విన్న సుందరసేనుని ఆనందానికి అంతులేకుండాపోయింది. అభినందనగా దృఢబుద్ధి వెన్ను మీద చరిచి వెంటనే చాటు నుండి తప్పుకున్నాడు. సరుస్సులోకి దూకాడు. మొలలో ఉన్న చురకత్తితో మొసలిని అక్కడా ఇక్కడని కాక ఎక్కడ పడితే అక్కడ పొడిచి దాన్ని చంపాడు. స్పృహ తప్పిన మందారవతిని ఎత్తుకుని గట్టుకు చేర్చాడు. సపర్యలు చేయడంతో ఆమెకు మెలకువ వచ్చింది. ఎదురుగా ఉన్న సుందరసేనుని చూసి ఆనందించింది. అంతలోనే అతను సుందరసేనుడు అయ్యేందుకు అవకాశం లేదనుకుంది. ఎక్కడ అలకాపురం! ఎక్కడ ఈ అడవి! ఈ అడవికి సుందరసేనుడు ఎందుకు వస్తాడు? రాడుగాకరాడనుకుందామె. చేసుకున్న పుణ్యఫలం. మొసలి నుంచి రక్షించాడు. అందుకు కృతజ్ఞతలు చెప్పి తప్పుకోవాలి. పర పురుషుని ఎదుట ఉండరాదనుకుంది.

"మీరు చేసిన సహాయానికి కృతజ్ఞతలు! వెళ్ళొస్తానండి" అంది మందారవతి. అక్కణ్ణుంచి మెల్ల మెల్లగా అడుగులు వేసి చెలులతో బయల్దేరింది. తన హృదయం దూరమవుతున్నట్టుగా అల్లల్లాడిపోయాడు సుందరసేనుడు. మందారవతి తనకు దూరమవుతోంటే ప్రాణం పోతున్నట్టుగా ఉందతనికి.

(సశేషం)

పిడికిలి - ప్రాప్తం!

మిల్కీ గర్ల్ హన్సిక కర్మ సిద్ధాంతాన్ని కూడా కాసింత నమ్ముతుంది. ఎప్పుడూ ఇంటర్నెట్, ఛాటింగ్ అంటూ గడిపే ఈ చిన్నది ఇప్పుడు కోలీవుడ్‌లో బిజీ. 'కాల్షీటు ఖాళీగా లేదు. లేకుంటే తెలుగులో అగ్ర హీరోలతో నటించమని ఎంతమంది సంప్రదించారో' అని చెబుతున్న ఈ ముంబై సుందరిని కర్మ సిద్ధాంతాన్ని గురించి చెప్పమంటే "నాకు చిన్నప్పటి నుంచి అమ్మ ఒకటే చెప్పేది. 'ఎప్పుడూ అత్యాశకు పోకూడదు. మనకు దక్కాల్సింది మనల్ని వెతుక్కుంటూ వచ్చి చేరుతుంది. దక్కనిదైతే ఎంత ప్రయత్నించినా రాదు. పరాజయం పలకరించిందని ఎప్పుడూ నిరాశ చెందకూడదు' అని. ఇవ్వాళ్టికీ నేను వాటినే నమ్ముతున్నాను. అయినా పుట్టేటప్పుడు ప్రతి ఒక్కరూ పిడికిడి బిగించి ఉంటారట. మన తలరాతను ఆ పిడికిట్లో ఉంచుతాడట భగవంతుడు. నేను నటిని కావాలని రాసిపెట్టాడేమో" అని వివరించింది హన్సి.

కథా సరిత్సాగరం

మొసలి పట్టు నుంచి తనని రక్షించిన సుందరసేనుని చూసి ఎంతగానో ఆనందించింది మందారవతి. అంతలోనే అతను సుందరసేనుడు కాదనుకుంది. అందుకు కారణం తానిప్పుడున్న ప్రదేశమే అనుకుంది. ఎక్కడ సుందరసేనుడుండే అలకాపురం? ఎక్కడీ అడవి అనుకుంది. అలాగే అనుకున్నాడు సుందరసేనుడు కూడ. మందారవతి ఉండే హంసద్వీపం ఎక్కడ? ఈ అడవి ఎక్కడ అనుకున్నాడు. పేరు ఒకటి అయినంత మాత్రాన మునికన్య హంసద్వీపం రాకుమార్తె కాదుగాక కాదు అనుకున్నాడు. ''వస్తాను'' అని తనని వీడి వెళ్ళిపోతున్న మందారవతిని బాధగా చూస్తూ నిలుచున్నాడు. ఓదార్పుగా అతని భుజమ్మీద చేయి వేశాడు దృఢబుద్ధి. తర్వాత చేతిని తొలగించి గబగబా నాలుగు అడుగులు వేశాడు. మందారవతి చెలిని చేరబిలిచాడు.

సుందరసేనుని కథ

3

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

''ఏం కావాలి'' అడిగిందామె.

''మీ మందారవతి అమ్మగారు ఎవరమ్మాయి'' అడిగాడు దృఢబుద్ధి.

''ఎవరమ్మాయి అంటే...హంసద్వీప మహారాజుగారి కూతురు. ఎందుకు'' ఎదురు ప్రశ్నించింది.

''ఎందుకంటే...అంత మహారాజుగారి కూతురు ఇక్కడెందుకున్నదీ తెలుసుకోవడానికి'' అన్నాడు దృఢబుద్ధి. ఆసరికి వారి దగ్గరకు చేరుకున్నాడు సుందరసేనుడు.

''అదంతా ఓ పెద్ద కథ'' అంది చెలి. చెప్పసాగింది. ప్రేమించిన సుందరసేనుని కలిసేందుకు మందారవతి ఓడనెక్కడం, తుపానులో చిక్కుకోవడం, తీరానికి కొట్టుకురావడం, మతంగముని రక్షించి ఆశ్రయం కల్పించడం...అన్నీ వివరంగా చెప్పింది.

''అయ్యయ్యో! స్నేహితుల్ని వదిలి ఒంటరిదాన్నయ్యానే'' అని పరుగుదీసింది అక్కణ్ణుంచి. ఆమె అటు వెళ్ళగానే సుందరసేనుడు, దృఢబుద్ధి ఆనందంగా కౌగలించుకున్నారు. చిన్నపిల్లల్లా గంతులు వేశారు.

''చూశారా రాకుమారా! కాలం కలిసొస్తే ఇలాగే ఉంటుంది. మీరు ఊహించారా, మందారవతిని కలుస్తానని. కలిశారా లేదా? త్వరలోనే మీ వివాహం కూడా జరిగితీరుతుంది'' అన్నాడు దృఢబుద్ధి.

''అంటే...ఈ రాకుమారుడు సుందరసేనుడా'' ఆశ్చర్యపోయింది చెలి. స్నేహితుల్ని కలిసేందుకు పరుగుదీసిన చెలి, నవ్వులు వినిపించడంతో ఆగి వెనక్కి తిరిగి చూసింది. చిన్న పిల్లల్లా సుందరసేనుడు-దృఢబుద్ధి గంతులు వేయడాన్ని చూసి విషయం కనుక్కుందామని వారి దగ్గరకు వచ్చింది.

''నిజం చెప్పండి, మీరు సుందరసేనులేనా'' రెట్టించిందామె.

''అవును'' అన్నాడు సుందరసేనుడు.

''అయితే ఈ నిజం మా మందారవతి అమ్మగారికి వెంటనే చెప్పాలి'' అంటూ తుర్రున మళ్ళీ పరుగుదీసింది. అల్లంత దూరాన ఉన్న మందారవతిని ఆయాసపడుతూ చేరింది.

''రాకుమారి! రాకుమారి'' అని మందారవతికి అడ్డుగా నిలిచింది.

''మీకో శుభవార్త'' అంది.

''అడుగో మీ సుందరసేనుడు'' అని దూరాన ఉన్న సుందరసేనుని చూపించింది.

''నిజమా'' ఉబ్బితబ్బిబ్బు అయ్యింది మందారవతి.

''నిజం రాకుమారి'' అంది చెలి. అంతే! పరుగు

పరుగున వచ్చి సుందరసేనుని పాదాల మీద వాలి పోయింది మందారవతి. ఆమెను లేవనెత్తి గుచ్చి కౌగిలించుకున్నాడు సుందరసేనుడు. ఇద్దరూ ఆనందబాష్పాల్లో మునిగి తేలారు. వారిని చూసి మునికన్యలు మురిసిపోయారు. సుందరసేనుని, దృఢబుద్ధిని ఆశ్రమానికి తోడుకుని వచ్చారు. మతంగమునికి జరిగిందంతా చెప్పారు.

''చెప్పాను కదమ్మా, త్వరలోనే నువ్వు నీ ప్రియుణ్ణి కలుసుకుంటావని. జరిగిందా లేదా'' నవ్వుతూ అడిగాడు ముని. సిగ్గుపడుతూ జరిగిందన్నట్టుగా తలూపింది మందారవతి. సుందరసేనునితో కలిసి మునికి నమస్కరించింది.

మర్నాడు సుందరసేనునితో ఇలా అన్నాడు మతంగముని.

''నాయనా! నేను ఒక పని మీద శ్వేత ద్వీపానికి ప్రయాణమవుతున్నాను. నువ్వు కూడ మందారవతితో అలకాపురానికి ప్రయాణమవడం మంచిది. మందారవతిని కూతురులా చూసుకున్నాను. నాకు నా కూతురు యమున ఒకటి, మందారవతి ఒకటి కాదు. ఇద్దర్నీ నా కూతుళ్ళనే భావించాను. ఇప్పుడు మందారవతిని నీ చేతుల్లో పెడుతున్నాను. తీసుకుని వెళ్ళు. పెళ్ళి చేసుకుని కలకాలం వర్ధిల్లండి. ఈ భూమండలాన్ని సుభిక్షంగా పాలించు. నీ మంత్రులందర్నీ నువ్వు త్వరలోనే కలుసుకుంటావు''

''కృతజ్ఞుణ్ణి'' అన్నాడు సుందరసేనుడు.

''వెళ్ళొస్తానమ్మా'' అని మందారవతికి చెప్పి, కూతురు యమునతో పాటుగా ఆకాశమార్గాన ప్రయాణించాడు మతంగముని. చూస్తుండగానే కనుమరుగయ్యాడు.

మందారవతి, దృఢబుద్ధితో కలసి సుందరసేనుడు సముద్రతీరానికి చేరుకున్నాడు. ఓడ కోసం వేచి చూడసాగాడు. రెండు మూడు ఓడలు వచ్చాయి. పిలుస్తున్నా ఆగక వెళ్ళిపోయాయి. దూరంగా ఓ ఓడ కనిపించింది. కేకేశారు దాని కోసం. వచ్చింది ఓడ. అందులోని వర్తకుడు మందారవతిని చూస్తూనే కసిగా కింది పెదవిని కొరుక్కున్నాడు.

''ఈ ఓడ శశాంకపురానికి వెళ్తుందా'' అడిగాడు దృఢబుద్ధి.

''వెళ్ళదు'' అన్నాడు నావికుడు.

''ఎందుకు వెళ్ళదు? వెళ్తుంది వెళ్తుంది. ఎక్కండి'' అన్నాడు వర్తకుడు. అర్థంగాక చూస్తోన్న నావికుడికి కన్నుగీటాడు వర్తకుడు.

''ముందు అమ్మగారిని ఎక్కించండి'' అన్నాడు.

మందారవతిని ఎక్కించాడు సుందరసేనుడు. తర్వాత తను ఎక్కబోయాడు. ఎక్కబోతుంటే అతన్ని నీటిలోకి తోసి వేశాడు వర్తకుడు.

''పోనీయ్'' అన్నాడు నావికునితో. ఓడ చూస్తూండగానే తీరాన్ని వదిలేసింది. సముద్రంలోలోపలికి వెళ్ళిపోయింది. సుందరసేనుడు, దృఢబుద్ధి ఓడను అందుకునేందుకు ఎంతగానో ప్రయత్నించారు. కాని, అందుకోలేకపోయారు దాన్ని.

''స్వామి! స్వామి'' అంటూ మందారవతి గగ్గోలుగా ఏడుస్తూనే ఉంది. దూకేందుకు ప్రయత్నించింది. అడ్డుకున్నాడు వర్తకుడు. ఓడ కన్పించి కన్పించి ఆఖరుకి కనిపించకుండా పోయింది.



గగ్గోలుగా ఏడవసాగాడు సుందరసేనుడు. దృఢబుద్ధి ఎంత ఓదార్చినా ఫలితం లేకపోయింది.

''నా మాట వినండి మహారాజా! దుఃఖించడం వీరుల లక్షణం కాదు'' అన్నాడు దృఢబుద్ధి.

''కష్టకాలంలోనే ధైర్యంగా ఉండాలి'' అన్నాడు.

''రండి! ఈ తీరం వెంట నడుచుకుంటూ వెళ్దాం. రాకుమారి దొరక్కుండా పోదు'' అన్నాడు. సుందరసేనుని పట్టుకుని నడిపించసాగాడు. 'మందారవతి–మందారవతి' అంటూ ప్రియురాలి పేరునే పలవరిస్తూ కలవరించసాగాడు సుందరసేనుడు. అన్నపానాలు మానేశాడు. తీరాన నడుస్తూ వారు ఓ వనంలోకి ప్రవేశించారు. అక్కడి పువ్వుల తీగని చూసి పిచ్చివాడిలా ఇలా అన్నాడు సుందరసేనుడు.

''చూడు దృఢబుద్ధీ! చూడు! మందారవతి నా కోసం పువ్వులు పెట్టుకుని ఎదురు చూస్తోంది. దుర్మార్గుడు ఆ వర్తకుని నుంచి తప్పించుకుంది''

ఏం మాట్లాడాలో తెలియలేదు దృఢబుద్ధికి. తుమ్మెదలు ముసురుకున్న కొలనులోని తామరలను చూశాడు ఇంకొక చోట. చూసి ఇలా అన్నాడు.

''అదిగో మందారవతి! పాపం భయపడి నీటిలో దాగి ఉంది. నా కోసమే ముఖం ఎత్తి చూస్తోంది.

సుందరసేనుని బాధకు కళ్ళు చెమర్చాయి దృఢబుద్ధికి. కోకిల కూతలు వినవచ్చాయి.

''దృఢబుద్ధీ వింటున్నావా! మందారవతి

నన్ను పిలుస్తోంది'' అన్నాడు సుందరసేనుడు. బాధగా అతన్ని చూడసాగాడు దృఢబుద్ధి. అడవిలోకి చేరారిద్దరూ. అక్కడ ఎక్కడ పడితే అక్కడ సింహాలు, పులుల్ని చూశారు. పుళిందుల్ని చూశారు. చావు తప్పదనుకున్నారు. జీవహింసకు పెట్టింది పేరు పుళిందులు. వారికి వారి భాష తప్ప మరో భాష తెలియదు. అడవిలోనే ఉంటారెప్పుడూ. వారి రాజు వింధ్యకేతువు. అతని ఆజ్ఞ మేరకు పుళిందులు మనుషుల కోసం వెతుకుతున్నారు. చండికాదేవికి బలిచ్చేందుకు మనుషులు కావాలి వారికి. ఆ సమయానికే అడవిలోకి చేరారు సుందరసేనుడు-దృఢబుద్ధి. దొరికారు పుళిందులికి. వారి మీద ఆయుధాలతో దాడి చేశారు. దాడిని ఎదుర్కొంటూ ఆలోచించసాగాడు సుందరసేనుడు. దైవానుగ్రహం లేకపోవడం కాకపోతే ఏమిటిదంతా? దేశం కాని దేశానికి రావడం ఏమిటి? అందినట్టే అంది, అంతలోనే మందారవతి అందకుండాపోవడం ఏమిటి? ఆ వర్తకుడెవడో ఆమెను అపహరించడం ఏమిటి? అన్నపానాలు మానుకోవడం, అలసట...పైగా ఇప్పుడీ పుళిందులతో యుద్ధం... తానేమవుతున్నదీ తనకే అర్థం కాని పరిస్థితిలో దుఃఖిస్తూనే చురకత్తితో పుళిందుల్ని ఎదుర్కొన్నాడు. అనేక మందిని నేల కూల్చాడు. దృఢబుద్ధి కూడా తెగించి పోరాడు. వీళ్ళేమో ఇద్దరు. వాళ్ళేమో ఇంకా పాతికమంది పైగా ఉండడంతో మరి పోరాడలేక బందీలయిపోయారు. సుందరసేనుని-దృఢబుద్ధిని తాళ్ళతో బంధించి తెచ్చి చెరసాలలో పడేశారు పుళిందులు.

చీకటి చీకటిగా ఉందా చెరసాల. తడితడిగా ఉంది. పేరు తెలియని పురుగులు పాకుతున్నాయి. పెద్ద పెద్ద సాలెగూళ్ళు వేలాడుతున్నాయి. గోడల నిండా రంధ్రాలున్నాయి. వాటిలోంచి పాము కుబుసాలు కదలాడుతున్నాయి. నేలంతా బంక బంకగా ఉంది. గట్టిగా కాలు వేయకపోతే జారిపడతారెవరయినా. కళ్ళు పెద్దవి చేసుకుని తీక్షణంగా చూస్తే...తమలాగే ఎవరెవరో ఉన్నారక్కడ. తేరిపారచూస్తే వారంతా తన మంత్రులని తెలుసుకున్నాడు సుందరసేనుడు. వారు కూడ సుందరసేనుని గమనించి ఆనందంగా అతన్ని చేరుకున్నారు.

"యువరాజా'' అంటూ అతని పాదాల మీద మోకరిల్లారు. వారందరినీ పేరు పేరునా పలకరించి దగ్గరకు తీసుకున్నాడు సుందరసేనుడు. జరుగుతున్న సంఘటనలకు అంతా కన్నీళ్ళు పెట్టుకున్నారు.

"ఏడ్చి ప్రయోజనం ఏముంది? చేసుకున్న పాపాన్ని అనుభవించక తప్పదు'' అన్నారెవరో. ఆ అన్నది ఎవరన్నది ఆ చీకట్లో కనిపించలేదు.

"ఎవరది'' అడిగాడు సుందరసేనుడు.

"మీలాగే నేనో బందీని'' అన్నాడతను.

"మనందరికీ ఏకకాలంలో చావు రాసి పెట్టి ఉంది. రానున్న పున్నమి రాత్రి చండికాదేవికి మనల్నందర్నీ బలిస్తున్నారు. అందుకే పుళిందులు మనందర్నీ ఓ చోట ఉంచారు'' అన్నాడతను మళ్ళీ.

"జరిగిన దానికి జరగనున్న దానికి చింతించి ప్రయోజనం లేదు. దైవప్రార్థనే దీనికి దిక్కు. దేవుడు కరుణామయుడు. తలచుకుంటే మనకి మంచిరోజులు రాకపోవు'' అన్నాడు.

"దుఃఖానికీ బాధకి పేదా గొప్ప భేదం లేదు! రాజుల్నీ సేవకుల్నీ ఇద్దర్నీ అవి ఒకేలా చూస్తాయి'' అంటూ ఓదార్చాడు.

పున్నమి వచ్చిందింతలో. బందీలందర్నీ పుళిందులు అమ్మవారి సన్నిధికి తరలించారు. మంటలు ఎగిసిపడుతున్నాయక్కడ. గంటలు మోగుతున్నాయి. భక్తులు నాట్యాలు చేస్తున్నారు. నాలిక చాపుకుని అమ్మవారు భయంకరంగా ఉంది. బలి కోరుతున్నట్టుగా కోరలు చాచి ఉంది. సుందరసేనుడు అమ్మవారికి చేతులు జోడించాడు. ప్రార్థించాడిలా.

"శత్రువుల్ని చీల్చి చెండాడే తల్లీ, నమ్ముకున్న వారి కష్టాలు తీర్చే తల్లీ మమ్మల్ని కనికరించు! వెన్నెల్లాంటి చల్లని నీ చూపులు మాపై ప్రసరింపజేసి, మమ్మల్ని చల్లగా చూడు''

వింధ్యకేతువు వచ్చాడక్కడికి. అతన్ని గుర్తించాడు సుందరసేనుడు. ఆశ్చర్యపోయాడు.

"ఈ బోయరాజు మా తండ్రిగారి సేవకుడు. ఇతనికి ఈ అడవిని ఇచ్చింది మా తండ్రే! స్వేచ్ఛగా బతకమని కానుకగా ఇచ్చాడు దీన్ని'' అన్నాడు మంత్రులతో సుందరసేనుడు.

"మరి ఆ విషయం బోయరాజుకి చెప్పండి యువరాజా! చావు నుండి మమ్మల్ని తప్పించండి'' వేడుకున్నారు మంత్రులు.

"తండ్రి పేరు చెప్పుకుని చావుని తప్పించుకోవడం కన్నా చనిపోవడమే సుఖం. నేను నేనుగానే బతుకుతాను. అలాగే మీరు కూడా మీరుగా బతకండి'' అన్నాడు సుందరసేనుడు.

"ఎక్కడ? ఎక్కడా యువకుడు. చురకత్తితో నా వాళ్ళను నేల కూల్చిన ఆ దుర్మార్గుడెక్కడ'' వింధ్యకేతువు గట్టిగా అరిచాడు.

"ఇదిగో ఇక్కడ'' అని సుందరసేనుని చూపించారతనికి. నెత్తురు కారి కారి చారికలు కట్టిన శరీరం, దుమ్ము కొట్టుకుపోయిన ముఖం, గాయాలయి ఉబ్బిపోయిన బుగ్గలు తరచి తరచి చూసి, ఎక్కడో అతన్ని చూసినట్టుగా అనిపించి ఇలా అడిగాడు వింధ్యకేతువు.

"ఎవర్నువ్వు? ఇక్కడికి ఎక్కణ్నుంచి వచ్చావు''

"నేనెవరయితే నీకెందుకు? నీ పని నువ్వు చూసుకో'' అన్నాడు సుందరసేనుడు. ఆ గొంతును గుర్తుపట్టాడు వింధ్యకేతువు.

"యువరాజా'' అని అతని కాళ్ళ మీద పడ్డాడు.

"పాపం! మహా పాపానికి పూనుకున్నాను. మహాసేన మహారాజా! మీకు తీరని ద్రోహం చేశాను. నన్ను అభిమానించి అడవిని కానుక చేసిన మీకే పుత్రశోకం కలిగించేందుకు ప్రయత్నించాను. నన్ను క్షమించండి'' అంటూ శూన్యంలోకి చూసి దణ్ణాలు పెట్టాడు. తర్వాత సుందరసేనుని గట్టిగా కౌగిలించుకున్నాడు.

(సశేషం)

నేనలాగే ఇష్టపడతాను

పొడవాటి జడ వేసుకుని, పద్ధతిగా చీరకట్టుకుని కనిపించడం సినిమాలవరకైతే ఓకేగానీ నిజ జీవితంలో నావల్ల కాదు అని తెగేసి చెప్తోంది కమలినీ ముఖర్జీ. 'ఆనంద్', 'గోదావరి' నుంచి ఇటీవల విడుదలైన 'గోపి గోపిక గోదావరి' వరకు అసలు సిసలైన చీరకట్టులో అందంగా కనిపించిన కమలినీ ఇలా ఎందుకు అంటోందో అడిగితే "నేను ఈ తరం అమ్మాయిని. మోడ్రన్‌గా ఉండటానికి ఇష్టపడతాను. వెస్ట్రన్ కాస్ట్యూమ్స్ అంటే నాకు చాలా ఇష్టం. అదేపనిగా చూస్తే ఎందులోనైనా చెడు కనిపిస్తుంది. నాకు చీరకన్నా మోడ్రన్ డ్రస్సులే సౌకర్యవంతంగా ఉంటాయి. అందుకే పార్టీలకు, ఫంక్షన్లకు కూడా వీలైనంతవరకు నాకు నచ్చినట్టుగానే వస్తాను. మరీ తప్పదనుకున్నప్పుడు మాత్రమే చీరల జోలికి వెళ్తుంటాను'' అని చెప్పింది కమలినీ.

కథా సరిత్సాగరం

మంత్రులతో పాటుగా సుందరసేనుని బలి ఇచ్చేందుకు పున్నమి రోజున అమ్మవారి ముందు నిలబెట్టేరు పుళిందులు. వారి నాయకుడు వింధ్యకేతువు అక్కడికి వచ్చాడు. సుందరసేనుని చూశాడు. చూస్తూనే 'యువరాజా' అంటూ అతని కాళ్ళ మీద పడ్డాడు. తొలినాళ్ళలో వింధ్యకేతువు, సుందరసేనుని తండ్రి మహాసేనుని వద్ద సేవకుడిగా పని చేశాడు. అది గుర్తు చేసుకున్నాడతను.

''క్షమించండి యువరాజా! మీరెవరో తెలియక మావాళ్ళు ఇందుకు పూనుకున్నారు'' అన్నాడు. దుఃఖించసాగాడు. అతన్నిలా ఓదార్చారు మంత్రులు.

''వింధ్యకేతూ! ఇది దుఃఖించాల్సిన సమయం కాదు, ఆనందించాల్సిన సమయం. ఏ ఘోరం జరగకుండానే ఒకర్నొకరు తెలుసుకున్నారు. అందుకు సంతోషించాలి''



సుందరసేనుని కథ

4

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు 'అనీలజ' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

''అవునవును'' అన్నాడు వింధ్యకేతువు. ఆలయంలో బందీలుగా ఉన్న అందర్నీ విడిపించాడు. సుందరసేనుని తన నివాసానికి ఆహ్వానించాడు. అక్కడ యువరాజు గాయాలకు మందు రాశాడు. అతనికి విందు వినోదాలు ఏర్పాటు చేశాడు. అన్ని రకాలుగా అతన్ని ఆనందింప చేసి జరిగిందంతా తెలుసుకున్నాడు.

''మనిద్దర్నీ ఏ దైవం అయితే కలిపిందో అదే దైవం మిమ్మల్ని, రాకుమారి మందారవతిని కలుపుతుంది. అనుమానం లేదు'' అని ధైర్యాన్నిచ్చాడు వింధ్యకేతువు.

''అంత అదృష్టమా'' అన్నాడు సుందరసేనుడు. అంతలో సేనాపతి వచ్చాక్కడికి. వింధ్యకేతువుతో ఇలా అన్నాడు.

''ప్రభూ! ఎవడో వర్తకుడు సంచుల కొలదీ డబ్బుతోను, ఓ సుందరాంగితోను అడవిలో తిరుగుతోంటే దాడి చేసి అతన్ని బంధించాం. వారి సేవకుల్ని కూడా బంధించాం. ప్రవేశ పెట్టమంటారా'' అడిగాడు.

వర్తకుడు అంటే...మందారవతిని అపహరించిన వాడు కాదు కదా! సుందరాంగి మందారవతి కాదు కదా! ఎందుకయినా వారిని చూడడం మంచిదనుకున్నాడు సుందరసేనుడు.

''ప్రవేశపెట్టమని చెప్పు వింధ్యకేతు'' ఆజ్ఞాపించాడు సుందరసేనుడు.

''తప్పకుండా'' అన్నాడు.

''ప్రవేశపెట్టండి'' చెప్పాడు.

ద్వారం వైపే గుచ్చి గుచ్చి చూడసాగారు సుందరసేనుడు-దృఢబుద్ధి. ముందుగా వర్తకుడు ప్రవేశించాడు. అతన్ని చూస్తూనే అంతెత్తున లేచాడు దృఢబుద్ధి.

''వీడే...వీడే యువరాజా, మందారవతిని అపహరించిన వర్తకుడు''

ఆ వెనుకే మందారవతి ప్రవేశించింది. ఆమె చూస్తూనే దిగ్గున లేచాడు సుందరసేనుడు. పరుగున పోయి ఆమెను చేరుకున్నాడు.

''ఏమిటి దేవీ! ఏమిటీ అవతారం? ఇలా వాడిపోయావేమిటి'' దుఃఖించాడు.

''స్వామి'' అంటూ అతని గుండెల్లో వాలిపో

యింది మందారవతి. కన్నీరు మున్నీరయ్యారిద్దరూ. వాళ్ళలా దుఃఖిస్తోంటే చూసిన వాళ్ళక్కూడా కన్నీరాగలేదు. కాస్సేపటికి తేరుకున్నారిద్దరూ. వారిని పదే పదే ఓదార్చాడు వింధ్యకేతువు. తర్వాత వర్తకుణ్ణి సమీపించాడు.

"దుర్మార్గుడా! మందారవతిని అపహరించినందుకు నిన్నేం చేసినా పాపం లేదు. నిన్ను..." అని అతని మీదికి కత్తి దూసిన వింధ్యకేతువు. నమస్కరిస్తూ ఇలా వేడుకున్నాడు వర్తకుడు.

"అయ్యా తప్పు చేశాను. వినాశకాలే విపరీత బుద్ధి అని బుద్ధి గడ్డి తిని ఈ పాపానికి ఒడిగట్టాను. మందారవతిని అపహరించానేగాని ఆమెను తాకడానికి ధైర్యం చాల్లేదు. ఆమె కళ్ళల్లోకి కూడా చూడలేకపోయానంటే నమ్మండి. ఏదో అదృశ్యశక్తి ఆమెను కాపాడుతున్నట్టనిపిం

చేది. అందర్నీ అంత దూరాన నిలిపేది. మా ఊరికి తీసుకుని పోయి మంచితనంతో ఆమె మనసులో చోటు సంపాదిద్దామనుకుని ఇలా వచ్చాను. మీకు దొరికిపోయాను''

''తప్పు చేసినందుకు శిక్ష తప్పదు. వీణ్ణి ఉరి తీయండి'' ఆజ్ఞాపించాడు వింధ్యకేతువు.

''అయ్యా అయ్యా! క్షమించండయ్యా! కాపాడండయ్యా'' సుందరసేనుని కాళ్ళ మీద పడ్డాడు వర్తకుడు.

''చెప్పండమ్మా! కాపాడమని చెప్పండమ్మా'' మందారవతి ముందు మోకరిల్లాడు. జాలి పడ్డాడు సుందరసేనుడు.

''వ్యాపారికి ప్రాణం కంటే డబ్బే ముఖ్యం. ఆ డబ్బును తీసుకుని అతన్ని వదిలిపెట్టండి. ప్రాణం తీసినట్టే'' అన్నాడు.

''అవునవును'' నవ్వాడు వింధ్యకేతువు. ఒంటి మీది నగలు కూడా దోచుకుని వర్తకుణ్ణి విడిచిపెట్టారు.

రాత్రి వెన్నెల్లో మందారవతి-సుందరసేనులకు అతిథి సత్కారాలు చేశారు పుళిందులు. వారికి ముత్యాల హారాలు, వజ్రాల ఉంగరాలు కానుకగా ఇచ్చారు. ఉత్సవంగా అంతా నర్తించారు.

తెల్లారింది.

తగిలిన గాయాలు మానిపోయాయి. మందారవతి దొరికింది. ఇంకా ఇక్కడ ఉండడం ఆలస్యమే! అలకాపురానికి ప్రయాణమవడం మంచిది అనుకున్నాడు సుందరసేనుడు. ఆ మాటే వింధ్యకేతువుకి తెలియజేశాడు. తండ్రి మహాసేనునికి తాము తరలి వస్తున్నట్టుగా జాబు రాయమని చెప్పాడు. అలాగేనంటూ జాబు రాసి సేవకునికి ఇచ్చి మహాసేన మహారాజుకి ఇచ్చి రమ్మని పంపాడతన్ని. సేవకుడు అలకాపురానికి చేరే వేళకి, మహాసేనరాజు అగ్నిప్రవేశానికి సిద్ధమవుతున్నాడు. కొడుకు సుందరసేనుని క్షేమవార్త ఇంకా తెలియ రాకపోవడంతో అతను ప్రాణత్యాగానికి పూనుకున్నాడు. ఊరు ఊరంతా అక్కడే ఉంది. ఏడుస్తోంది. అదంతా గమనించాడు సేవకుడు. మహారాజును ఆదుకోవాలని మూగిన జనాన్ని నెట్టుకుంటూ ముందుకు ఉరికాడు. ప్రయాణంలో బాగా దుమ్ముకొట్టుకుని పోయి ఉన్నాడతను. నల్లగా ఉన్నాడు. ఓ చేతిలో విల్లు, మరో చేతిలో జాబు, తీగలతో చుట్టుకుని

ఉన్న తలముడి, పెద్ద పెద్ద ఆకులను మొలకు చుట్టుకుని ముందుకు చొచ్చుకుని పోతోంటే చిత్రంగా చూడసాగారతన్ని. మహారాజును సమీ పించాడతను.

''ఆగండి మహాప్రభో! ఆగండాగండి'' అన్నాడు.

''ఎవరు నువ్వు'' ఆగి ప్రశ్నించాడు రాజు.

''నేను వింధ్యకేతువు సేవకుణ్ణి. మీ కుమా రుడు సుందరసేనుడు, కాబోయే కోడలు మందా రవతి మా దగ్గర క్షేమంగా ఉన్నారు. త్వరలోనే వారంతా ఇక్కడికి ప్రయాణమయి వస్తున్నారు. మా రాజు వింధ్యకేతువు కూడ వస్తున్నారిక్కడికి. ఈ విషయం మీకు చెప్పేందుకు నన్ను ముందు పంపించారు. ఇదిగో జాబు. చదవండి'' అన్నాడు సేవకుడు.

జాబును అందుకున్నాడు రాజు. ప్రజలంతా ఆనంద తరంగాల్లో తేలుతోంటే జాబు రాజే స్వయంగా చదివి వినిపించాడు అందరికీ. ప్రజల సంతోషానికి పట్ట పగ్గాలు లేక పోయాయి. సంతోష వార్తను అందజేసిన సేవకునికి తగిన రీతిన సత్కరించి, విలువ కట్టలేని కానుకలు అందజేశారు. ఉత్సవంగా అతన్ని రాజధానిలోకి తోడుకుని వెళ్ళారు. మర్నాడు వస్తోన్న సుందరసే నునికి స్వాగతం పలికేందుకు మందారదేవుడితో పాటుగా చతురంగ బలాలు వెంట రాగా బయల్దే రాడు మహాసేనుడు.

గాలితో సమానంగా పరుగుదీసే గుర్రాన్ని మందారవతితో పాటుగా ఎక్కాడు సుందరసే నుడు. దృఢబుద్ధి, మిగిలిన మంత్రులు అతన్ని అనుసరించారు. సైన్య సమేతంగా వింధ్యకేతువు వారి వెన్నంటాడు. అదిగో అలకాపురం అంటే ఇదిగో సుందరసేనుడు అన్నట్టుగా తండ్రి-కొడు కులు కలుసుకున్నారు. తండ్రిని చూస్తూనే గుర్రం దిగి, అతని పాదాలకు నమస్కరించాడు సుందరసేనుడు. మందారవతి కూడా మామగా రికి నమస్కరించింది. మంత్రులు కూడా మహా రాజుకి నమస్కరించారు. అందర్నీ ఆశీర్వదిం చాడు రాజు. తండ్రిని చూసింది మందారవతి. అతన్ని సమీపించింది.

''మా నాన్నగారు'' తండ్రిని సుందరసేను నికి పరిచయం చేసింది మందారవతి. నమస్క రించాడతనికి సుందరసేనుడు. ఆనాటి ఓడ ప్రయాణంలో వీడిపోయిన మంత్రులను చూసి ఆనందించాడు సుందరసేనుడు. వారందరినీ పేరు పేరునా పలకరించి గుచ్చి కౌగిలించుకు న్నాడు. అంతలో శశాంకపురం నుండి మహేం ద్రాదిత్య మహారాజు వచ్చాడక్కడికి. అతన్ని చూస్తోనే అంతా ఆనందంగా కేరింతలు కొట్టారు. అందరూ అలకాపురానికి ఊరేగింపుగా బయల్దే రారు. మందారవతితో వస్తోన్న యువరాజు సుందరసేనుని చూసి నగర ప్రజ జేజేలు పలి కింది. అంతఃపురానికి తల్లి దగ్గరకు చేరాడు సుందరసేనుడు. మందారవతితో తల్లి పాదాలకు నమస్కరించాడు.

మర్నాడే నిర్ణయించిన ముహూర్తానికి మందారవతి-సుందరసేనుల పెళ్ళి జరిగింది. తన రాజ్యమంతా సుందరసేనునికి కట్నంగా అందజేశాడు మందారదేవుడు. సుందరసేనుని వివాహ మహోత్సవానికి గుర్తుగా బందీలుగా ఉన్న సామంతులను, శత్రువులను జాలి తలచి వదిలి వేశాడు మహాసేనుడు.

కొన్నాళ్ళు గడిచాయి.

సుందరసేనునికి రాజ్యాన్ని అప్పగించి భార్యతో పాటుగా వానప్రస్థాశ్రమాన్ని స్వీకరిం చాడు మహాసేనుడు. మందారవతితో సకల భోగాలను అనుభవిస్తూ ప్రజలను చల్లగా పరిపా లించసాగాడు సుందరసేనుడు.

★

వచ్చేవారం
శివ మాధవుల కథ

హోటల్లో కూర్చుని...

''నేను బెంగుళూరులో అడుగుపెడితే ఇంట్లో వాళ్ళందరికీ ఎక్కడలేని హుషారు వచ్చేస్తుంది'' అని తన కుటుంబం గురించి చెప్పుకొచ్చింది ప్రియమణి. ఇటీవల షూటింగ్‌లతో బిజీగా ఉన్న ప్రియమణి ఎప్పుడూ సూట్‌కేస్‌ను సర్దే ఉంచుతోం దట. బెంగుళూరుకి వెళ్ళడం అరుదుగా కుదురుతోందట. ఆ విశేషాల్ని చెబుతూ ''నేను ఇంట్లో ఉన్న రెండు రోజులు నాకిష్టమైన అన్ని వంటకాలను చేసి తినిపించే యాలని అమ్మ ఆరాట పడుతుంది. కానీ నాన్న మాత్రం అందర్నీ హోటల్‌కు తీసుకెళ్తారు. అమ్మ కూడా వంటింటికి పరి మితం కాకుండా సరదాగా కబుర్లు చెబుతూ కూర్చో వచ్చు అన్నది ఆయన ఉద్దేశం. షూటింగుల్లో ఉన్న పుడు ఎలాగూ బయట తిండి తప్పదు కదా. ఇప్పుడు కూడా హోటల్‌కు ఎందుకు? అని అమ్మ ఉడుక్కోవడం చూసి మేం నవ్వుకుంటుంటాం'' అని కొంటెగా నవ్వింది ప్రియ.

కథా సరిత్సాగరం

అనగనగా రత్నపురం. ఆ పురంలో శివుడు–మాధవుడు అని ఇద్దరు జూదగాళ్ళు. వారిద్దరూ మోసానికి పెట్టింది పేరు. అనేకమంది మోసగాళ్ళను చేరదీసి వారు ఆ ఊరిలోని ధనవంతుల్ని బాగా దోచుకున్నారు. దోచేందుకు ఇక ఆ ఊరిలో ఏదీ లేదని, ఎవరూ లేరని తెలుసుకుని ఓ రోజు ఇలా తర్జన భర్జనలు పడ్డారు.

''ఇక ఇక్కడ ఉండడం అనవసరం. వేరే ఏదేని ఊరు చూసుకోవాలి. అక్కడకెళ్ళి దోచుకోవాలి''

''అయితే ఉజ్జయినికి పోదాం. అక్కడ శంకరస్వామి అని బాగా డబ్బున్న వాడున్నాడు. రాజపురోహితుడతను. వాడి సొమ్ము కాజేద్దాం''

''అవునవును! నేనూ విన్నాను. బాగా పిసినిగొట్టట! రాజుగారిచ్చే దక్షిణలలో సగ భాగం అతనికి ఇవ్వాలట! లేకపోతే గొడవంటున్నారు. డబ్బునంతా ఏడు భోషాణాల్లో దాచి నేలలో పాతిపెట్టాట్ట''

''ఆ డబ్బుతో పాటు అందమైన కూతురు కూడా ఉందటతనికి. చాకచక్యంగా ప్రవర్తిస్తే ఆ కూతుర్ని కూడా దోచుకోవచ్చు''

''ఆలస్యం అమృతం విషం. పద''



శివ మాధవుల కథ

1

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

బయల్దేరారిద్దరూ. ఉజ్జయినికి చేరుకున్నారు. ముందు మాధవుడు రాకుమారుని వేషం వేసుకుని పరివారంతో ఊరి బయట శిబిరాలు ఏర్పాటు చేసుకుని విడిది చేశాడు. తర్వాత శివుడు బ్రాహ్మణ బ్రహ్మచారిలా వేషం వేసుకుని నగర ప్రవేశం చేశాడు. సిప్రా నదీ తీరాన ఓ మఠంలో విడిది చేశాడు. అందరూ అతనిని గమనించేట్టుగా బంకమన్ను, దర్భలు, భిక్షా పాత్ర, జింక చర్మాన్ని దగ్గర ఉంచుకున్నాడు.

తెల్లారుతూనే శరీరానికి దట్టంగా మన్ను పూసుకునేవాడు శివుడు. సూర్యకాంతిలో కాసేపుండి, తర్వాత నదిలో స్నానం చేసేవాడు. స్నానాంతరం శీర్షాసనం వేసేవాడు. శీర్షాసనంలో చాలాసేపు గడిపేవాడు. ఆ తర్వాత ఆలయానికి చేరుకునేవాడు. శివుని ఎదుట పద్మాసనంలో కూర్చుని దర్భలు ధరించి జపం చేసేవాడు. మధ్యాహ్నం అయితే కృష్ణాజినం ధరించి భిక్షాటన చేసేవాడు. భిక్షను బ్రాహ్మణుల దగ్గర్నుంచే అర్థించేవాడు. మూడు భిక్షలు చాలునతనికి. వాటిని తీసుకుని వచ్చి మూడు భాగాలు చేసేవాడు. ఒక భాగాన్ని కాకులకు వేసి, మరో భాగాన్ని ఆశ్రయించిన అన్నార్తునికి ఇచ్చి మిగిలిన భాగంతో తన కడుపు నింపుకునేవాడు. సూర్యాస్తమయం వరకు మళ్ళీ జపమాచరించేవాడు. రాత్రి మౌనవ్రతం చేపట్టి కళ్ళు మూసుకునేవాడు. అతని దొంగజపాన్ని నిజమనుకుని శివుణ్ణంతా అభిమానించి ఆరాధించసాగారు. అతని కీర్తి ఉజ్జయిని నగరమంతటా వ్యాపించింది.

ఊరవతల శిబిరాల్లో బస చేసిన మాధవుడు, బ్రహ్మాండంగా శివుడు నటిస్తున్నాడని తెలుసుకుని, అతన్ని మరింతగా ప్రచారం చేసేందుకు నగర ప్రవేశం చేశాడు. శివుడు ఉన్న ఆలయం సమీపంలోనే బస చేసి, రాజపుత్రునిగానే సిప్రా నదికి స్నానానికి వచ్చాడు. స్నానం చేసి పరివారంతో శివుడున్న ఆలయానికి చేరుకున్నాడు. అక్కడ జపంలో మునిగి ఉన్న శివుణ్ణి చూశాడు. భక్తులు చాలా మంది ఉన్నారక్కడ. అంతా శివుణ్ణే తదేకంగా చూస్తున్నారు. ఇదే సరయిన సమయం అనుకున్నాడు మాధవుడు. శివుడు పాదాల మీద



పడ్డాడు.

"స్వామీ" అన్నాడు. కళ్ళు తెరిచాడు శివుడు. మాధవుణ్ణి చూశాడు. సన్నగా నవ్వాడు.

"ఇలాంటి తపస్వి ఇంకొకరు లేరు. హిమాలయాల్లో చూశాని తన్ని. మళ్ళీ ఇక్కడ చూశాను. నా జన్మ ధన్యమయింది" భక్తులతో అన్నాడు మాధవుడు.

"మీ కరుణా కటాక్ష వీక్షణం చాలు స్వామీ! చాలు" అని శివుని పాదాలు కళ్ళకద్దుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు మాధవుడు. వెళ్ళిపోతున్న మాధవుణ్ణి చూస్తూ మళ్ళీ దొంగ జపం కోసం కళ్ళు మూసుకున్నాడు శివుడు. భక్తులంతా శివుణ్ణి చూస్తూ 'ఆహా ఓహో' అనుకున్నారు.

రాత్రయింది. ఊరవతల మర్రిచెట్టు కింద శివ మాధవులు కలుసుకున్నారు. చుట్టు ప్రక్కల ఎవరూ లేరని గ్రహించి పగలబడి నవ్వుకున్నారు. తర్వాత కడుపు నిండా కల్లు తాగి, సుష్టుగా భోంచేశారు. తీరిగ్గా ముందు ముందు ఏం చేయాలో ఎలా చేయాలో ఆలోచించారు. తెల్లారుతోందనగా 'వెళ్ళొస్తాను' అని వెళ్ళిపోయాడు శివుడు. మాధవుడు రంగంలోకి దూకాడు. పరివారంలోని దొంగని పిలిచి వాడి చేతికి పట్టు పంచెను ఇచ్చి ఇలా చెప్పాడు.

"తీసుకుని వెళ్ళి దీనిని రాజపురోహితుడు శంకరస్వామికి ఇవ్వు. ఎవరిచ్చారని అడిగితే రాకుమారుడు మాధవుడు ఇచ్చాడని చెప్పు" అన్నాడు.

"ఎవరతను? అని శంకరస్వామి అడిగితే పర్వా లేదు. అడగకపోయినా నా గురించి ఇలా చెప్పు. దాయాదులతో యుద్ధంలో ఓడిపోయిన రాకుమారుడు, తన తండ్రి ఆర్జించిన ఆస్తిపాస్తినంతటినీ పట్టుకుని దక్షిణ దేశం నుండి ఇక్కడికి

వచ్చాడని చెప్పు. అతన్ని వెన్నంటి పరివారం కూడా ఉందని చెప్పు'' అన్నాడు మళ్ళీ.

''మీకీ పట్టు పంచె ఎందుకిచ్చారంటే...మీ పేరు ప్రతిష్ఠలు విని మిమ్మల్ని దర్శించుకునేందుకు కానుకగా ఇచ్చారని చెప్పు. మీ అభిమానం కోసం చూస్తున్నారని, వీలయితే మీ రాజాస్థానంలో ఉద్యోగాన్ని అభ్యర్థిస్తున్నారని చెప్పు'' అన్నాడు మాధవుడు.

''సరే'' అన్నాడు దొంగ. బయల్దేరి శంకరస్వామిని కలిశాడు. పట్టు పంచె అందజేసి, మాధవుడు చెప్పిందంతా అతనికి చెప్పి 'శలవు' అని అక్కణ్ణుంచి వెను తిరిగాడు. పేరూ ఊరు తెలియని వ్యక్తి పట్టు పంచె కానుగ్గా పంపించడం ఏమిటని శంకరస్వామి తర్కించుకోలేదు. పైగా పట్టుపంచె లభించినందుకు ఆనందపడ్డాడు. మాధవుడు ఆస్తిపాస్తులన్నింటినీ వెంటబెట్టుకుని వచ్చాడని తెలియడంతో అతనిని మంచి చేసుకుని ఎలాగయినా వాటిని చేజిక్కించుకోవాలనుకున్నాడు. రాత్రీ పగలు అదే ఆలోచన చేయసాగాడు.

రెండు రోజులు గడిచాయి.

తోటి దొంగలకు ఆశ్రితుల వేషాలు వేసి, రాకుమారుని వేషంలో శంకరస్వామిని కలుసుకున్నాడు మాధవుడు. తానొస్తున్నట్టుగా మాధవుడు ముందుగా కబురంపాడు. దాంతో శంకరస్వామి ఆనందానికి అవధులు లేవు. గుమ్మంలోనే అతని కోసం వేచి చూడసాగాడు. ఎప్పుడయితే వస్తోన్న మాధవుణ్ణి చూశాడో అప్పుడు శంకరస్వామి ఎదురేగి అతన్ని కౌగలించుకున్నాడు. ఇంట్లోనికి ఆహ్వానించాడు. కాస్సేపు ఇద్దరూ ఆ కబురూ ఈ కబురు మాట్లాడుకున్నారు. తర్వాత వెళ్ళొస్తానని వెళ్ళిపోయాడు మాధవుడు. మర్నాడు కూడా అలాగే వచ్చాడతను. శంకరస్వామిని కలుసుకున్నాడు. పట్టుపంచె కానుగ్గా అందజేశాడు.

''రాజ దర్శనం కావాలి''



అడిగాడు మాధవుడు.

''అంతవసరమా'' ప్రశ్నించాడు శంకరస్వామి.

''చాలా అవసరం. అలాగే రాజాస్థానంలో ఉద్యోగం కూడా కావాలి'' అని ప్రార్థించాడు.

''ఇంత ఆస్తిపాస్తులుంచుకుని రాజాస్థానంలో ఉద్యోగం దేనికి'' అడిగాడు శంకరస్వామి.

''దేనికంటే... దాయాదుల నుండి నన్ను నేను కాపాడుకునేందుకు. ఫలానా రాజాస్థానంలో నేను ఉద్యోగిని అంటే దాయాదులు నా మీద దాడి చేసేందుకు భయపడతారు. నాకు ప్రాణ హాని ఉండదు. అంతేకాని డబ్బు

కోసం నాకు ఉద్యోగం అవసరం లేదు'' అన్నాడు మాధవుడు.

''పరివారం కూడా నన్ను కొంతకాలం ఉద్యోగిగా ఉండమని బలవంతం చేస్తోంది. అది కూడా ఓ కారణం'' అన్నాడు మళ్ళీ.

''డబ్బుకు, బంగారానికి కొదవలేదు. కావాల్సినంత నా దగ్గర ఉంది'' అన్నాడు మాధవుడు. కావాల్సినంత డబ్బు, బంగారం తన దగ్గర ఉన్నదని చెప్పడంతో వాటిని కాజేసేందుకు మాధవునికి రాజ దర్శనం చేయిస్తానన్నాడు శంకరస్వామి. ఒట్టంటూ అతని చేతిలో చేయి వేశాడు. చెప్పినట్టుగానే రాజుని కలిసి, అతని అనుమతి తీసుకున్నాడు. మర్నాడు రాజుని కలిశాడు మాధవుడు. రాజుకి ఎలాంటి అనుమానం రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాడు. అతన్ని రాజపుత్రుడనుకుని, పైగా పురోహితుని మాట కాదనలేక అడిగిన వెంటనే మాధవునికి తన ఆస్థానంలో ఉద్యోగాన్నిచ్చాడు రాజు. ఉద్యోగిగా కుదురుకుని పగలంతా రాజుని సేవిస్తూ రాత్రి వేళల శివుణ్ణి కలిసి శంకరస్వామిని దోచేందుకు పథకాలు పన్నసాగాడు మాధవుడు.

రాజపుత్రుడు. రాజాస్థానంలో ఉద్యోగి. అంతకు మించి డబ్బు బంగారాలకు కొదవ లేదు. అలాంటి వాణ్ణి బయట ఉంచడం కంటే తన ఇంట ఉంచడమే మేలనుకుని, మాధవుణ్ణి తన ఇంటే ఉండమని ప్రార్థించాడు శంకరస్వామి. కావాల్సిందదే! ఆనందంగా ఆ ఇంట ప్రవేశించాడు మాధవుడు. వెంట తెచ్చుకున్న బిందెను పురోహితునికి అప్పగించాడు.

''ఇందులో ఏముంది'' అడిగాడు శంకరస్వామి.

''మీరే చూడండి'' అని బిందె మీది కట్టు విప్పదీసి చూపించాడు మాధవుడు. అందులో మెరిసిపోతూ బంగారు నగలున్నాయి. అవి ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

''వీటిని మీరే భద్రపరచాలి'' అని బిందెను అందజేశాడు. కాదనలేదు శంకరస్వామి. వారానికి పదిరోజులకొకసారి బిందెలో నగలున్నదీ లేనిది మాధవుడు తీసి చూస్తూ, అవి ఎంత విలువయినవో శంకరస్వామికి చెప్పసాగాడు. చాలా విలువయిన నగలని గ్రహించాడు శంకరస్వామి. వాటిని ఎలాగయినా తన సొంతం చేసుకోవాలనుకున్నాడు. తన ఉచ్చులో శంకరస్వామి చిక్కుకున్నాడని గట్టి నమ్మకం ఏర్పడడంతో మాధవుడు ఆహారాన్ని క్రమ క్రమంగా తగ్గించుకుంటూ రాసాగాడు. కొద్ది రోజులకు కావాలనే చిక్కిపోయాడు. ఒకరోజు శంకరస్వామిని పిలిచి ఇలా చెప్పాడు.

''అజీర్తితో బాధపడుతున్నాను. తిన్నది అరగక చిక్కిపోతున్నాను. రేపో మాపోలా ఉన్నది నా పరిస్థితి. అయితే చనిపోయే ముందు ఓ మంచి పని చేసి చనిపోవాలన్నది నా కోరిక. అందుకు మీరేం చేస్తారంటే...''

''చెప్పు! ఏం చేయమంటావు'' అడిగాడు శంకరస్వామి.

''ఓ సద్బ్రాహ్మణుణ్ణి చూడండి! అతనికి నా ఆస్తిపాస్తులన్నీ దానం చేసి చనిపోతాను. ఇహలోకంలో సుఖపడలేకపోయాను. పరలోకంలోనయినా ఈ దానంతో సుఖిస్తాను''

''ఎందుకు చెబుతున్నానో వినండి రాకుమారా! ఒకటికి రెండుసార్లు ఆలోచించండి! మీరు చనిపోరు. ఉన్నదంతా వదులుకోవడం మంచిది కాదేమో'' అన్నాడు శంకరస్వామి.

''చనిపోతాను. దానమే ధ్యేయం'' అన్నాడు మాధవుడు. ప్రాణాలు పోతున్నట్టుగా కళ్ళు మూసుకున్నాడు. నిజంగానే అతను చనిపోతున్నాడనుకున్నాడు శంకరస్వామి. చేసేది లేక దానమిచ్చేందుకు బ్రాహ్మణులను పిలుచుకుని రాసాగాడు. అయితే వచ్చిన ఏ బ్రాహ్మడూ మాధవుడికి నచ్చడం లేదు.

''ఇతను బ్రాహ్మణోత్తముడు కాడు'' అని తెచ్చిన అందర్నీ తిప్పికొట్టసాగాడు. ఉజ్జయినిలో ఇక బ్రాహ్మణులు లేరనిపించింది. శంకరస్వామి తలపట్టుకున్నాడు. అంతలో మాధవుని ఆశ్రితుడు అతనితో ఇలా అన్నాడు.

''అయ్యా! బ్రాహ్మణోత్తముడు ఉన్నాడు. ఈ నగరంలోనే ఉన్నాడు''

''ఎక్కడ'' ఆత్రం కనబరిచాడు శంకరస్వామి.

''సిప్రా నదీతీరాన తపస్సు చేస్తోన్న శివుడే బ్రాహ్మణోత్తముడు''

''అవునవును! అతనే అసలు సిసలు బ్రాహ్మణుడు. పిలుచుకుని రండతన్ని'' గోల చేశాడు మాధవుడు. దొరికాడనుకుని శివుడి దగ్గరకు పరుగుదీశాడు శంకరస్వామి.

(సశేషం)

కత్రినా కంట కన్నీరు...



కత్రినా కంట కన్నీరొలికింది. తెర మీద కాదు నిజ జీవితంలోనే! శృంగార దేవతగా పేరొందిన ఈ భామ కన్నీరు పెట్టాల్సినంత బాధలు ఏముంటాయనుకుంటే పొరపడినట్లే! ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్లు...ఎంత సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌కైనా ఫ్లాపులు తప్పవు. ప్రస్తుతం కత్రినా ఈ స్థితినే ఎదుర్కొంటోంది. ఇటీవల విడుదలైన 'తీస్ మార్ ఖాన్' మీద కత్రినా ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ సినిమా అనుకున్న విజయం సాధించలేదు. దానికి తోడు ఇటీవల ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా పరాజయం గురించి విలేకర్లు గుచ్చి గుచ్చి అడగడంతో ఆ బాధ రెట్టింపు అయి కన్నీరుమున్నీరయిందట! ''ఈ సినిమా కోసం నేను చాలా కష్టపడ్డాను. ఒక పాట కోసం ఎన్నడూ లేనంతగా కష్టపడ్డాను. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశించాను. అయితే అనుకున్న ఫలితం రాలేకపోయినా, సినిమా ఫ్లాప్ మాత్రం కాదు. ఫ్లాప్ సినిమా అంటూ దయచేసి ప్రచారం చేయకండి'' అంటూ కళ్ళ వెంట నీరు తెచ్చుకుందట! అయినా ఈ రంగంలో ఫ్లాప్‌లు, సక్సెస్‌లు సర్వసాధారణం అంటూ చివరకి తనకు తాను నచ్చజెప్పుకుందట! కత్రినా స్థితి చూసి సమావేశంలో పాల్గొన్న విలేకర్లు అయ్యో! పాపం అని కూడా అనుకున్నారట!

కథా సరిత్సాగరం

తన ఉచ్చులో శంకరస్వామి చిక్కుకున్నాడని గట్టి నమ్మకం ఏర్పడడంతో మాధవుడు ఆహారాన్ని క్రమ క్రమంగా తగ్గించుకుంటూ వచ్చి కావాలనే నీరసించి పోయాడు. మరణానికి దగ్గరగా ఉన్నానని చెప్పి, శంకరస్వామిని తన కోరిక తీర్చమన్నాడు. సద్బ్రాహ్మణుణ్ణి వెతికి పెట్ట మన్నాడు. మంచి బ్రాహ్మణుడు దొరికితే తన ఆస్తిపాస్తులన్నీ అతనికి దానం చేసి మరణిస్తానన్నాడు. సిప్రానదీ తీరాన తపస్సు చేస్తోన్న శివుడే బ్రాహ్మణోత్తముడు అని పేర్కొన్నాడు. దాంతో శివుని దగ్గరకు శంకరస్వామి పరుగుదీశాడు. చేరుకున్నాడతన్ని.

ఆ వేళకి శివుడు దొంగ జపంలో నిండుగా మునిగిపోయి ఉన్నాడు. శంకరస్వామి రాకను గమనించినా గమనించనట్టే వూరుకున్నాడు. ధ్యానంలో ఉన్న శివుణ్ణి గొప్పవాడనుకుని అతని చుట్టూ ప్రదక్షిణలు చేసి మరీ కూర్చున్నాడు స్వామి. కాస్సేపటికి మెల్ల మెల్లగా కళ్ళు తెరిచాడు శివుడు. ఎదురుగా ఉన్న స్వామిని చూశాడు.

''ఎవరు నీవు'' అడిగాడు. తన గురించి అంతా చెప్పుకొచ్చాడు శంకరస్వామి. తర్వాత ఇలా అన్నాడు.

శివ మాధవుల కథ

2

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

''కోపం తెచ్చుకోనంటే నాదో చిన్న మనవి''

''చెప్పు''

''మాధవుడు అని ఓ రాజపుత్రుడు మా ఇంట్లో బస చేశాడు. దక్షిణదేశం నుండి వచ్చాడతను. పాపం జబ్బుపడి చనిపోతానన్న భయంతో ఉన్నాడు. ఆ భయంతో తన ఆస్తిపాస్తులన్నీ సద్బ్రాహ్మణుడికి దానం చేయాలనుకుంటున్నాడు. మీరు అంగీకరిస్తే మీకే ఇద్దామనుకుంటున్నాడు. కాదనకండి'' చేతులు జోడించాడు స్వామి. ఆ మాటలకు సన్నగా నవ్వుకున్నాడు శివుడు.

''బ్రహ్మచారిని. భిక్షాటన చేసి బతుకుతున్న వాడిని. నాకు ఆస్తిపాస్తులెందుకు''

''అమ్మమ్మ! మీరంత మాట అనకూడదు. మీరు బ్రహ్మచారే కాని, పెళ్ళంటే ఇష్టంలేని వారు కాదుకదా! అలాగే ఇప్పుడు బ్రహ్మచారి కాబట్టి భిక్షాటన చేసి బతుకుతున్నారు. రేపు పెళ్ళి చేసుకుంటే ఆస్తిపాస్తులు మీకు కావాలి. తప్పదు. పెళ్ళి చేసుకుని కాపురం చేస్తూ కూడా ధర్మార్థ కామ మోక్షాలను సాధించవచ్చు. ఏమంటారు?'' ప్రశ్నించాడు శంకరస్వామి.

''సరేనంటాను కాని, నాకు పిల్లనిచ్చేదెవరు'' అడిగాడు శివుడు. ఆ ప్రశ్నకు జవాబిచ్చే ముందు స్వామి చాలా లెక్కలు కట్టాడు. ఫలితాన్ని ఊహించాడు. శివుడికి మాధవుడు దానం చేసే ఆస్తిపాస్తులన్నీ తాను అనుభవించేందుకు తాను ఊహించిన లెక్కలే సరయినవని నిర్ధారణకు వచ్చి ఇలా అన్నాడు.

''నాకో కూతురుంది. పేరు వినయస్వామిని. అందంగా ఉంటుంది. నీకు మా అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తాను. చేసుకో! హాయిగా ఇద్దరూ నా దగ్గరే ఉండండి! మాధవుడిచ్చిన ఆస్తిపాస్తులంటావా? అవి నా దగ్గరే ఉంటాయి''

తన రొట్టె విరిగి నేతిలో పడిందనుకున్నాడు శివుడు. అందాలరాశి వినయస్వామి తన భార్య కావడం కంటే అదృష్టం లేదనుకున్నాడు.

''మీరింతగా చెబుతున్నారు కాబట్టి సరే అంటున్నాను. మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను. అయితే నాదో షరతు! ఈ ఆస్తిపాస్తులు ఇవేవీ నా ఒంటికి సరిపడవు. వాటి సంగతి మీరే చూసుకోవాలి''

''మహదానందంగా'' అన్నాడు శంకరస్వామి. శివుణ్ణి తోడుకుని ఇంటికి చేరుకున్నాడు. మాధవు

డికి సంగతంతా చెప్పాడు. ఆనందించాడు మాధవుడు. అనుకున్నట్టుగానే అంతా జరుగుతోందని సంతోషపడ్డాడు. అల్లారు ముద్దుగా పెంచిన కూతుర్ని చేజేతులా శివుడికిచ్చి పెళ్ళి చేశాడు శంకరస్వామి.

పదహారు రోజుల పండుగ ముగిసింది. ఆ మర్నాడు పెళ్ళయిన పదిహేడవ నాడు మాధవుని ఆస్తిపాస్తుల్ని దానంగా స్వీకరించేందుకు శివుడు సిద్ధమయ్యాడు. మాధవుడు శాస్త్రోక్తంగా దొంగ నగలున్న బిందెను శివుడికి దానం చేశాడు. అల్లుడు శివుడు బిందెను దానంగా స్వీకరిస్తోంటే శంకరస్వామి ఉబ్బితబ్బిబ్బు అయిపోయాడు. బిందెను మామగారికి అందజేశాడు శివుడు.

"ముందు నేను మీకు చెప్పినట్టుగానే ఈ ఆస్తిపాస్తులేవీ నాకు వద్దు. వీటి సంగతి మీరే చూసుకోండి'' అన్నాడు.

''సంతోషం'' బిందెను అందుకున్నాడు శంకరస్వామి. దానిని ఎవరూ చూడకుండా ఓ రాత్రి వేళ భోషాణంలో ఉంచి నేలలో దాచి పెట్టాడు.

కొద్దిరోజులు గడిచాయి. మాధవుడు క్రమక్రమంగా ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటూ



కుదుటపడసాగాడు. దానమిచ్చిన ఫలితమే ఇదంతా అని స్వామిని నమ్మించాడు. శివునితో స్నేహం చేయసాగాడు. అల్లుడు, మాధవుడు ఆత్మీయంగా మెలగడం నేత్రపర్వం అయింది స్వామికి.

ఒకనాడు మామగారిని కలిశాడు శివుడు. ఇలా అన్నాడు.

"ఇల్లరికం వచ్చినట్టుగా మీ ఇంట ఉండడం నాకిష్టం లేదు. పదిమందీ పదిరకాలుగా అనుకుంటున్నారు. అందుకని నేను వేరే ఉందామనుకుంటున్నాను"

"ఉండండి! దానికేం అభ్యంతరం" అన్నాడు శంకరస్వామి.

"ఉండాలంటే డబ్బు కావాలి. కాబట్టి మీరేం చేస్తారంటే నేను దానంగా స్వీకరించిన నగలకు వెల కట్టి నాకు డబ్బు చెల్లించండి! ఇంత కావాలని నేను మిమ్మల్ని బలవంతం చేయడం లేదు. మీకు తోచిందే నాకు చెల్లించండి. ఒకవేళ ఆ నగలు మంచివి కావు అనుకుంటే...దానంగా నాకు కొంత డబ్బు ఇవ్వండి. దానిని పెట్టుకుని, నేనూ మీ అమ్మాయి బతుకుతాం" అన్నాడు శివుడు.

"తప్పకుండా" అని నగలకు వెల కట్టి తన యావదాస్తినీ శివుడికి రాసిచ్చాడు స్వామి. నగలను తనకు అల్లుడు అమ్మినట్టుగా విక్రయపత్రాన్ని అతని దగ్గర్నుంచి తీసుకున్నాడు. అలాగే తాను క్రయపత్రాన్ని అతనికి రాసిచ్చాడు. మామ దగ్గర్నుంచి విడిపోయిన శివుడు, మాధవుడికి మరింత దగ్గరయ్యాడు. ఇద్దరూ శంకరస్వామి ఆస్తిని అనుభవించసాగారు. విందు వినోదాల్లో క్షణం తీరిక లేకుండా గడపసాగారు.

ఒకనాడు డబ్బు అవసరమై బిందెలోని నగలలో ఓ నగను అమ్మజూపాడు శంకరస్వామి. నగల వర్తకుడు నగను కిందా మీదా చూసి ఇలా అన్నాడు.

"ఇది బంగారం కాదు. ఇత్తడి. అలాగే వీటికి అద్దినవి మణులు కావు. గాజు పూసలు. అయితే ఇది ఈ రకంగా చేసి అచ్చు బంగారు నగగా భ్రమింపజేసిన తయారీదారు మాత్రం గొప్పవాడు"

శంకరస్వామి గుండెల్లో రాయి పడినట్టయింది. నగలన్నీ ఇంతే కాదుకదా!? అనిపించింది. ఎందుకయినా మంచిదని బిందెలోని నగలన్నీ తెచ్చి వర్తకుడికి ఇచ్చి చూసి చెప్పమన్నాడు.

"అన్నీ ఇత్తడి నగలే! అనుమానం లేదు" అన్నాడు వర్తకుడు. దాంతో పరుగు పరుగున శివుణ్ణి చేరుకున్నాడు స్వామి.

"నీ నగలు నువ్వు తీసుకో! నా డబ్బు నాకిచ్చేయ్" అడిగాడు.

"డబ్బా? అదెక్కడుంది. ఎప్పుడో ఖర్చయిపోయింది" అన్నాడు శివుడు. ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగింది. కొట్టుకునే స్థాయికి వచ్చారిద్దరూ. ఆఖరికి రాజును ఆశ్రయించారు.

"నాకు ఈ దొంగ నగలు అంటగట్టి నా డబ్బంతా దోచుకున్నాడు" చెప్పాడు శంకరస్వామి. గుండెలు బాదుకుని ఏడవసాగాడు.

"ప్రభూ! నాకీ గొడవలేవీ తెలియవు. తపస్సు చేసుకుంటోన్న నన్ను చేరదీసి పిల్లనిచ్చి పెళ్ళి చేస్తానన్నాడీయన. దానంగా నగల్ని స్వీకరించమన్నాడు. స్వీకరించాను. అయితే ఆనాడే చెప్పాను, ఆస్తిపాస్తులు నేను పట్టించుకోనని. తాను జాగ్రత్త చేస్తానన్నాడు. చేశాడు. తర్వాత ఇతనే వెల కట్టి డబ్బు చెల్లించాడు. క్రయ విక్రయ పత్రాలు కూడా ఉన్నాయి" అన్నాడు శివుడు.

మాధవుడు అప్పుడు ఆస్థానంలోనే ఉన్నాడు. రాజుగారి సమీపంగా కూర్చుని అంతా వింటున్నాడు.

"అసలిదంతా ఇదిగో ఈయన వల్ల వచ్చింది" అన్నాడు స్వామి. మాధవుణ్ణి బరిలోకి లాగాడు.

"ఇందులో నా తప్పేం ఉంది స్వామీ! పెద్దవారయి ఉండి మీరిలా మాట్లాడడం భావ్యమా? నేను మీ దగ్గర నుంచి గాని, మిత్రుడు శివుడు దగ్గర నుంచి గాని ఏమీ ఆశించలేదు. పైగా నా దగ్గరున్నదే మీకిచ్చాను. తాతల నాటి నగలు తెచ్చి దానం చేశాను. అవి మంచి నగలా కాదా అన్నది పక్కన పెడితే ఏ పాపం తెలీకుండా నేను దానం ఇచ్చిన కారణంగానే నేను మృత్యుముఖం నుండి బయట పడగలిగాను. నాకది చాలు" అన్నాడు మాధవుడు. మాట్లాడుతున్నప్పుడు అతనే మాత్రం తొణకలేదు బెణకలేదు.

శంకరస్వామి సంకటానికి రాజాస్థానంలోని వారంతా నవ్వుకోసాగారు.

"ఇందులో శివుని తప్పుగాని, మాధవుని తప్పు గాని లేదుగాక లేదు" అన్నారు. డబ్బంతా పోగొట్టుకుని శంకరస్వామి ఇంటికి చేరుకున్నాడు. అతిలోభం అసలుకే చేటు తెచ్చిందనుకున్నాడు.

శివ-మాధవులిద్దరూ కులాసాగా దిలాసాగా కాలం గడపసాగారు.

★

కథా సరిత్సాగరం

హరిశర్మ పేదవాడు. పైగా పిల్లలు గలవాడు. అతనికి చదువు కూడా రాదు. భార్య బిడ్డలతో యాచన చేస్తూ బతుకుతుండేవాడు. కొన్నాళ్ళకు యాచన ఇష్టం లేక డబ్బున్న స్థూలదత్తుణ్ణి ఆశ్రయించాడతను. కష్టపడి పని చేస్తాం. కడుపునకు ఇంత తిండి పెట్టమంటే 'సరే'నన్నాడు స్థూలదత్తుడు. పిల్లల్ని పశుల కాపర్లను చేశాడు. భార్యను పనిమనిషిని చేశాడు. తను స్థూలదత్తునికి పరిచర్యలు చేస్తూ గడపసాగాడు హరిశర్మ. కొద్ది రోజులు గడిచాయి. స్థూలదత్తుని కూతురు వివాహ ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. బంధువులు అనేకులు రాసాగారు. వినోదాల సంగతి అటుంచితే విందు కోసం భార్యాబిడ్డలతో కాచుకుని కూర్చున్న హరిశర్మను ఎవరూ పిలవలేదు. అసలతన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఆ అవమానాన్ని తట్టుకోలేకపోయాడు హరిశర్మ. నిద్రపట్టలేదతనికి. లేచి కూర్చుని ఆలోచించసాగాడు.

హరిశర్మ కథ

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు '**అనీలజ**' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

''ఎందుకండీ పొద్దున్నుంచి ఏదోలా ఉన్నారు'' అడిగింది భార్య లక్ష్మి.

''ఎంత పనివాళ్ళం అయితే మాత్రం పట్టెడు అన్నానికి మనం నోచుకోలేదా'' బాధపడ్డాడు హరిశర్మ.

''పనివాళ్ళు ప్రభువులకు కనిపించరండి'' అందామె. కళ్ళొత్తుకుంది.

''కనిపించాలి. కనిపించేటట్టు చేస్తాను''

''ఏం చేస్తారు''

''అదే ఆలోచిస్తున్నాను. ప్రభువుల దగ్గర గౌరవం పొందాలంటే ఏదయినా చెయ్యాలి. ఏం చేస్తే బాగుంటుంది'' దీర్ఘంగా ఆలోచించాడు. ఆలోచించాలోచించి చప్పున ఏదో తట్టిందేమో! ఇలా అన్నాడు.

''ఆ! నటిస్తాను. నమ్మకం కలిగేటట్టుగా నటిస్తే ఎదురుండదు. జోస్యునిగా నేను నటిస్తాను. నేను జోస్యుడన్నది నువ్వు ప్రచారం చెయ్యాలి'' అన్నాడు హరిశర్మ. 'ఏమంటావు' అన్నట్టుగా భార్య కళ్ళల్లోకి చూశాడు.

''పిల్లలకు, మీకు కడుపునిండా తిండి దొరుకుతుందంటే...అందుకోసం నేనేమయినా చేస్తాను'' అంది లక్ష్మి.

''ఈ మాట మీద నిలబడు! దరిద్రం మన దరిదాపుల్లోకి ఇక రాదు'' అన్నాడు హరిశర్మ. ఆ రాత్రి అంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు పెళ్ళికొడుకు గుర్రాన్ని దొంగిలించి దాన్ని ఊరవతలకి తీసుకునిపోయాడు. అక్కడి మర్రిచెట్టు ఊడకి గుర్రాన్ని కట్టి ఏమీ తెలియనట్టుగా తిరిగి వచ్చి నిద్రపోయాడు హరిశర్మ.

తెల్లారింది. గుర్రం కోసం పెళ్ళివారు చూశారు. కనిపించలేదది. ఏమయిందీ అంతుచిక్కలేదు ఎవరికీ. అపశకునమని స్థూలదత్తుడు భయపడి బాధపడ్డాడు. విచారంగా తలపట్టుకున్నాడు. అప్పుడు అతన్ని సమీపించింది లక్ష్మి.

''అయ్యా'' మెల్లిగా గొంతెత్తింది.

''ఏంటి'' అడిగాడు స్థూలదత్తుడు.

''మావారు పెద్ద జోస్యులు. వారికి జోస్యం బాగా తెలుసు. మీరు మరోలా అనుకోనంటే...వారిని పిలిచి గుర్రం సంగతి అడగండి. ఇట్టే తెలిసిపోతుంది'' అన్నది లక్ష్మి.

''నిజమా'' ఆశ్చర్యపోయాడు స్థూలదత్తుడు. వెంటనే హరిశర్మను రప్పించాడు. విషయాన్ని వివరించాడు.

''గుర్రం ఏమయిందీ తెలియాలి! ఎక్కడున్నదీ తెలియాలి'' అడిగాడు.

''విందు వినోదాలకు ఈ హరిశర్మ కనిపించలేదుగాని, ఇప్పుడు గుర్రం పోయేసరికి కనిపించాడా ప్రభూ'' ఎత్తిపొడిచాడు.

''తప్పు ఒప్పుకుంటున్నాను. జరిగిందానికి క్షమించు. ముందీ సంగతి చెప్పు! పెళ్ళికొడుకు గుర్రం ఎక్కడుంది''

చెబుతాను! తొందరపడకండన్నట్టుగా చేతిని ఆడించి కళ్ళు మూసుకున్నాడు హరిశర్మ. తర్వాత శూన్యంలో ఏదో దృశ్యాన్ని ఊహిస్తున్నట్టుగా చేతివేళ్ళను కదిపి, కళ్ళు తెరిచి ఇలా అన్నాడు.

''గుర్రం దొరికింది. ఊరవతల మర్రిచెట్టు ఊడకి కట్టి ఉంది. వెళ్ళి తెచ్చుకోండి'' అన్నాడు. ఆ మాటకు నౌకర్లు పరిగెత్తి చూశారు. హరిశర్మ చెప్పినట్టుగానే ఊరవతల మర్రిచెట్టు ఊడకి కట్టి ఉన్న గుర్రం కనిపించింది. 'హమ్మయ్య' అనుకుని గుర్రాన్ని తీసుకొచ్చారు.

''తిరుగులేదు! నువ్వు గొప్పవాడివి. గొప్ప జోస్యుడివి'' హరిశర్మను మెచ్చుకున్నాడు స్థూలదత్తుడు. ఆనాటి నుంచి హరిశర్మకు తిరుగులేకపోయింది. అతను ఆడింది ఆట! పాడింది

పాటయింది. ముప్పూటలా తింటూ భార్యాబిడ్డలతో సుఖంగా జీవించసాగాడు. అంతలో రాజమందిరంలో దొంగతనం జరిగింది. రాణిగారి నగలు దొంగిలించారెవరో. ఎంత వెదికినా దొరకలేదవి. హరిశర్మ గురించి రాజుగారికి తెలియజేశారు. అతను గొప్ప జ్యోస్యుడని చెప్పారు. పోయిన వస్తువులు ఎక్కడున్నదీ ఇట్టే చెబుతాడన్నారు. పిలిపించమన్నారు రాజుగారు. పిలుపు అందుకుని రాజమందిరానికి లక్ష్మితో పాటుగా వచ్చాడు హరిశర్మ.

"రాణిగారి నగలు దొంగిలించారెవరో" రాజుగారు అన్నారు.

"తెలిసింది ప్రభూ"

"ఎంతగా వెదికినా దొరకలేదు! మీరు మహా జోస్యులని, పోయిన వస్తువులు ఎక్కడున్నదీ చెబుతారని తెలిసింది. చెప్పండి! మా రాణిగారి నగలు ఎక్కడున్నాయి"

"రేపు చెబుతాను ప్రభూ" అన్నాడు హరిశర్మ.

"అయితే మీరు అర్థాంగితో పాటుగా ఇక్కడే...ఈ రాజమందిరంలోనే ఉండండి" ఆజ్ఞాపించాడు రాజు. మణి మాణిక్యాలతో మెరిసిపోతున్న గదిని ఏర్పాటు చేశారు. పంచ భక్ష్య పరమాన్నాలు వడ్డించారు. అయినా మెతుకు ముట్టలేదు ఇద్దరూ. వచ్చి పడిన ప్రమాదం గురించి ఆలోచిస్తూ కూర్చున్నారు. మెతుకు కోసం బతుకు కోసం నాటకం ఆడితే అదిప్పుడు మెడకు చుట్టుకున్నదని విచారించసాగారు.

రాజమందిరంలో రాణిగారి పరిచారిక ఒకతె ఉన్నది. ఆమె పేరు జిహ్వ. అన్నలతో కలిసి రాణిగారి నగలను ఆమే దొంగిలించింది. ప్రముఖ జోస్యుడు హరిశర్మ రాజమందిరానికి వచ్చాడని తెలియడంతో అతను ఎలా ఇవన్నీ తెలుసుకోగలుగుతాడు? రేపు చెబుతానంటూ గడువు అడగడంలోని అతని ఆంతర్యం ఏమిటి?

–ఇవన్నీ గమనించేందుకు ఆమె, హరిశర్మను ఓ కంట కనిపెడుతూ చాటుగా నిల్చుని ఉంది.

"పాడు జిహ్వా! దురాశకు పోయి ఎంత పని చేశావే! చేసిన తప్పునకు శిక్ష తప్పదు" అన్నాడు హరిశర్మ. తనను తాను తిట్టుకున్నాడు. అది విన్న జిహ్వ, హరిశర్మ తన గురించే అన్నాడనుకుని, అతనికంతా తెలిసిపోయిందనుకుని పరుగున వచ్చి హరిశర్మ పాదాల మీద పడింది.

"క్షమించండి మహానుభావా! క్షమించండి! ఏదో బుద్ధి గడ్డి తిని నేనూ మా అన్నలూ ఈ దొంగతనం చేశాం. నా పేరు జిహ్వ అని కూడా మీకు తెలిసిపోయిందంటే మేము దొంగిలించిన నగలు ఎక్కడ పాతి పెట్టిందీ మీకు తెలిసిపోయి ఉంటుంది" అన్నది. తనేం మాట్లాడుతోందో తెలియని ఒకానొక స్థితిలో తాము దొంగిలించిన నగలు ఎక్కడ దాచిందీ చెప్పేసింది జిహ్వ. హరిశర్మకి–లక్ష్మికి జరుగుతున్నదేమీ క్షణం అర్థం కాలేదు. తర్వాత జరిగిందేమిటన్నది అర్థం అయింది. 'ఇదంతా జిహ్వ మహిమ' అనుకున్నారు.

"చెప్పండమ్మా! నన్ను క్షమించమని మీరయినా చెప్పండమ్మా" అంటూ శర్మ పాదాల్ని వదలి లక్ష్మి పాదాలకు చుట్టుకు పోయింది జిహ్వ.

"క్షమిస్తాంగాని నీకసలు ఏమీ తెలియనట్టుగానే ఉండు! నువ్వు దొంగతనం చేయనట్టుగానే ఉండు! మీ అన్నలకు కూడా చెప్పు, పిచ్చి పిచ్చి వేషాలు వేయొద్దని. వెళ్ళిక్కణ్ణుంచి. ఇక్కణ్ణుంచే కాదు, ఈ రాజ్యం నుంచే వెళ్ళిపో" చెప్పాడు శర్మ.

"అలాగే" అని పడి పడి దణ్ణాలు పెడుతూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది జిహ్వ. ఊపిరి పీల్చుకున్నారు శర్మ దంపతులు. దైవం అనుకూలిస్తే అంతా ఇలాగే ఉంటుంది.



ఆపదలు పోయి సంపదలొస్తాయి. నిజానికి తప్పు చేసిన వారే తప్పు చేశామన్న భయంతో వారంతట వారే బయటపడతారు. అందుకు ఈ జిహ్వే మంచి ఉదాహరణ అనుకున్నారు భార్యాభర్తలు. నవ్వుకున్నారు.

తెల్లారింది. రాజుగారిని సమీపించాడు శర్మ. పోయిన నగలు దొరికాయని చెప్పాడు. రాజునూ మంత్రి సామంతుల్నీ వెంటబెట్టుకుని జిహ్వ నగలు దాచి పెట్టిన చోటుకి చేరుకున్నాడు. అక్కడ తవ్వి నగలు బయటపెట్టాడు. దొరికిన నగలు చూసి ఆనందించాడు రాజు. శర్మని గుచ్చి కౌగిలించుకుని అభినందించాడు. తర్వాత బహుమతిగా అగ్రహారాలు ఈయబోతుంటే వారించాడు వెంటనున్న మంత్రి.

''చెప్పండి మంత్రివర్యా! మా చేతిని ఎందుకు వెనక్కి తీసుకోమన్నారు'' అడిగాడు రాజు.

''మరోసారి శర్మగారిని పరీక్షిద్దాం'' అన్నాడు మంత్రి.

''కానివ్వండి'' ఒప్పుకున్నాడు రాజు. చిక్కుల్లో పడ్డాననుకున్నాడు హరిశర్మ.

వారం రోజులు గడిచాయి. ఈ వారం రోజులూ ఏ రోజు ఏం జరుగుతుందోనని భయపడుతూనే ఉన్నాడు శర్మ. ఎనిమిదో రోజు సభలో కూర్చున్న శర్మ దగ్గరగా వచ్చాడు రాజు. అతని చేతిలో చిన్నపాటి కుండ ఉన్నది. అందులో కప్పను ఉంచి మూత పెట్టాడతను. తనని రాజుగారు సమీపించడంతో లేచి నిల్చున్నాడు శర్మ. చేతిలోని కుండను చూపించాడు రాజు.

''ఇందులో ఏమున్నదో మీరు చెప్పగలగాలి. చెబితే మీకిక్కడే ఈ సభామండపంలోనే అద్భుతంగా సత్కరిస్తాను'' అన్నాడు రాజు.

అయిపోయింది. సర్వనాశనానికి వచ్చింది. కుండలో ఏమున్నదో ఎలా తెలుస్తుంది? చెప్పలేడు తను. దీంతో తనకి జోస్యం రాదని తెలిసిపోతుంది. సత్కారం మాట దేవుడెరుగు. ఛీత్కారాలు తప్పవు. రాజ్యం నుండి తనని వెళ్ళగొడతారు. దిక్కులేని పక్షులయిపోతారు భార్యాబిడ్డలనుకున్నాడు హరిశర్మ. చిన్నతనంలో తను చేసిన ఇలాంటి పనులకు కోపం తెచ్చుకుని తండ్రి తనని 'ఒరేయ్ కప్పా' అని పిలిచే వాడు. నెత్తిన మొట్టేవాడు. అదెందుకో గుర్తొచ్చిందిప్పుడు. దాంతో ఇలా అనుకున్నాడు శర్మ.

''ఒరేయ్ కప్పా! నీ నాశనానికి వచ్చింది కదరా ఈ కుండ''

అంతే! రాజుగారు ఆశ్చర్యపోయి చేతిలోని కుండను జార విడిచారు. కింద పడి పగిలిన కుండలోంచి కప్ప బయటికొచ్చింది. గెంతుకుంటూ చాటుకు తప్పుకుంది. సభలోని వారు అది చూసి శర్మను మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. ఒకటే కరతాళ ధ్వనులు చేశారు. రాజుగారి ఆనందానికి అంతులేకుండాపోయింది. పరీక్షిద్దామన్న మంత్రిని 'ఇప్పుడు ఏమంటావు' అన్నట్టుగా చూసి, హరిశర్మను దగ్గరగా తీసుకున్నాడు రాజు.

''అనుమానం లేదు! మీరు గొప్ప జోస్యులు. మీకు అగ్రహారాలు కాదు, అర్ధరాజ్యం ఇస్తున్నాను. స్వీకరించండి. సత్కారం కాదు పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. ఆనందించండి'' అన్నాడు రాజు.

హరిశర్మను పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

★

కథా సరిత్సాగరం

లక్షపురాన్ని లక్షదత్తుడు పాలిస్తున్న రోజులవి. ఎవరితోనయినా ఆ రాజు సంభాషిస్తే అతనికి లక్ష వరహాలిచ్చేవాడు.సంభాషణ ఆనందాన్ని కలిగించగలిగితే ఎదుటి వ్యక్తి బూరెల గంపలో పడినట్టే! కోరుకున్నది రాజుగారు అతనికి కటాక్షించేవారు. లక్ష వరహాలు ఇవ్వడమే కాకుండా లక్షణంగా ఎదుటి వ్యక్తిని అందరిలో అంతెత్తున నిలబెడుతున్న కారణంగా రాజుగారిని అంతా 'లక్ష దత్తుడు' అని వ్యవహించేవారు. అటువంటి రాజుగారి కటాక్షం కోసం లబ్ధదత్తుడు అనే బ్రాహ్మణుడు ఎదురు చూడసాగాడు. రాజమందిరం సింహద్వారాన నిలుచుని ఉండి రాజుగారు తనని పలకరిస్తే బాగుణ్ణనుకునేవాడు. చలికి వణుకుతూ, వానకి తడుస్తూ, ఎండకి ఎండుతూ రాజుగారి కరుణా కటాక్షాల కోసం వేచి చూసేవాడు. అయితే ఏనాడూ రాజు అతన్ని పలకరించిన పాపాన పోలేదు. పలకరించడం మాట దేవుడెరుగు! కనీసం కన్నెత్తి అతన్ని చూడను కూడా చూడలేదు.

లక్ష్మీ కటాక్షం

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

ఒకనాడు రాజుగారు మంత్రి సామంతుల సమేతంగా వేటకి బయల్దేరాడు. అతనితో పాటుగా లబ్ధదత్తుడు కూడా వేటకి వెళ్ళాడు. లావుపాటి కర్రనే ఆయుధంగా చేసుకున్నాడతను. మంత్రి సామంతులు, రాజుగారు రథాల మీద నుండి క్రూరమృగాలను వేటాడుతోంటే, లబ్ధదత్తుడు నేల మీదనే నడుస్తూ పరుగుదీస్తూ మృగాలను వేటాడడాన్ని రాజుగారు చూశారు. సంతోషించారు. అయినా అతన్ని పలకరించ లేదు. కానుకలివ్వలేదు. వేట నుంచి తిరిగొచ్చేశారంతా.

వచ్చిన తర్వాత మళ్ళీ మామూలే! లబ్ధదత్తుడు రాజుగారి కృప కోసం నిలుచున్నాడు.

ఓసారి సరిహద్దుల విషయమై రాజుగారికి దాయాదులతో గొడవ జరిగింది. ఆ గొడవ యుద్ధంగా పరిణమించింది. ఆ యుద్ధంలో కూడా లబ్ధదత్తుడు లావుపాటి కర్రనే ఆయుధంగా చేసుకుని శత్రువుల్ని చీల్చి చెండాడు. రాజుగారు అది చూసి ఆశ్చర్యపోయాడు. అయినా లబ్ధదత్తుణ్ణి అతను కరుణించలేదు. ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. ఆరో ఏడు ప్రవేశించింది. అప్పుడు రాజుగారి హృదయం కరిగింది. లబ్ధదత్తునకు ఏదయినా లబ్ధి చేకూర్చాలనుకున్నాడు. అనుకున్నదే ఆలస్యం రాజే స్వయంగా ఓ గుమ్మడి పండు తీసుకుని వచ్చి, దాన్ని తొలిచి, అందులో మణి మాణిక్యాలు, రత్నాలు, బంగారాన్నుంచి మూసేసి, చూసేందుకు మామూలు గుమ్మడిపండు అనిపించేలా చేసి దాన్ని సభాముఖంగా లబ్ధదత్తునికి కానుగ్గా ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. సింహద్వారంలో నిల్చున్న దత్తుణ్ణి పిలిచాడా నాడు. సభకు ఆహ్వానించాడు. వచ్చాడు దత్తుడు. రాజుకి నమస్కరించి నిల్చున్నాడు.

''పాటలొచ్చా'' అడిగాడు రాజు.

''వచ్చు మహాప్రభో'' అన్నాడు దత్తుడు.

''మంచి సూక్తి ఉన్న పాటొకటి పాడు''

పాడాడు దత్తుడు. నదులు సముద్రంలో కలిసినట్టుగా ధనవంతుల్నే కరుణిస్తుంది లక్ష్మి. వారిని మరింత ధనవంతుల్ని చేస్తుంది. దరిద్రుల్ని కరుణించదు. ఒట్టు పెట్టుకున్నట్టుగా వారి నీడను కూడా తాకదు.

చిక్కని భావాన్ని చక్కగా పాడి వినిపించాడు దత్తుడు. సంతోషించాడు రాజు. ఆ పాటనే పదే పదే పాడి వినిపించుకున్నాడు. తర్వాత దత్తుణ్ణి అభినందిస్తూ మణి మాణిక్యాలు, రత్నాలు, బంగారం ఉన్న గుమ్మడిపండును అతనికి కానుకగా అందజేశాడు.

''నాకు గుమ్మడి పండంటే ఇష్టం. నా ఇష్టమే నీకు కానుకగా ఇస్తున్నాను'' అన్నాడు రాజు నవ్వుతూ. అందుకున్న లబ్ధదత్తుని ముఖం ముడుచుకుని పోయింది. చేతిలో ఉన్నది మామూలు గుమ్మడి పండు అనుకున్నాడతను. సభలోని వారు కూడా అలాగే అనుకున్నారు. పాపం! దత్తుడు దురదృష్టవంతుడనుకున్నారు. రాజుగారి మనసు కరగలేదనుకున్నారు.

చేతిలోని గుమ్మడిపండును చీదరగా చూస్తూ సభామండపం నుంచి బయట పడ్డాడు లబ్ధదత్తుడు. దానిని ఏదో మూల పారవేద్దామనుకున్నాడు. అంతలో రాజవంది కనిపించాడతనికి. రాజవంది బౌద్ధ భిక్షువు. అతను రాజదర్శనం కోసం వెళ్తున్నాడు. రాజును దర్శించుకునేటప్పుడు బహుమతిగా అతనికి ఇష్టమయిన గుమ్మడిపండు ఇవ్వడం బాగుంటుదనుకున్నాడతను. లబ్ధదత్తుణ్ణి అడిగాడిలా.

''నా దగ్గరున్న దుప్పటి నీకిస్తాను. నీ చేతిలోని గుమ్మడిపండు నాకిస్తావా''

''నిరభ్యంతరంగా'' అన్నాడు దత్తుడు. భిక్షువు దగ్గరి దుప్పటి తీసుకుని, అందుకు బదులుగా గుమ్మడిపండును అతనికి అందజేశాడు. భిక్షువు రాజ దర్శనం చేసుకుని, అతనికి కానుకగా గుమ్మడిపండును ఇవ్వజూపాడు.

''ఇది మీకెక్కడిది'' అడిగాడు రాజు. దత్తుని దగ్గర తీసుకున్నానని చెప్పాడతను. దత్తుని ఇంకా దురదృష్టం వెంటాడుతోందయితే! లక్ష్మీదేవి కరుణించలేదనుకున్నాడు రాజు. మర్నాడు మళ్ళీ దత్తుణ్ణి సభామండపానికి పిలిచాడు రాజు. పాడిన పాటనే పాడమన్నాడు. పాడాడు దత్తుడు. భిక్షువు ఇచ్చిన గుమ్మడిపండునే దత్తునికి కానుకగా ఇచ్చాడు రాజు. దత్తుడు మళ్ళీ ముఖం ముడుచుకున్నాడు. సభలోని వారు ఈసారి కూడా రాజానుగ్రహం పాపం లభించలేదనుకున్నారు. గుమ్మడిపండును పారవేసే

ఉద్దేశంతో రాచబాటలో చాటుకు తప్పుకుంటున్న దత్తునికి ఎదురుగా వచ్చాడో వైశ్యుడు. అతను రాజదర్శనం కోసం వెళ్తున్నాడు. పచ్చగా గుమ్మడిపండు ఎదురుపడడం శుభసూచికం అనుకున్నాడు. రాజుగారికి గుమ్మడిపండంటే ఇష్టం కాబట్టి దానిని కొనుగోలు చేయడం మంచిదనుకున్నాడు. అతని చేతిలో పట్టు ఉత్తరీయం ఉంది. దానిని దత్తునికిచ్చి, గుమ్మడిపండు తీసుకున్నాడు. రాజుగారిని కలిశాడు వైశ్యుడు. కానుకగా గుమ్మడిపండు అందజేశాడు.

"ఇది మీకెక్కడిది" అడిగాడు రాజు. దత్తుని దగ్గర కొనుగోలు చేసిన సంగతి చెప్పాడు వైశ్యుడు. పాపం! లక్ష్మీదేవి ఇంకా దత్తుని కరుణించట్లేదనుకున్నాడు రాజు. మర్నాడు మళ్ళీ దత్తుని పిలిచి, వైశ్యుడిచ్చిన గుమ్మడిపండునే అతనికి ఇచ్చి వెళ్ళి రమ్మన్నాడు. సభలోని వారంతా ఆశ్చర్యంగా చూశారా దృశ్యాన్ని. ప్రతిరోజూ రాజు దత్తునికి గుమ్మడిపండు ఇవ్వడం పద్ధతిగా లేదనుకున్నారు. లేదా పోదా? తలచుకుంటే రాజుగారు ఏదయినా ఈయగలరు. కావాలనే గుమ్మడిపండు ఇచ్చి దత్తుని ఏడిపిస్తున్నాడనుకున్నారు. గుమ్మడిపండుతో దిగులుగా వీధిలో నడిచి వస్తోన్న దత్తుణ్ణి రాజనర్తకి చూసింది. పచ్చగా పండు బాగున్నదనుకుంది. రాజుగారికి గుమ్మడిపండంటే ఇష్టం. గుమ్మడిపండు కూరన్నా, పులుసన్నా ప్రీతిగా తింటాడతను. అతనికి దీనిని కానుగ్గా ఇవ్వడం బాగుంటుందనుకుంది. చేతికున్న బంగారుగాజును ఒకదాన్ని తొలగించి, దానిని దత్తునికిచ్చి, గుమ్మడిపండును అందుకుందామె. తీసుకుని వెళ్ళి రాజుకి కానుగ్గా అందజేసింది.

"దత్తుడిచ్చాడా" అడిగాడు రాజు. అవునంది నర్తకి. దత్తుణ్ణి లక్ష్మీదేవి ఇంకా కరుణించట్లేదనుకున్నాడు రాజు. పుణ్యహీనుడు. కాబట్టే లక్ష్మీదేవిని గుర్తించలేకపోతున్నాడు. అలాగే తన దయను కూడా గుర్తించలేకపోతున్నాడు. గుర్తించగలిగితే గుమ్మడిపండును వారికీ వీరికీ అందజేసేవాడు కాదు, కోసి చూసుకునేవాడు. లక్ష్మిని ప్రసన్నం చేసుకునే వాడనుకున్నాడు రాజు. మర్నాడు మళ్ళీ దత్తుణ్ణి సభకు ఆహ్వానించాడు. దత్తుడు అందంగా ఆకర్షణీయంగా ఉన్నాడా రోజు. భిక్షువు ఇచ్చిన దుప్పటిని పంచెగా ధరించాడు. పట్టు ఉత్తరీయాన్ని పైన వేసుకున్నాడు. కంకణంగా నర్తకి ఇచ్చిన గాజును చేతికి పెట్టుకుని కళకళలాడుతున్నాడు. నర్తకి ఇచ్చిన గుమ్మడిపండునే రాజు మళ్ళీ దత్తునకిచ్చాడు.

"కృతజ్ఞుణ్ణి" అన్నాడు దత్తుడు. అతనికీసారి గుమ్మడిపండు అందుకోవడం ఎందుకో ఆనందంగా ఉంది. ఆ ఆనందంలో దానిని కిందకి జారవిడుచుకున్నాడు. కిందపడి గుమ్మడిపండు పగిలింది. మణి మాణిక్యాలు, రత్నాలు, బంగారంతో దర్శనమిచ్చింది. సభలోని వారంతా అది చూసి ఆశ్చర్యపోయారు. లేచి నిల్చున్నారంతా. రాజుగారిని మూడు రోజులుగా తప్పుగా అర్థం చేసుకున్నామని బాధపడ్డారు. తలలు దించుకున్నారు. వారలా తలలు దించుకోవడాన్ని గమనించి, వారెందుకు తలలు దించుకున్నదీ అర్థం చేసుకున్న రాజు, సభలో అందర్నీ ఉద్దేశించి ఇలా అన్నాడు.

"దత్తునికి లక్ష్మీకటాక్షం ఉన్నదో లేదో పరిశీలించాలనుకున్నాను. గత మూడు రోజులుగా లేకుండాపోయింది. ఈరోజు ఆ తల్లి కరుణించింది. కటాక్షించింది. అందుకే దత్తుడు కళకళలాడిపోతున్నాడు"

దత్తుని ఆనందానికి అంతులేకుండాపోయింది. కిందపడ్డ మణి మాణిక్యాలను, రత్నాలను, బంగారాన్ని పోగు చేసుకోసాగాడు. పగిలిన గుమ్మడిపండును పదేపదే ముద్దుపెట్టుకోసాగాడు.

సభలోని వారు అది చూసి పగలబడి నవ్వారు.

అదృష్టం

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు 'అనీలజ' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

హర్షపురంలో సముద్ర శూరుడు అని ఒక వర్తకుడు ఉండే వాడు. గొప్ప వంశానికి చెందిన వాడతను. ధర్మాధర్మ విచక్షణ కలవాడు. ధీరుడు. ధనవంతుడు. సద్గుణాలకు అతను పెట్టింది పేరు. సువర్ణ ద్వీపంలో వ్యాపారం చేసేందుకు ఒక నాడు అతను సముద్రం మీద ప్రయాణిస్తుండగా తుపాను చెలరేగింది. పెద్ద పెద్ద అలలు ఎగిసిపడ్డాయి. ఆ అలలకి ఓడలోని వస్తువులన్నీ కొట్టుకుని పోయాయి. చూస్తుండగానే కళ్ళ ముందు వ్యాపార సామగ్రి అంతా కొట్టుకుని పోవడం పెను బాధనిపించింది. ఏడుపొచ్చిందతనికి. ఏడుస్తూండగానే ప్రయాణిస్తోన్న ఓడ రెండు ముక్కలయింది. ప్రాణాన్ని కాపాడుకునేందుకు సముద్రంలోకి దూకేశాడు శూరుడు.

ఏడుపు మరచిపోయాడు. ఈదసాగాడు. అంతలో శవం ఒకటి తన వైపుగా కొట్టుకు రావడంతో దాన్ని ఆసరా చేసుకున్నాడు. రాత్రంతా ఈది ఈది ఆఖరికి ఓ ద్వీపానికి చేరుకున్నాడు. ఆ ద్వీపం పేరు కలశపురం. ఒడ్డుకు చేరుకుని శవాన్ని నీటిలోకి వదిలే ప్రయత్నంలో ఆ శవం నడుమునకు మూటగా ఏదో వేలాడడాన్ని గమనించాడు. ఏమయి ఉంటుందా? అని దానిని విప్పి చూశాడు. కళ్ళు 'జిగేల్' మన్నాయి శూరుడికి. మూటలో రత్నాల కంఠాభరణం కనిపించింది. అందుకున్నాడు దాన్ని. అప్పుడు శవాన్ని పట్టి చూశాడు. ఎవరో పురుషుని శవం అది. కంఠాభరణాన్ని ముద్దుపెట్టుకుని ముందుకు కదిలాడు. దొరికిన కంఠాభరణం ముందు తుపానులో తను పోగొట్టుకున్న సామగ్రి లెక్కలోనిది కాదనుకున్నాడు. ఆనందపడ్డాడు. ఊరి లోనికి చేరుకున్నాడు. ఊరి మొదట్లోనే గుడి ఒకటి కనిపించిందతనికి. ప్రశాంతంగా ఉందక్కడ. ఈది ఈది అలసిపోయాడేమో అక్కడా ప్రశాంతతకి నిద్ర వచ్చిందతనికి. నిద్రపోయాడు.

ఎవరినో వెదుకుతున్నట్టుగా రాజభటులు వచ్చారక్కడికి. హడావుడి పడసాగారు. గుడిలో నిద్రపోతోన్న శూరుణ్ణి చూశారు. అతని చేతిలో కంఠాభరణాన్ని చూశారు.

''ఇడుగో దొంగ! పడుకున్నాడిక్కడ! ఇదిగిదిగో రాకుమారి చంద్రసేన కంఠాభరణం'' అన్నారు. శూరుణ్ణి లేపి, బంధించి రాజు దగ్గరకు తీసుకుని పోయారు.

''నీకీ కంఠాభరణం ఎక్కడిది'' అడిగాడు రాజు. తనకు ఆ నగ దొరికిన సంగతంతా వివరంగా చెప్పేడు శూరుడు. అతను చెప్పిందంతా కల్పితమని, కథ చెబుతున్నాడని కొట్టి పారేశారంతా. అబద్ధం ఆడుతున్నందుకు శూరుణ్ణి శిక్షించదలచాడు రాజు. ఇంతలో అతని చేతిలోని కంఠాభరణాన్ని ఎలా వచ్చిందో సభలోనికి వచ్చిన గద్ద తన్నుకుపోయింది. భటులు వెంబడించినా ఫలితం లేకపోయింది. దొరికినట్టే దొరికి రాకుమారి నగ పోయిన దుఃఖంలో రాజుగారు శూరు

కథా సరిత్సాగరం

నికి మరణదండన విధించారు. ఉరితీయమన్నారతన్ని. తను తప్పు చేయలేదని, తనకు ఆ నగ దొరికినదేనని ఎంత మొత్తుకున్నా రాజు వినకపోవడంతో శూరుడు దిక్కు తోచక శివుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు రాజుని ఉద్దేశించి ఆకాశవాణి పలికిందిలా.

"రాజా! శూరుడు చెప్పిందంతా నిజం! అతను దొంగ కాదు. సముద్ర వ్యాపారి. దొంగనుకుని నువ్వు అతన్ని ఉరితీయిస్తే మహాపాపం చేసిన వాడవుతావు. జరిగిందేదో జరిగిపోయింది. అనుమానించావు. అయిపోయింది. ఇప్పుడు నిజం తెలుసుకున్నావు కాబట్టి నీ తప్పు సరిదిద్దుకో! శూరుణ్ణి క్షమించమని వేడుకుని, అతన్ని సన్మానించి పంపు"

మరణదండన రద్దు చేసి శూరుణ్ణి క్షమించాడు రాజు. చేసిన తప్పుకు తనని క్షమించమన్నాడు. ఆకాశవాణి చెప్పినట్టుగానే అతన్ని సన్మానించి ధన కనక వస్తు వాహనాదులను కానుకగా అందజేశాడు. వాటన్నిటితో సముద్రాన్ని దాటాడు శూరుడు. తర్వాత అనేకమంది పాదచారులతో కలసి ప్రయాణించసాగాడు. అడవిలోకి ప్రవేశించారంతా. చీకటి పడింది. దొంగలొచ్చి పడ్డారు. అందింది దోచుకుని దొంగలు హింసిస్తోంటే వారి నుండి తప్పించుకునేందుకు దగ్గరలో ఉన్న మర్రిచెట్టు ఎక్కాడు శూరుడు. ధన కనక వస్తు వాహనాదులన్నీ దోచుకుని దొంగలు వెళ్ళిపోయారు. పాదచారులు కూడా ఎవరూ లేరు. అంతా చెట్టుకొకరు, పుట్టకొకరుగా పారిపోయారు. చీకటి చీకటిగా ఉందంతా. చెట్టు దిగి ఆ చీకటిలో చేసేదేమీ లేదనుకుని, రాత్రంతా చెట్టు మీదే గడిపాడు శూరుడు. రాజుగారిచ్చిన బహుమానాలు పోగొట్టుకున్నందుకు బాధపడ్డాడు, తనంత దురదృష్టవంతుడు లేడనుకున్నాడు. తెల్లారింది. తలెత్తి పైకి చూశాడు. పై కొమ్మ మీద గద్ద గూటిలోంచి లోపల దీపం ఉన్నట్టుగా కాంతి కనపడింది. ఏమయి ఉంటుందది? అనుకుంటూ పై కొమ్మ మీదికి చేరాడు శూరుడు. గద్ద గూటిలోకి తొంగి చూశాడు. ఆశ్చర్యం! లెక్కలేనన్ని రత్నాభరణాలు ఉన్నాయందులో. స్వర్ణద్వీపంలో తన దగ్గర్నుంచి గద్ద తన్నుకు పోయిన కంఠాభరణం కూడా ఉంది అందులో. వాటిన్నిటినీ రెండు చేతులా అందుకున్నాడు శూరుడు. తనకంటే అదృష్టవంతుడు లేడనుకున్నాడు. చెట్టు దిగి, హర్షపురానికి ఆనందంగా ప్రయాణించాడు. కొద్దోగొప్పో పుణ్యం చేసుకుంటే కష్టాలొచ్చినా తట్టుకోగలిగితే అంతా శుభమే అనుకున్నాడు.

★

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు '**అనీలజ**' నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

తెలివి

అనగనగా రత్నపురం. అక్కడ రామకృష్ణుడు అని బాగా తెలివితేటలు గల ఓ వ్యక్తి ఉండేవాడు. తన తెలివితేటలతో ఎదుటి వ్యక్తుల్ని బురిడీ కొట్టించి బతుకుతుండేవాడు. చిన్న చిన్న బురిడీలతో రెండు పూటలా భోజనం, వేలకొలదీ వరహాలు మాత్రమే సంపాదించుకోగలిగేవాడు. ఇది సరికాదనుకున్నాడు. ఉన్న తెలివితేటలతో డబ్బు బాగా సంపాదించాలి. కోటీశ్వరుడైపోవాలని కలలుగన్నాడు. కన్న కలలను నిజం చేసుకునేందుకు ప్రయత్నించసాగాడు. ఆ ప్రయత్నంలో భాగంగా ఒకనాడు పెద్ద వర్తకునిలా వేష భాషలు మార్చుకుని రాజ ద్వారం దగ్గర నిల్చున్నాడు. భటులు అతన్ని చూశారు.

"ఎక్కణ్ణుంచి వచ్చారయ్యా మీరు" అడిగారు.

"సింహపురి నుంచి వచ్చాను. నా పేరు



కథా సరిత్సాగరం

రామకృష్ణుడు. రత్నాల వ్యాపారిని. రాజుగారిని చూడాలనుకుంటున్నాను. అనుమతి ఇస్తారా'' అడిగాడు.

''అనుమతి ఇవ్వాల్సింది మేము కాదు, రాజుగారివ్వాలి. అడిగి చూస్తాం'' అన్నారు భటులు. వెళ్ళి రాజుగారిని అడిగారు.

''ప్రవేశపెట్టండి'' అనుమతించాడు రాజు. రామకృష్ణుడు ఆనందంగా ప్రవేశించాడు. రాజుకి రత్నాల హారాన్ని కానుకగా అందజేశాడు. చూశాడు రాజు దాన్ని. బాగున్నదని మెచ్చుకున్నాడు.

''చెప్పండి! నన్నెందుకు చూడాలనుకున్నారు'' అడిగాడు రాజు.

''ఆ విషయం మీతో ఏకాంతంగా మాట్లాడాలి'' అన్నాడు రామకృష్ణుడు.

''మాట్లాడండి'' అంటూ తన ఏకాంత మందిరానికి దారి తీశాడు రాజు. అతన్ని అనుసరించి వచ్చాడు రామకృష్ణుడు.

''చెప్పండి ఏం మాట్లాడదలచారు'' అడిగాడు రాజు.

''ఇంకేం లేదు మహాప్రభూ! మీరు నాకో చిన్న సాయం చెయ్యాలి''

''తప్పకుండా చేస్తాం. ఏం కావాలో కోరుకోండి''

''సభలో అందరూ చూస్తుండగా మీరు నాతో ప్రతి రోజూ ఓ క్షణం మాట్లాడాలి. నేను అడిగినప్పుడు మాట్లాడాలి. ఇది నా ప్రార్థన'' అన్నాడు రామకృష్ణుడు.

''ఏం మాట్లాడాలి''

''ఏదో ఒకటి...నా చెవిలో ఒకటి రెండు అంటూ పదివరకు అంకెలు లెక్కపెట్టండి చాలు! అయితే అవి నాకు మాత్రమే వినిపించాలి'' అన్నాడు రామకృష్ణుడు. చిత్రంగా ఉందే ఇతని కోరిక అనుకున్నాడు రాజు. నవ్వొచ్చిందతనికి. నవ్వుకున్నాడు. 'సరే'నన్నాడు.

''మీరు ఊరికే అంకెలు లెక్కపెట్టనవసరం లేదు. మీరు నా చెవిలో పది అంకెలు లెక్కపెట్టినందుగ్గాను మీకు రోజూ నేను అయిదు వందల వరహాలిచ్చుకుంటాను'' అన్నాడు రామకృష్ణుడు.

''బాగుందిది'' అని పగలబడి నవ్వాడు రాజు.

''అయిదు వందల వరహాలిస్తానంటే చెవిలో పది అంకెలేం ఖర్మ! పాతిక అంకెలు లెక్కపెడతాను'' అన్నాడు రాజు.

అన్నట్టుగానే సభలో అందరూ చూస్తూండగా రామకృష్ణుడి చెవిలో అతనికి మాత్రమే వినబడేట్టుగా రోజూ రాజు పది అంకెలు లెక్కబెట్టేవాడు. అలా అంకెలు లెక్కబెట్టినందుగ్గాను రామకృష్ణుడు రాజుగారికి అయిదు వందల వరహాలిచ్చేవాడు. ఓ నెల గడిచింది. ప్రతిరోజూ రాజుగారు రామకృష్ణుడితో చెవిలో మాట్లాడడాన్ని గమనించిన సభలోని వారు, రామకృష్ణుడు తక్కువ వాడు కాదని, రాజుకి బాగా కావాల్సిన వాడనే నిర్ణయానికి వచ్చారు. ఇంతలో కష్టానికీ నష్టానికీ దాచుకున్న డబ్బంతా కరిగిపోవడంతో రామకృష్ణుడు కూడా ఓ నిర్ణయానికి వచ్చాడు. దాని ప్రకారం సభలో ఓ అధికారిని పదే పదే చూడసాగాడు రామకృష్ణుడు. చూసి చూసి రాజుతో ఇలా అన్నాడు.

''ఏదీ అంకెలు నా చెవిలో లెక్కపెట్టండి''

రాజు అంకెలు లెక్కపెట్టేడు. 'చాలు' అన్నట్టుగా వారించాడు రామకృష్ణుడు. వారించి మళ్ళీ అధికారిని చూడసాగాడు. సభ ముగిసింది. రామకృష్ణుడు బయటకు నడిచాడు. అతన్ని అనుసరించాడు అధికారి.

''నేనేం తప్పు చేశానయ్యా, నా గురించి మీరూ రాజుగారూ మాట్లాడుకున్నారు'' అడిగాడు అధికారి.

''ఏం తప్పు చేశావో నేను చెప్పను! నీకే తెలుసు! అది నిజమా? కాదా అన్నది రాజుగారు నన్నడిగారు. తెలుసుకుని చెబుతానన్నాను'' అన్నాడు రామకృష్ణుడు. అధికారి రాజుగారికి తెలియకుండా చాలా తప్పులు చేశాడు. ఏ తప్పన్నది అతనికి కూడా అంతు చిక్కడం లేదు. ప్రమాదం నుండి గట్టెక్కాలనుకున్నాడతను. ఆధారంగా రామకృష్ణుణ్ణే పట్టుకున్నాడు.

''తెలియక ఏదో తప్పు చేశాను. మీరే నన్ను కాపాడాలి'' అన్నాడు అధికారి. వెయ్యి వరహాలు రామకృష్ణుడికి లంచంగా ఇచ్చాడు.

''సరే! నేను చూసుకుంటాను'' అన్నాడు రామకృష్ణుడు. మర్నాడు రాజుగారితో అంకెల లెక్కపెట్టమని అడిగి, రాజుగారు అంకెలు లెక్కపెట్టడంతో బయటికి వచ్చాడు రామకృష్ణుడు. అధికారి అతన్ని అనుసరించి పరుగు పరుగున వచ్చాడు.

''రాజుగారు నిన్ను క్షమించేరు. నీకింకేం భయం లేదు'' అన్నాడు రామకృష్ణుడు.

''కృతజ్ఞుణ్ణి'' ఆనందించాడు అధికారి. అప్పట్నుంచి అదే పనిగా సభలోని మంత్రి సామంతుల్ని, రకరకాల అధికారుల్ని రామకృష్ణుడు చూస్తూ ముందు రీతిలోనే లంచాలు గడించసాగాడు. పది కోట్ల వరహాలు సంపాదించాడతను. అనుకున్నట్టుగానే కోటీశ్వరుడయిపోయాడు. అయిన దగ్గర్నుంచి తను చేస్తోన్నది తప్పు అని తెలుసుకున్నాడు. అక్రమార్జన ఇంట్లో ఉంచుకోవడం ఇష్టం లేకపోయిందతనికి.

రాజుని కలిసి జరిగిందంతా వివరించాడు.

''మీకు ప్రతిరోజూ అయిదు వందల వరహాలిస్తూ కూడా నేను పదికోట్ల వరహాలు సంపాదించగలిగాను. తప్పు చేశాను. పైగా ఆ పదికోట్ల వరహాలూ అనేక మంది అనేక రకాలుగా మీ రాజ్యం నుంచి కొల్లగొట్టిందే! అంటే ఆ డబ్బు మీదే! మీరే స్వీకరించండి'' అని పదికోట్ల వరహాలూ రాజుకి అందజేశాడు రామకృష్ణుడు. అతనిలో వచ్చిన మార్పునకు ఆనందించిన రాజు, రామకృష్ణుణ్ణి సామంతునిగా చేసుకున్నాడు. ఓ రాజ్యానికి అతన్ని రాజుని చేశాడు. అంతేకాదు, తనకి ప్రధాన సలహాదారునిగా కూడా నియమించుకున్నాడు.

అందుకే అంటారు, నుయ్యి తవ్వుతోంటే కాసుల బిందెలు దొరికినట్టు తెలివిగల వాడు పెద్దగా కష్టపడనక్కరలేకుండానే డబ్బు సంపాదించగలడని!

★

కొండచిలువ

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమ దేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

పూర్వం పాటలీపుత్రంలో యజ్ఞసోముడు, కీర్తి సోముడు అని ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. పెద్దలు సంపాదించి పెట్టిన ఆస్తిని ఇద్దరూ సమానంగా పంచుకున్నారు. యజ్ఞసోముడు తన వాటాసంతా ఖర్చు చేసుకుని నిరుపేదయితే కీర్తి సోముడు తన వాటా సొమ్మును పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేసుకుని వృద్ధిలోకి వచ్చాడు. పేదరికాన్ని అనుభవిస్తూ బంధువుల మధ్య ఉండలేక యజ్ఞసోముడు వేరే వూరికి వెళ్ళిపోయే ప్రయత్నాల్లో పడ్డాడు. ప్రయాణానికి భార్యను సిద్ధంకా అన్నాడు.

''చేతిలో చిల్లిగవ్వ లేకుండా ప్రయాణం ఏమిటండీ'' అడిగింది భార్య.

''కష్టమే! కాని తప్పదు! ఈ వూరిలో ఉండలేను'' అన్నాడు యజ్ఞసోముడు.

''మీ తమ్ముడు కీర్తిసోముణ్ణి అడిగి చూడండి! ఓ నాలుగు వరహాలిచ్చినా దారి ఖర్చులకు ఉంటాయి'' అంది భార్య. సరేనని తమ్ముణ్ణి కలిశాడు యజ్ఞసోముడు. దారి ఖర్చులడిగాడు.

''ఇస్తానుండు'' అని కీర్తిసోముడు వరహాల మూట విప్పుతున్నాడో లేదో అంతలో అతని భార్య అక్కడికి విసురుగా వచ్చింది.

''ఎవరెక్కడికో పోతూ దారి ఖర్చులు మనల్ని అడిగితే ఎలాగండీ? మన దగ్గరేమయినా డబ్బు మూలుగుతోందా? అడగడానికి సిగ్గుండాలి. ఆగండి'' భర్తను అడ్డుకుందామె. అన్న మీద అభిమానం ఉన్నా ఏమీ చేయలేని స్థితి. కీర్తిసోముడు తప్పు చేసిన వాడిలా తలదించుకున్నాడు. తమ్ముడిక సాయం చేయలేడనుకుని, వెనుతిరిగాడు యజ్ఞసోముడు. జరిగిందంతా భార్యకు చెప్పి విలపించాడు.

''బాధపడకండి! దేవుడు ఎలా నిర్ణయిస్తే అలా జరుగుతుంది. పదండి'' అంది భార్య. యజ్ఞసోముడితో అడవులలో ప్రయాణించసాగింది.

కొద్దిరోజులు గడిచాయి. ఒకనాడు అడవిలో వారు నడుస్తుండగా కొండచిలువ ఒకటి జరజరమంటూ వచ్చి యజ్ఞసోముణ్ణి అమాంతం మింగేసింది. అది చూసి భార్య భోరు భోరున విలపించసాగింది.

''ఎందుకు ఏడుస్తున్నావు'' అడిగింది కొండచిలువ.

''నా భిక్షాపాత్రను మింగేశావు నువ్వు. అతన్ని చూపించి పదిళ్ళ ముందు బిచ్చమెత్తుకుందామనుకున్నాను. చేతిలో పాత్ర లేకుండా చేశావు'' అన్నదామె.

''నీకు కావాల్సింది భిక్షాపాత్రే కదా! నేనిస్తానుండు'' అని బంగారు భిక్షాపాత్రను కక్కిందా కొండచిలువ.

''తీసుకో'' అంది. అందుకుందామె. మెరిసిపోతున్న పాత్రను తిప్పి తిప్పి చూసి ఇలా అంది.

''ఆడదాన్ని. పైగా ఒంటరిదాన్ని. చేతిలో ఉన్నదేమో బంగారు పాత్ర. భిక్ష వేస్తారంటావా నాకు''

''నువ్వు అడిగిన వెంటనే ఎవరయినా సరే భిక్ష వెయ్యాలి. వెయ్యకపోతే వారి తల పగిలి చచ్చిపోతారు'' అంది కొండచిలువ.

''ఇది నీకు శాపమో వరమో మాటిచ్చాను. తప్పదు'' అంది మళ్ళీ.

అదే అవకాశమనుకున్నది యజ్ఞసోముని భార్య. ఇలా అడిగింది.

''అయితే నువ్వే ముందుగా నాకు పతిభిక్ష పెట్టు'' భిక్షాపాత్రను కొండచిలువ ముందుంచింది. ఆమె మాట పూర్తి కానేలేదు, యజ్ఞసోముణ్ణి కక్కి, చూస్తూండగానే కొండ చిలువ ఓ దివ్యపురుషునిగా అవతరించింది. యజ్ఞసోముడు, అతని భార్యా ఆ దివ్యపురుషునికి నమస్కరించారు.

''నా పేరు కాంచనవేగుడు. విద్యాధరపతిని. ఓ ముని శాపం వలన ఇలా కొండచిలువనయ్యాను. పతివ్రతతో సంభాషిస్తే నాకు శాప విమోచనం అవుతుందన్నారు. ఇన్నాళ్ళకు నన్ను కరుణించిన దేవతగా నీవు సాక్షాత్కరించావు. అందుకు కృతజ్ఞుణ్ణి'' కాంచనవేగుడు, యజ్ఞసోముని భార్యకు ప్రతి నమస్కారం చేశాడు.

''నీ భిక్షాపాత్రను మణి మాణిక్యాలు, రత్నాలతో నింపుతాను. ఇకపై మీకు పేదరికమే ఉండదు'' అన్నాడతను. అన్నట్టుగానే ఆమె చేతిలోని భిక్షాపాత్రను మణిమయం చేసి కాంచనవేగుడు అదృశ్యమయ్యాడు.

★

కథా సరిత్సాగరం

గుర్తు

సముద్ర ప్రయాణం చేస్తున్నాడతను. ఓడలో నిల్చుని ఉండి, వెండిగిన్నెతో పాలు తాగుతున్నాడు. ఎలా జరిగిందో ఎందుకు జరిగిందో జరిగిందది. అతని చేతిలోంచి జారిపడి వెండిగిన్నె సముద్రంలో పడిపోయింది. పడిన చోటును జాగ్రత్తగా గమనించాడతను. నీరు సుడులు తిరుగుతోందక్కడ. అలాగే బుడగలు కూడా చాలా ఉన్నాయి. గిన్నె ఇక్కడ పడిందయితే! తిరుగుప్రయాణంలో వచ్చి తీసుకుందామనుకున్నాడతను. ఈత వచ్చుతనికి. అయితే ఇప్పుడతనికి సమయం లేదు. అవతల పని ఒత్తిడి చాలా ఉందని ఊరుకున్నాడు. కొద్దిరోజులకి తిరుగు ప్రయాణమయ్యాడు. సుడులు తిరుగుతోన్న నీటిని, బుడగల్ని చూసి వెండిగిన్నె కోసం సముద్రంలోకి దూకాడు. నీటిలో వెదకసాగాడు. తోటి ప్రయాణికులు కేకేసి అడిగారు.

"ఏంటయ్యా వెతుకుతున్నావు"

విషయం చెప్పాడతను. విన్నవారు నవ్వుకోసాగారు.

★

భారతీయ కథా సాహిత్యంలో 'బృహత్కథ'ను ప్రముఖంగా పేర్కొంటారు. దీనిని 'గుణాఢ్యుడు' పైశాచీ ప్రాకృత భాషలో రచించాడు. సంస్కృత భాషలో దీనిని సోమదేవుడు 'కథా సరిత్సాగరం' పేరిట అనువదించాడు. పండిత పామర రంజకంగా సాగే ఈ కథలను ఇప్పుడు **'అనీలజ'** నవ్య పాఠకుల కోసం తెలుగులో సరళ వ్యవహారికంలో అందిస్తున్నారు. చదివి ఆనందించండి!!

జోస్యుడు

వాడో జోస్యుడు. బుద్ధి అన్నది లేదు వాడికి. బతకడానికి భార్యాబిడ్డలతో ఊరికాని ఊరికి వచ్చాడు. అక్కడ తానో జోస్యుడిగా పేరు ప్రఖ్యాతులు సాధించేందుకు, డబ్బు సంపాదించేందుకు ఎత్తు వేశాడు. కన్న కొడుకుల్లో ఓ కొడుకుని పట్టుకుని నడివీధిలో ఏడవసాగాడు.

"ఎందుకేడుస్తున్నావయ్యా" అడిగారు జనం.

"నా బాధలు ఏం చెప్పమంటారు" అన్నాడు. తర్వాత ఇలా చెప్పుకొచ్చాడు.

"నా ఖర్మ కాలి నాకు భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసు! నేనో పెద్ద జోస్యుణ్ణి. వీడు నా కొడుకు. సరిగ్గా నేటికి తొమ్మిదవ రోజు వీడు చనిపోతాడు. వీడి గొంతు నులిమి ఎవరో చంపేస్తారు"

"పాపం" జాలిపడ్డారు జనం.

తొమ్మిదవ రోజొచ్చింది. ఇంకా తెలవార లేదు. చీకటి చీకటిగానే ఉంది. మెలకువ తెచ్చుకుని, నిద్రపోతున్న కొడుకుని చూశాడు జోస్యుడు. మంచి నిద్రలో ఉన్నాడు వాడు. అదే అదనుగా కొడుకు గొంతు నులిమి చంపేశాడు జోస్యుడు. తెల్లారింది. ఏడుస్తోన్న జోస్యుణ్ణీ, చచ్చిపడున్న అతని కొడుకునీ చూసి జనం ఆశ్చర్యపోయారు. చెప్పినట్టుగానే జరిగిందంటూ జోస్యునికి చేతులెత్తి నమస్కరించారంతా. చాలా పెద్ద జోస్యుడితను. ఇందులో అనుమానం లేదనుకున్నారు. కొద్దిరోజులకి అతన్ని సత్కరించి నెత్తిన పెట్టుకుని, ఊరేగించారు. డబ్బు కోసం, పేరు కోసం మూర్ఖులు ఎలాంటి పని నయినా చేస్తారు.

(అయిపోయింది)